# రామచంద్రుని సందేశాలు


## (Universal Messages)

రచయిత :

శ్రీ రామచంద్రజీ

శ్రీ రామచంద్ర మిషన్

షాజహాన్‌పూర్.



# విషయ సూచిక


1. తొలి సందేశము
2. శాశ్వత సత్యప్రాప్తికి సులభ మార్గము
3. రాజయోగ తత్వసారము
4. నా గురవర్యుల సందేశము
5. రాజయోగము
6. రాజయోగ సారము
7. చైతన్యవంతమైన రాజయోగము
8. రాజయోగ ప్రభావము
9. సూక్ష్మమైన రాజయోగము
10. ముక్తిని ప్రసాదించే ధర్మమార్గము
11. శాశ్వత సత్యప్రాప్తికి సూక్ష్మమార్గము
12. రాజయోగ మౌలిక సూత్రములు
13. అనంతంవైపు సాగు రాజయోగము
14. దైవస్మరణ
15. ప్రాణాహుతితో కూడిన రాజయోగము
16. ప్రాణాహుతితో మూలమువైపు మనయాత్ర
17. అనంతత్వానికి మార్గము
18. జీవిత లక్ష్యమునకు మార్గదర్శకుడు
19. సవరించిన పునర్నిర్మించిన రాజయోగము
20. సరళమైన రాజయోగము
21. సత్‌తత్వప్రాప్తిని పొందుటకు సహాయపడే గురువర్యులు
22. అనంతత్వ జ్యోతి
23. విశ్వ ప్రేమ
24. సత్‌తత్వాన్వేషణ
25. పరతత్వం పొందడానికి సులభమార్గము
26. పరిపూర్ణస్థితికి దారిచూపు రాజయోగము
27. సూక్ష్మమైన ఆధ్యాత్మిక మార్గము
28. ముక్తికి మార్గము చూపు రాజయోగము
29. ఆధ్యాత్మిక సాఫల్యతకు మార్గము
30. సత్‌తత్వసారమును గ్రహింపచేసే గురువర్యులు
31. అఘోరమువైపు ప్రయాణము
32. పరతత్వమునకు రాజయోగమార్గము
33. ఆధ్యాత్మిక లక్ష్యము
34. సత్‌తత్వప్రాప్తికి తపన
35. పారిస్ ప్రకటన

# 1. తొలి సందేశము

ప్రియ సోదరులలరా !

నా జీవితములో అధిక భాగాన్ని నేను సతతస్మరణకై అంకితం చేసాను. కృప వాత్సల్యములనే ఒడిలో పెంచిన నా గురువర్యులు ఫతేఘడ్ వాస్తవ్యులు సమర్థగురు మహాత్మ శ్రీ రామచంద్రజీ మహారాజ్ వారి పవిత్ర పాదాల వద్దకు ప్రవేశం పొందినప్పుడు నా వయస్సు ఇరవై రెండు సంవత్సరాలు. అప్పటి నుండి సదా నా గురువర్యుల భక్తిపూర్వక ఆరాధనే నా జీవితపు ఏకైక లక్ష్యం, ప్రధానమైన అన్వేషణ అయ్యింది. ఇది మొదటి నుండి ఈ చివరి వరకు (అనగా నా ప్రస్తుతస్థితి వరకు) కొనసాగుతోంది. ఆరాధనా లక్ష్యముగా వారినే నా హృదయములోకి తీసుకున్నాను. ఇతరులెవ్వరిని కూడా నా దృష్టిలోనికి ఎన్నడూ తీసికొనలేదు. ఇప్పుడు కూడా తీసికొనను. నా యీ భావాన్ని దైవం శాశ్వతంగా నిలిపి వుంచుగాక! నా గురువర్యుని తప్ప మరెవ్వరిని నేనే స్వీకరించలేదు. ఆయనపై గాక మరెవ్వరిపైనను ఆధారపడలేదు. సామాన్య నియమంగా యిది నిజమైన శిష్యుని ప్రాథమిక కర్తవ్యం, విజయానికి ఏకైక కీలకం. హృదయం నుండి మాలిన్యాలను తొలగించి మార్గమందలి సకల అవరోధములను అధిగమించుటకు సహాయపడే సాధనం అదొక్కటే. ఇది గ్రంథులను వికసింప జేస్తుంది. నిజానికి సమస్త సాధనల యొక్క యదార్థ సారం యిదే. ఒకసారి దానిని రుచి చూసినవాడు జీవితంలో ఎన్నటికి దానిని వదులుకోడు. అంతేగాక మరే వైపునకు మొగ్గడు. మన పూజ్య గురువర్యులు, మహా ఋషులందరూ అనుసరించిన విజయవంతమైన విధానమిదే. నాకు సంబంధించినంతవరకు, నా దైనందిన చర్య అంతటా ఈ పద్ధతి హృదయంలో దానంతట అదే కొనసాగి శాశ్వతంగా అలవాటుగా మారింది. క్లుప్తంగా, నా జీవిత దారి అదే. ప్రస్తుతం నా ఆధ్యాత్మిక ఔన్నత్యం వరకు గల అన్ని దశలను అధిగమించడానికి అది తోడ్పడింది. అందువలన నా జీవితానుభవం ఆధారంగా విజయవంతమైన ఫలితాలను, గురువు యొక్క సంపూర్ణ సహాయాదరణలను నిశ్చయంగా కలిగించే ఏకైక పద్ధతి యిదేనని నేను గట్టిగా చెప్పగలను. లోతుగా నాటుకునేటటువంటి దాని ప్రభావమును మీరందరూ సాధన పూర్వకంగా అనుభవించాలని నా కోరిక. ఈ పద్ధతిని అవలంభించాలని కోరేవారు దాని వివరాలను స్వయంగా అడిగి తెలుసుకోవచ్చును. ఇందులో దానికి అనేక దశలు వున్నాయి. అభ్యాసీ ఒక్కొక్క దశను అధిగమించినప్పుడు దాని తరువాత దశను గురించి అడుగవచ్చును. అంతేగాక సాధనా మార్గంలో అతని అనుభవాల దశల గురించి తెలుపుతూ వుండవచ్చును. ఈ విధానాన్ని

నా గురుదేవుల వారు జీవించివున్న కాలంలో నాకు తెలియజెప్పారు. కాని ఈ సందర్భంగా దృష్టిలో వుంచుకోవలసిన అత్యంత ముఖ్యమైన విషయం ఒకటుంది. అభ్యాసి దీనిని అనుసరించడానికి పూనుకున్నప్పుడు ఎటువంటి వ్యక్తి నుండి ఈ విధానాన్ని స్వీకరించాలో నిర్ణయించుకోవాలి. దీనికి నా గురువర్యుల దృష్టాంతం యిప్పటికే మన ముందుంది. పరిపూర్ణమైన సమత్వము మరియు సమతూకపు స్థితిలో లయమైన వారే దానికి అత్యంత అర్హుడైన వ్యక్తి, అటువంటి వారినే ఈ విధానానికి ఎంచుకోవాలి.

అధ్యాత్మిక శాస్త్రంపై ఆధారపడివున్న, ఈ అద్భుత పద్ధతి అభ్యాసికీ అపారమైన విలువగలిగినట్టిది. నా విషయంలో ఈ పద్ధతి దానంతట అదే ప్రారంభమయింది. వాస్తవానికి ఈ పద్ధతిలో గురువు రూపాన్ని ధ్యానించడం పరోక్షంగా కనబడుతుంది. అందువలన ధ్యానానికై చేపట్టే రూపం మహోత్కృష్టమైన సకల నైతిక ఆధ్యాత్మిక విలువలతో అనుగ్రహింపబడినట్టి మహా సమర్థుడైన వ్యక్తిఐవుండటం ముఖ్యావసరం. అట్టి సందర్భంలో ఈ పద్ధతి అభ్యాసిలో అటువంటి సద్గుణాలు పెంపొందడానికి ఉపకరిస్తుంది. ఈ విధానం ఒకానొక వైజ్ఞానిక శాస్త్ర సూత్రంపై ఆధారపడింది. అభ్యాసి ధ్యానం చేసేటప్పుడు అతడి భావనలు హృదయంలో శూన్యతను సృష్టిస్తాయి. ప్రకృతి ధర్మం ప్రకారం సమతుల్య స్థితి కొనసాగాలంటే ధ్యానం దేనిపై చేస్తున్నాడో దాని శక్తిచే ఆ శూన్యత నింపబడటం ప్రారంభమౌతుంది. అది జరుగుతూ వున్నంతకాలం ఆ శక్తి దానంతట అదే ప్రవహిస్తూ వుంటుంది. మానవుడు తనకు తాను గొప్పవాడుగా రూపొందనూ వచ్చు లేక పతనమూ కావచ్చు. ఇప్పుడది ఏవిధంగా జరుగుతుందో ఒక్క క్షణం ఆలోచిద్దాం. ప్రపంచం నల్లని వర్ణంతోవున్న సూక్ష్మాతి సూక్ష్మ పరమాణవులచే దట్టంగా కూర్చబడివుంది. కాని వాటి మధ్య అస్పష్టమైన కాంతి కూడవుంది. ప్రకృతి, పురుషుడు ప్రక్కప్రక్కనే ఉన్నాయనే భావాన్ని అది ధృవపరస్తుంది. దివ్యోన్ముఖులైన విజ్ఞులు, వివేకవంతులు ప్రకాశవంతమైన ఈ భావాన్ని దృష్టిలో వుంచుకొని లాభాన్ని పొందుతారు. దీనికి భిన్నంగా భౌతిక విషయాకర్షణకి లోబడినవారు, ఆ నల్లని పరమాణువులతో సంబంధాలనేర్పరచుకొని దానివలన స్థూలతర ఫలితాలను సంతరించుకుంటూనే ఉంటారు. నిరంతరాలోచనా పరంపర ఫలితంగా అవి ఘనీభవిస్తాయి. ఆలోచనలు భావముద్రలనేర్పరుస్తాయి. అవి బలీయమై ఆవరణల క్రింద ఏర్పడుతాయి. అవే మాయావిక ప్రభావాలు స్థిరపడడానికి అనుకూలమైన భూమికనేర్పరుస్తాయి. ఆ విధంగా శరీరాణువులపైబడిన ప్రభావం పొరపై ప్రసరించి మెదడు యొక్క కేంద్రంపై ప్రతిబింబిస్తుంది. ఇది సంస్కారము లేర్పడడానికి దారి తీస్తుంది. అవి లోతుగా నాటుకొని అతనిని సులభంగా లోబరుచుకుంటాయి. దుష్ట ప్రవృత్తులకు దోహదం చేసే పరిసర సాంగత్యాలకు అతడి మనస్సు మరింత గట్టిగా అంటిపెట్టుకునేటట్లు చేస్తాయి.

ఆ విధంగా అతడు హీనాతి హీనుడవుతాడు. ఈ దశలో సద్గురు శక్తి మాత్రమే అతడి ఆంతరంగిక స్థితిలో మార్పును తీసుకొనివచ్చి అతడిని కాపాడుతుంది.

అట్టి అద్భుత శక్తిని కలిగివుండి, సాధకునిలో, ఒక్క చూపు మాత్రాన్నే తేజోమయస్థితి కల్పించగలవాడే నిజమైన గురువు. అతడు మాత్రమే సాధకుని భావనలను చీకటి నుండి వెలుగు వైపుకు మరల్చగలడు. అప్పుడతడి నీచ ప్రవృత్తులు ఆ తేజస్సును గ్రహించడం ప్రారంభిస్తాయి. తేజస్సు వైపునకు అతడు మార్గము మరింత సుగమమై అతని అంతఃశక్తి పనిచేయడం ప్రారంభిస్తుంది. ఆ విధంగా అతని సమస్య పరిష్కారమై ప్రతికూల ప్రభావాల నుండి రక్షింపబడి తనకేది లాభమో దానిని మాత్రమే గ్రహిస్తాడు. విశేషకరమైన మరొక్క విషయమేమిటంటే గురువుయొక్క లయాన్ని అనుకరించడం. దీనిని అనుసరిస్తే ఇది ఎటువంటి దశనూ కూడా అధిగమించకుండా వదలదు. నేను అదే చేసాను. నా ప్రస్తుతస్థితి పొందడానికి అది సహాయ పడింది. మీ అందరికి కావలసిన సామర్థ్యాన్ని దైవం అనుగ్రహించు గాక !

మన సత్సంగంలో నేనొక విషయాన్ని ప్రవేశ పెట్టదలచుకున్నాను. సరిగ్గా రాత్రి తొమ్మిది గంటలకు ప్రతి అభ్యాసీ అతడు ఎప్పుడు ఎక్కడున్నా సరే తన పనిని ఆపి పదిహేను నిమిషాల పాటు సోదరీసోదరులు ఎల్లరు భక్తి ప్రేమలచే నింపబడుతున్నారని నిజమైన విశ్వాసం వారిలో దృఢంగా వృద్ధి చెందుతోందని ధ్యానంచేయాలి. దాని విలువ అపారమైంది. దీనిని వారి ప్రత్యక్షానుభవంతో మాత్రమే తెలిసికొనడం సాధ్యం అవుతుంది.

గురువర్యుల ఆశయం నెరవేరునట్లు కనబడే నేటి సమయం సంతోషకరమైనది. ప్రతి ఒక్కరు దానికై గట్టి ప్రయత్నం చేస్తున్నారు. కాని దైవం నిర్ణయించిన వాడు మాత్రమే విజయాన్ని సాధిస్తాడు. కాని గురువర్యుల సంస్థ, దాని వెనుకగల ఉద్దేశ్యం ఏమై వుండవచ్చును? దానికి సమాధానం సులభం. ఒక సమర్థ గురువు దివ్య లోకాలకు వెడుతున్నప్పుడు తన నుండి దీక్షపుచ్చుకున్న శిష్యులలో ఒకరిని తన ప్రతినిధిగా నియమించుట సామాన్యంగా జరుగుతుంది. ఆ ప్రతినిధి తన సహచరుల శ్రేయస్సును పరిరక్షించాలి. దానికై అతడు గురువర్యుల నుండే నేరుగా వెలుగును పొందుతాడు. వాస్తవానికి అతడి పని అత్యంత క్లిష్టమైనట్టిది. గురువు అనుమతిలేనిదే అతడు అంగుళం కూడా కదలడంకాని, ఒక్క నీటి చుక్కనైనా తీసికొనడంగాని చేయలేడు. అత్యంత స్వల్పమైన పొరబాటుకు కూడా గురువు యొక్క అయిష్టతకు గురి అవుతాడు.

గురువర్యులు తమ జీవితకాలంలోనే ఈ ప్రకటన ఎందుకు చేయలేదనే వివాదాస్పద విషయం ఒక్కటి తలెత్తుతుంది. దానికి కారణం వ్రాత ప్రతులలో యిదివరకే వివరించడం

అయింది. ఎవరైనా సరే పరిశీలించవచ్చును. ఇవి యితర వాస్తవాలు కూడా ప్రజలు సంతృప్తి పొందడానికి సరిపోతాయి. పరిస్థితులు కూడా వాటంతట అవే వాటిని వెల్లడి చేస్తున్నాయి. అంతేగాక ఏ గురువు కూడా భౌతికకాయాన్ని చాలించే చివరి క్షణంలోగా తన ప్రతినిధిని ప్రకటించాల్సిన అవసరం లేదు. దానికనేక దృష్టాంతాలున్నాయి. ఇంతకన్న ఋజువు అవసరం లేదు. కావున పైన చెప్పిన దాంతో సరిపోతుందని భావిస్తాను. ఎవరైనా ప్రయత్నించి విషయాలను తమకు తాము నిర్ధారించుకోవచ్చును. ఇదేకాక నా రోజువారి డైరీ (దినచర్య పుస్తకం) దానితోబాటు గురువర్యులు అప్పుడప్పుడు దానిపై చేసిన వ్యాఖ్య దీనికి సరిపడే సాక్ష్యం (రుజువు) గురువర్యులు వారి సహచరులతో మాట్లాడేటప్పుడు నా డైరీనుండి తరుచు ఉదహరించే వారు. దానినుండి వారు ఉదహరించిన వాక్యాలు "శ్రీరామ సందేశ్" అను గ్రంథంలో యిదివరకే కనబడ్డాయి. ఈ విషయాలు అన్నింటితోబాటు 1931 ఆగష్టు 15వ తేదీన (గురువర్యులు అనంతంలో లయమయిన రోజు) నా డైరీ వ్రాతప్రతి నా ప్రస్తుత స్థితిని గురించి స్పష్టమైన నిదర్శనాలు. ప్రతి ఒక్కరు వారికి ఏవిధంగా సాధ్యమైతే ఆ విధంగా దీన్ని నిర్ధారించుకోడానికి సాదరంగా ఆహ్వానిస్తున్నాను.

కాని స్వర్థపరులు కొందరు స్వలాభాపేక్షతో వాస్తవాలను అనేక విభిన్న మార్గాలలో తప్పుగా చిత్రీకరిస్తూ అపఖ్యాతిపాలు చేయడానికి ప్రయత్నిస్తున్నారు. అందువలన దానికి సంబంధించిన సంఘటనల వివరాలను మీ ముందుంచుతున్నాను. నా ప్రస్తుత స్థితి 1944 ఏప్రిల్ ఆఖరు వారంలో బహిర్గతం కాబడింది. గురువర్యులతో నేరుగా సంసర్గం ఏర్పడింది. ఆ ప్రకారము మే 4వ తేదీన వారి ప్రత్యక్ష ఆదేశాలు బద్ధుడనై పనిచేయడం ప్రారంభించాను. అవి సవివరంగా గ్రంథస్తం చేయబడ్డాయి. ఆ రోజునుండే వారి సహజరులందరికి ప్రాణాహుతినిస్తూ వారిలో పెడదారినిపట్టిన భావాలను (గురువర్యులు వాటిని నులిమివేయునట్లుండే పుండు బాధగా వర్ణించారు) అరికట్టడానికి ప్రయత్నించాను. దానికి వారు బ్రహ్మానంద స్థితిగా అపార్థం చేసుకున్నారు. కొంత కాలమట్లే సాగించాను, కాని దానివలన సాధించిన సత్ఫలితాలను ఇతరుల ప్రావీణ్యతకు ఆపాదించడం వలన ఆ తరువాత ఆపివేయమని నాకు ఆదేశం వచ్చింది. ఇది నాకెంతో విచారాన్ని కలిగించింది.

ప్రియ సోదరులారా ! ఈ విషయంలో నాకెటువంటి స్వలాభాపేక్ష లేదు. అంతేకాదు ధన కీర్తులకై ఎటువంటి కోరికా లేదు. మహా గురువర్యులతో సంబంధం పెట్టుకొన్న వారందరూ లాభాన్ని పొందాలని, గురువర్యుల ఆశయం నెరవేరాలని నా అభిలాష. ఇది మనందరికి సంతృప్తికారణం అవుతుంది.

ఇంతవరకు వున్న అనుసంధానము ఇప్పుడికలేదు. ఇది మీకాశ్చర్యాన్ని కలిగించవచ్చు. దివ్యాదేశాల ప్రకారం అది త్రెంపి వేయబడింది, దాని స్థానంలో మరొకటి ఏర్పరచబడింది. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా దాన్నే చేరుకోవాలి.

అందువలన మీరందరు క్రొత్తగా ఏర్పడ్డ ఈ అనుసంధానము వైపుకు మరలి మీ సంబంధాలను సరిదిద్ది చక్కపరచుటకు నాకు అవకాశాన్ని యివ్వండి. అదెంత త్వరగా జరిగితే అంత మేలు. అదిలేనినాడు గురువర్యుల అనంత కృప పోగొట్టుకోవడం జరుగుతుంది.

# 2. శాశ్వత సత్యప్రాప్తికి సులభ మార్గము

(ది.15-12-1957న గుల్బర్గా)

ప్రియ సోదరులరా !

మానవకోటితో నాకు గల అఖండ అనుబంధం వల్ల, నాలో అంతర్భాగమైయున్న నా సహచర ప్రాణుల హృదయాలలో, నీటిబుడగల వలె ఇవే భావములు ఉప్పొంగుటకు, వారి హృదయాలు శాంతి ఆనందములతో పొంగి పొర్లుటకు, నేను నా హృదయాంతర్గత భావాలను నివేదిస్తున్నాను. ఇక్కడ, తదితర ప్రదేశాలలో నున్న మీ అందరితోను నా హృదయం బంధింపబడి వుంది. క్రమేణ ఆ హృదయాలపై, ఎడతెగని నిశ్శబ్దతలో, ప్రభావము చూపేందుకు ప్రేరణ కలిగిస్తున్నది. కాని, పరతత్వ ప్రాప్తికి అవసరమైన తన ఆధ్యాత్మిక బాధ్యతలకు ప్రతి ప్రాణి మేల్కొనవలసి యున్నది.

మత సంబంధ శక్తి, ఏదో ఒక రూపంలో, నిరంతరము ప్రవహిస్తున్న దేశము మనది. జీవిత లక్ష్యాన్ని సాధించడానికి విభిన్న మార్గాలు అనుసరింపబడుతున్నవి. నిజమైన జీవితసారములో లీనమయ్యే విధంగా హృదయము దానితో నిజమైన సంబంధము కలిగియున్నట్లయితే, అవి సరియైనవే కావచ్చు. ఏ పరతత్వము నుండి మనము క్రిందకు దిగి వచ్చినామో, దానితో ఒకటై యుండుటయే మన పుట్టుక పెంపుదలలోని ఉద్దేశము. మనతోబాటు మనము ఆ అనంతత్వసారాన్నే తెచ్చుకున్నాము. ఆ అనంతత్వంలో లయమయ్యేందుకు అవసరమైన భావనా స్వేచ్ఛకై మనము దానితో అత్యంత సన్నిహితంగా ఉండడానికి ప్రయత్నించవలెను. దీనిని మనము ఉపేక్షచేస్తే మూలములో అనంతమైయున్న సత్‌తత్వముతో గాకి, భావనా చేతనతోనే ఉండిపోతాము. అత్యంతావశ్యకమైన ఆత్మతో మాట పలుకు లేక, మంత్రాలు వల్లించి ప్రార్థనలు మాత్రం చేస్తే అది సాధారణంగా ముఖస్తుతిగా మాత్రమే మిగిలిపోతుంది.

పరిష్కారం ప్రక్కనే ఉన్నా మహామహా బోధకులు, ఉన్నత స్థితుల సాధనకు ఏవేవో మార్గాలను పద్ధతులను సూచించడానికే ఎప్పుడూ చాలా చురుకుగా యోచించినారు. వాస్తవానికి, నీకు అతి దగ్గరి మార్గమే దైవమును చేరడానికి కూడ అతి దగ్గరి మార్గము. జీవిత లక్ష్యాన్ని సాధించడానికి అత్యంత సులువైన మార్గాన్ని అందించి, నా పూజ్య గురుదేవులు - ఫతేఘడ్ వాస్తవ్యులు సమర్థగురు మహాత్మ శ్రీ రామచంద్రజీ మహారాజ్ గారు, ఈ విషయంలో మానవాళికి

అద్భుత సేవ చేసినారు. వారు సూచించిన సాధనా మార్గాలు ఎంత సులభమైన వంటే, ఆ సౌలభ్యమే, అవి సామాన్యుల అవగాహనకు రాకుండా, వాటికి ముసుగైనది. సూక్ష్మాతి సూక్ష్మ వ్యక్తిత్వాన్ని ప్రాప్తింపచేసుకొనే దానికి సూక్ష్మములైన మార్గాలే అవసరము. సత్ తత్వప్రాప్తి చాలా కష్టమైన, క్లిష్టమైన పనియని చెప్పబడింది. ఇది ప్రజలకు నిరుత్సాహాన్ని కలిగించి, వారు దాని నుండి భయపడి పారిపోయేట్లు చేసింది. అటువంటి అభిప్రాయాలు మన ప్రగతి పథంలో సహకరించే ఏకైక పరికరమైన సంకల్పాన్ని బలహీనపరుస్తాయి, కాబట్టి వీటిని మనం మనస్సు నుండి తొలగించుకోవాలి.

నా వ్యక్తిగత అనుభవాన్ని పురస్కరించుకొని, అందరూ అతి సులువుగా అనుసరించగల సరళమైన సాధనా విధానాన్ని మీకు సూచిస్తాను. ఎవరైనా తమ హృదయాన్ని అమ్మగలిగితే, అంటే దివ్య ప్రభువుకు దానికి కానుకగా సమర్పింపగలిగితే, మరింక చేయవలసిన పని ఏమీ లేదు. సహజంగానే ఇది అతనిని అనంత పరతత్వంలో లయమయ్యే స్థితికి తీసుకు వస్తుంది. సూక్ష్మమైన సరళమైన ఈ పద్ధతిని అనుసరిస్తే, సాధనా ప్రారంభమే దాని చివరి స్థితిగా మారుతుంది. ఈ ప్రేరణ అతనిలోనికి దానికదే ప్రవహింప మొదలిడి వ్యక్తి మొత్తం ఉనికిని పరివర్తన చెందిస్తుంది. మన జీవితానికి అత్యంత ప్రీతికరమైన దానిని పొందుటకు, ఒక చిన్న హృదయాన్ని సమర్పించడం కంటే అత్యంత అర్హతగల కానుక మరింకేమి ఉంటుంది ?

మరొక్క విషయం : హృదయాన్ని అర్పించడానికి గట్టి సంకల్పము మాత్రమే సులువైన మార్గం. అయితే, ఈ సంకల్పము ఎంత సూక్ష్మము, తేలిక అయితే, దాని చర్య అంత ప్రతిభావంతంగా ఉంటుంది. చైతన్యపు లోపలి పొరలలో చాల లోతుగా వుండే అల్పమైన బీజము వంటి సంకల్ప చర్య త్వరలో తన శాఖలను నలుదెసల విస్తరించిన పరిపూర్ణమైన మహావృక్షంగా వృద్ధిచెందుతుంది.

ఈ విధానాన్ని అనుసరిస్తే, ప్రారంభదినం నుండే త్యాగబుద్ధి తప్పక ఏర్పడుతుంది. ధైర్యంగా అడుగుముందుకు వేయడమే దీనికి కావలసినది. నిజమైన అన్వేషికి వెలుగు లభించి అతడు తన నిజాత్మ పిలుపునకు మేల్కొనుగాక.

సర్వప్రాణులు తమ తమ నిజతత్వాలను తెలుసుకునేట్లు వారి అంతరంగము మేల్కొనుగాక అనే ప్రార్థనతో ముగిస్తాను. తథాస్తు.

# 3. రాజయోగ తత్వ సారము

(గుల్బర్గా శాఖ భవన ప్రారంభోత్సవ సందర్భముగా ఇచ్చిన సందేశము)

సరళమైన నా అభిప్రాయాలను మాటలలో మీకు చెప్పడమే గాక, ఆధ్యాత్మిక దేవాలయ నిర్మాణానికి సహాయపడేందుకు నా హృదయమే మీకు అర్పించడానికి నాకు చాల ఆనందంగా ఉన్నది. ఇక్కడ మన సంస్థ శాఖారూపంలో ఇప్పటికే పునాది వేయబడి యున్నది. మన సమర్థులైన సోదరులలో ఒకరైన శ్రీ రాఘవేంద్రరావు ఈ శాఖకు నిర్వాహకులు గాను, ప్రశిక్షకులుగా కూడ పనిచేస్తారు. ఇక దేవాలయ నిర్మాణానికి అవసరమైన వస్తు సముదాయాన్ని సమకూర్చవలసిన బాధ్యత మీపై యున్నది. ఈ వస్తు సముదాయంలో కొన్ని సత్యాలు సూత్రాలకు సంబంధించిన సిద్ధాంతపరమైన జ్ఞానము మాత్రమేగాక వ్యక్తిగత ప్రత్యక్షానుభవాలు ప్రధానంగా చోటుచేసుకుంటాయి. బలవంతంగా ఒప్పించబడిన సమ్మతి గణనీయం కాదు. ఒక విషయపు (సాధనా విధానపు) మంచి చెడుగులు ప్రత్యక్ష అనుభవము ద్వారా మాత్రమే సరిగా నిర్ణయించవలెను. కాబట్టి జీవిత సమస్య పరిష్కారానికి అనుభవైక పద్ధతే సరియైనది.

దృఢ విశ్వాసముతో (శ్రద్ధతో) మీరు నిజంగా సత్‌తత్వ ప్రాప్తికై ఆకాంక్షిస్తే, మీరు చేయవలసిన పని అంతా నిర్మల హృదయంతో ఆ అనంతత్వముతో సన్నిహిత సంబంధ మేర్పరచుకొని దానివైపు మీ దృష్టిని మరలించుట మాత్రమే. అప్పుడా దివ్య ప్రకంపన మీలోని నరనరాల గుండా ప్రవహించి నిజమైన భక్తి ప్రేమలు మీ హృదయాలలో రగుల్కొల్పుతుంది.

పరమాత్మ సరళుడు, సూక్ష్మాతిసూక్ష్ముడు. అత్యంత సూక్ష్మమైన పరమాత్మను సాక్షాత్కరింప చేసుకొనుటకు దానికి తగినట్లుగానే సరళము, సూక్ష్మమైన సాధనా మార్గములనే అనుసరించ వలెను. సరళమైన ఈ సమస్య పరిష్కారానికి చిక్కులతో కూడిన సాధనా విధానాలను ఉపయోగించినపుడే కష్టాలు కలుగుతాయి. మరొక విధంగా చెప్పాలంటే, దుస్తులు కుట్టే చిన్న సూదిని తీయడానికి వీరు పెద్ద 'క్రేను'ను ఉపయోగిస్తారన్నమాట.

స్థూలమైన, అపారదర్శకమైన పొరలను ఒకదానిపై ఒకటి చేర్చి వ్యక్తిగత భౌతిక యునికి రూపంలో మనమే మనదైన ఒక చిన్న సృష్టిని ఏర్పరచుకొని యున్నాము. ఇప్పుడు మనము చేయవలసిన పని అపారదర్శకమైన ఈ పొరలను ఒక్కటొక్కటిగా తొలగించుకొని, సృష్టి ప్రారంభ సమయంలో మనముండిన పరిపూర్ణ స్థితి (absolute state) పొందుట మాత్రమే. మన 'సహజమార్గ' తత్వసారమిదే. అంటే మనము మనదైన చిన్న సృష్టిని లయము చేయుట, లేక మనకు మనము పొరలచాటునుండి బయలుపడుట చేయవలెను.

ఈ ఫలాన్ని పొందడానికి సులువైన, రూఢియైన మార్గము మహోన్నతుడైన గురుదేవునకు నిన్ను నీవు వాస్తవముగా సమర్పించుకొని (శరణాగతిచెంది) ''జీవన్మృతుడవు'' కావలెను. ఈ శరణాగతి భావనను బలవంతంగా, యాంత్రికంగా ఏర్పరచుకుంటే అది యదార్థమైనది (శుద్ధమైనది) ఎప్పటికీ కానేరదు. నీ మనస్సుకు ఏమాత్రపు శ్రమగాని, ఒత్తిడిగాని కలిగించక, దానికదే (స్వతహాగా) ఈ స్థితి పెంపొందవలెను. శరణాగతుడవైనావనే భావన లేశమున్నా, అది సరియైన శరణాగతి కాదు. నీవు నిజంగా శరణాగతుడవైనావంటే ఇక నీవు చేయవలసినది ఏమిలేదని నా అభిప్రాయము. ఈ స్థితిలో నీవున్నప్పుడు నీవు ఆ సత్యతత్వంతో ఎల్లవేళల సన్నిహితుడవై యుంటావు. ఆ దివ్య తేజో ప్రవాహము నీలోనికి ఎడతెగకుండ ప్రవహిస్తుంది.

మీ జీవిత సమస్యలను సులభముగా అత్యంత సమర్థవంతమైన రీతిలో సాధ్యమైనంత తక్కువ వ్యవధిలో పరిష్కరించుకునేందుకు సహాయపడడానికే ఈ విషయాలన్ని ఇప్పుడు మీ దృష్టికి తేవడం జరిగింది. ఈ కృషిలో మీరందరూ విజయులు కావాలని నా ప్రార్థన. తథాస్తు.

# 4. నా గురువర్యుల సందేశము

(సెప్టెంబర్, 1960)

సమస్త మానవ కళ్యాణానికై ఉద్దేశించిన నా గురువర్యుల సందేశాన్ని మీకు అందించడం నాకెంతో ఆనందంగా ఉంది. ఆయన పవిత్ర శుభనామం సమర్థగురు మహాత్మా శ్రీ రామచంద్రజీ (యు.పి.లోని ఫతేగడ్‌కు చెందినవారు) ఆయన మన సంస్థకు ఆది గురువు. ఆయన తన జీవితాన్నంతటిని మానవాళి ఆధ్యాత్మిక సేవకై అంకితం చేసారు. ముక్తిని సాధించడం కష్టసాధ్యమని అందులో ఒక జీవితకాలంలోనే అది మరీ అసాధ్యమని సామాన్య జనబాహుళ్యం నమ్ముతారు. అది తప్పు అభిప్రాయం. మన యీ జీవితమే మనల్ని ముక్తిస్థాయికి తీసికొని పోగల ఆఖరి జీవితం కావచ్చు. సాధకునకు నిజమైన శ్రద్ధ వుండి, సరైన గురువు కలిగివున్న భాగ్యం లభించినప్పుడు వాస్తవానికి యీ జీవితంలోనే, అంతేకాదు, అందులో ఒక భాగంలో కూడ, ముక్తిని పొందడం తప్పక సాధ్యం కాగలదని మా సమర్థ గురువర్యులు నిర్భయంగా నొక్కి చెప్పారు. దీనిని ఆయన అనేక సందర్భాలలో నిరద్వనాత్మకంగా చేసి చూపెట్టారు. ప్రత్యక్షానుభవం మాత్రమే దీనిని ఋజువు పరచగలదు.

హృదయంపై ధ్యానం అనేది అత్యంత సులభమైన పద్ధతి అని ఆయన ఉపదేశించారు. ఇది యీ సంస్థలో అనుసరించబడుతోంది. ఇతర చోట్ల నాసికాగ్రం, భ్రూమధ్యము మొదలైన కొన్ని యితర స్థానాలపై ధ్యానం చేయమని బోధిస్తారు. అవి కూడ కొంతవరకు ఉపకరించవచ్చు. కాని నా అభిప్రాయంలో హృదయంపై ధ్యానం అత్యంత సులభం, ఫలప్రదం అయినట్టిది. ''రాజయోగ ప్రభావం''లో యీ విషయాన్ని తగినంతగ చర్చించి యున్నాను. మనం యింతవరకు బాహ్య విషయాలపై లగ్నమై ఉన్నాం. కాని యిప్పుడు మనస్సును లోనికి మరల్చి అంతర్ముఖులం కావాలి. మన ప్రయత్నాలలో విజయాన్ని పొందినప్పుడు మనం స్వతస్సిద్ధంగానే ఆధ్యాత్మికానుభవాలను పొందడం ప్రారంభిస్తాం. ఆధ్యాత్మిక మార్గంలో మన ప్రయాణం నిరాటంకంగా సాగిపోతుంది. ఇతర సాధనావిధానాలు కూడ కొంతవరకు సహాయపడవచ్చు. కాని మనం బాహ్య విషయాలలోనే అనురక్తులం అయి వున్నంత వరకు, మన దృష్టి మాత్రం ఎన్నటికి లోపలకు మళ్ళదనడం నిశ్చయం. అందువలన సరళంగాను, సహజంగాను వుండి ఎటువంటి స్థూల ప్రభావాలు లేకుండా వున్నవే అత్యంత సహాయకరములగు పద్ధతులు. అన్నింటికీ అతీతమైన అత్యంత సూక్ష్మాతిసూక్ష్మమైనటువంటి ''దానిని'' పొందడానికి మనల్ని అత్యంత తేలికగాను, అత్యంత సూక్ష్మంగాను తయారుచేసే పద్ధతుల వైపుకు మనం సహజంగానే

ఆకర్షితులం అవుతాం. చిన్నబిడ్డను నవ్వించదలచినప్పుడు మనం వానివలె అమాయకత్వాన్ని నటిస్తాం. అదేవిధంగా దైవప్రాప్తికి మనం ఆయనవలెనే తయారు కావాలి.

ఆధ్యాత్మికతకు అత్యంత అవసరమైన మరో విషయం సమత్వము. ఈ పదంలో విస్తారమైన భావం ఇమిడి వుంది. అది ఇతరులకు ఆమోదయోగ్యంగా వుండేటట్లు మన బాహ్య జీవన విధానాల్ని సరిదిద్దుకోవడానికి మాత్రమే సంబంధించినది కాదు. అది మన మానసిక శారీరక కార్యరంగానికంతటికి విస్తరించినటువంటి విషయం. మా పూజ్య గురువర్యుల అభిప్రాయంలో ఒక వ్యక్తికి ఏ విషయంలోనైనా సమత్వం లోపించినట్లయితే, అతడు ఎంత ఉన్నత స్థితులను పొందినప్పటికీ, ఆధ్యాత్మిక రంగంలో కనీసం అడుగు మోపినవానిగ కూడ పరిగణించనక్కర లేదు. నిజానికి సమత్వమనగా మనలోని అస్థిమిత ప్రవృత్తులు చాలవరకు సద్దుమణిగి వున్న రంగంలోకి మనం ప్రవేశించామని అర్థం. ఇంకా ఏదైనా మిగిలి వుంటే అది మనం విహరిస్తున్న మండలం యొక్క స్థితికి సంబంధించి వుంటుంది.

అన్ని మండలాల్లోను, కొన్ని గ్రంథులు వున్నాయి. సృష్టి కొరకు మూలము నుండి క్రిందికి ప్రకృతి శక్తిధార ప్రవహించినప్పుడు కలిగిన కుదుపులు గ్రంథులను ఏర్పరచాయి. అవి శక్తి కేంద్రాలయినాయి. ఈ ప్రవాహ ధారలగుండా మనం ఈదుకుంటూ పోవునప్పుడు ధ్యానశక్తి వలన ఈ గ్రంతులు వికసించి మన పురోగమనాన్ని మరింత సులభం సుగమం చేస్తాయి. ఇంకా పైకి వెళ్లినట్లయితే గ్రంథుల ప్రభావం తగ్గి, ఎంతో స్వచ్ఛంగ వున్న మండలాన్ని మనం ప్రవేశిస్తాం. ఈ విధంగా మనం దశల వారిగ పయనిస్తూ, మాయ దాదాపు పూర్తిగా నశించినట్టి స్థితిని చేరుకుంటాము. మహామహాఋషులు కూడ సాధారణంగా యింతవరకే వెళ్లగిగారు. కాని ఇంకా ఎంతో మిగిలి వుంది. ఆధ్యాత్మిక దృష్టితో పరిశీలిస్తే, మనం దాటినది కేవలం అయిదవ వృత్తమేనని ('సత్యోదయము' యందలి 23 వృత్తములు గల పటము), ఇంకా దాటవలసినవి పదకొండు వృత్తాలున్నాయని మాత్రం చెప్పగలను. మనం యీ పదహారింటిని దాటినప్పుడు, నేను ''రాజయోగ ప్రభావం''లో చెప్పిన కేంద్ర మండలంలో ప్రవేశిస్తాము. ఇంతకు పూర్వం సశరీరులైన ఆత్మలకు దీనిలోకి ప్రవేశం దుస్సాధ్యంగ వుండేది. కాని నా గురువర్యుల అద్భుత పరిశోధనా ఫలితంగా ఆ స్థితి యిప్పుడు భౌతిక శరీరంతోనే పొందడం సాధ్యమవుతుంది. ప్రజలు దీనిని నమ్మకపోవచ్చు. కాని ఒక వ్యక్తి దానికోసం పరిశ్రమించినప్పుడు గాని, లేక అతనికి, తన ప్రాణశక్తి ప్రసారంచే, ఆ స్థితి సందర్శనాన్ని కనీసం ఒక్క క్షణమైన కలిగించగల సమర్థ గురువు లభించినప్పుడు గాని, ఈ స్థితిని ప్రత్యక్షంగా అనుభూతి చెందవచ్చని నేను చెబుతాను.

భక్తిని గురించి చెప్పాలంటే, నా అంతర పరిశీలన వెళ్లగలిగినంతవరకు, జనులు సామాన్యంగా దేన్ని భక్తి అని భావిస్తారో అది వాస్తవానికి పొగడ్త మాత్రమేనని నేను నిర్భయంగా చెప్పగలను. నిజమైన భక్తి, పొగడ్త కంటే ఎంతో భిన్నమైనది. అది దైవంతో వుండే సరళమై, శక్తివంతమైన తిరుగులేనట్టి అనుబంధం. ప్రేమ బాధలుగ తెలియబడే వాటిని కూడ అనుభవించే వారు కొందరున్నారు. నా అభిప్రాయంలో అవి వ్రణం యొక్క పోటువంటి బాధలని వివరించడం మరింత సమంజసంగా వుంటుంది. అయితే అవి సాధారణమైన పొగడ్త స్థాయి కంటె కొంచెం ఉన్నతమైనవి కావచ్చు. దానిలో దైవ స్మరణ లేదు. కావున నేను దాన్ని వ్రణ బాధ అని అంటాను. అంటే మన భక్తి లేక దైవంతో మనకు గల అనురాగ బంధం ఉండవలసినట్లు లేదని దాని అర్థం. అది ఆశించిన స్థాయి కంటె తక్కువగ వుంటుంది. అటువంటి బాధకు గల ఏకైక చికిత్స విషపదార్థాన్ని తొలగించగల శస్త్రచికిత్స మాత్రమే. దాన్ని ఉపేక్షిస్తే కాలక్రమంలో అది చికిత్సకు సాధ్యపడని దీర్ఘకాలపు వ్రణంగా ఎదగవచ్చు. దుష్టసాంగత్యము, పరిసరాల ప్రభావంచే మన శరీరంలో పేరుకుపోయిన దైవవ్యతిరేకము, ఆధ్యాత్మిక విరుద్ధము అయిన పదార్థమే ఈ విష పదార్థం. పూజ లేక ధ్యానానికి మనం అనుసరించే పద్ధతులు మన హృదయాలలో నిజమైన ప్రేమను ప్రదర్శించేవిగా వుండాలనే నిర్ణయానికి అది మనల్ని తీసుకు వస్తుంది.

దైవప్రేమను పెంపొందడానికి అనేక మార్గాలున్నాయి. అందుకు పితృభావం, మాతృభావం, మిత్రభావం, గురుభావం వంటి అనేక భావాలను అనుసరించాలి. కాని నా అభిప్రాయంలో దైవాన్ని ప్రేయసిగ భావించడం మరింత శ్రేష్ఠము, అనుకూలము అయిన పద్ధతి. మనలను ప్రేమికునిగాను, దైవాన్ని ప్రేయసిగాను భావించి, అదే భావంతో పురోగమించినట్లయితే, మార్గం మరింత సులభం అవుతుంది. దీనివలన కలిగే ఫలితం ఏమిటంటే కొంత కాలానికి దైవమే ప్రేమికుడుగాను మనము ప్రేయసిగాను అవుతాం. నిజానికి ఇదే ధ్యానంలో నాలుగవ దశ. కాని యీ దశలో మనం గమ్యాన్ని సాధించామనుకుంటే, అది పెద్ద పొరపాటవుతుంది. ముందర యింకా ఎంతో వుంది. కాని అది మాటలకు అతీతం కావున, ప్రత్యక్షానుభవానికి మాత్రమే సంబంధించిన విషయం. మరింత ఆధ్యాత్మిక ప్రగతి కోసం అత్యంత ఉపయోగకరమైన విషయాలను నొక్కి చెప్పడానికే నేనిదంతా చెప్పాను.

కాని దురదృష్టవశాత్తు అంతిమ సిద్ధి యొక్క ప్రమాణం, అదేకాదు, పరిపూర్ణత్వపు ప్రమాణం కూడ ఎంతో దిగజారి, భక్తి చాల చవకబారు విషయంగా పరిణమించింది. అవి వాటి నిజమైన విలువను పూర్తిగ పోగొట్టుకొన్నాయి. కళ్లను వింతగ కదిలించడం కూడ భక్తిగా పరిగణింప బడుతోంది. దాని ప్రభావం వలన కలిగే అనుభవం ఒక ఉన్నత సిద్ధిగా భావింపబడుతోంది.

ఈనాడు ఒకడు గురువుగ అగుటకు యిది చాలని నేనర్థం చేసుకున్నాను. కాల పరిస్థితులు మరింత హీనమై, మనల్ని ఆ విధంగా మరింత హీనం కావించాయి. క్షీణ దశ ప్రారంభమై ప్రజల మనస్సులను సరైన మార్గం నుండి పెడత్రోవ పట్టిస్తోంది. వారు దానివలన సంపూర్ణంగ కళంకితులైనప్పుడు, అధఃపతన భావం వారి మనసుసలను పీడించడం మొదలెట్టింది. కాని వారు వున్నటువంటి అధఃపతన స్థితిలో వారు తప్పును ఒప్పుగ స్వీకరించి, అదే జీవిత సమస్యలకు సరైన పరిష్కారమని తలచి దానితోనే ముందుకు వెళ్ళారు. వారు దాన్నే బోధించారు. దాన్ని ప్రకాశవంతమైన రంగుల్లో చిత్రీకరించి, ప్రజలకు అందించి తమను స్వీకరించి, అనుసరించమని ప్రేరేపిస్తారు. వారెవ్వరిలోను కాంతికిరణం అనేది కనబడలేదు. విచక్షణా జ్ఞానం దాదాపు పూర్తిగా కోల్పోయేటంత మేరకు నైతిక భావం దిగజారిపోయింది. ద్వేషం ప్రబలి ఆ కారణంగా తీవ్ర కలహాలను తెచ్చుకోవడం లేక విధ్వంసక సంఘటనలలో పాల్గొనడం అనేది ఒక పవిత్రకార్యంగా భావించబడుతోంది. ప్రతిచోట దీని దృష్టాంతాలు విస్తారంగా కనబడుతున్నాయి. కొందరు ఇష్టదైవం ఉండాలనే భావాన్ని ప్రతిపాదిస్తారు. ఇతరులు రూపంలేని దైవాన్ని, ఇంకా మరికొందరు సగుణ, నిర్గుణ దైవ భావాలను ప్రతిపాదిస్తారు. విరోధానికి దారితీసే తీవ్ర వాదోపవాదాలు ప్రబలినాయి. అవి పరస్పర ద్వేష భావాలను కలిగించి వివాద కారణాలవుతున్నాయి. సగుణ నిర్గుణభావాలను సమర్థించేవారు, తామొకరితో నొకరు పోటీపడుతున్నప్పటికీ, నా అభిప్రాయంలో, సమానంగానే పొరపాటు చేస్తున్నారు. అందువలన వారిలో ఏ ఒక్కరూ లక్ష్యాన్ని పొందలేకున్నారు. వాస్తవానికి ఇవి రెండూ శాశ్వత సత్యప్రాప్తి అను ఒకే లక్ష్యానికి రెండు మార్గాలు. ఈ రెండింటికి మధ్యన ఉన్న తేడా ఏమిటన, సగుణ మార్గాన్ని అనుసరిస్తూ దానికే కట్టుబడి ఉండే వారికి అనంతం అనేది శాశ్వతంగా వారి దృష్టికి అందకుండ ఉండిపోతుంది. అనగా వారు గాలిలోని నీటి ఆవిరులను గట్టి మంచుగడ్డగా ఘనీభవింప చేసారని దానర్థం. ఈ మంచుగడ్డ సముద్రంలోనికి జారిపడినప్పుడు ఓడలు దాన్ని ఢీకొని మునిగిపోవచ్చు. నిర్గుణ తత్వాన్ని ప్రబోధించే వ్యక్తి అదే సర్వ సమగ్రమని భావించి దానికే శాశ్వతంగా అంటిపెట్టుకొని ఉంటే అతడి తగి కూడా అంతే. బహుశా తేడా అంటూ ఉంటే అది అతడు ఢీకొనే మంచుగడ్డ మరికొంత దూరంలో ఉండవచ్చు. నిజంగా చెప్పాలంటే దైవం సగుణుడు కాదు. నిర్గుణుడు కాదు, రెండింటికీ అతీతుడు. ఆయన ఆయనగానే ఉంటాడు. ఈ రహస్య మర్మాన్ని పరిష్కరించడానికి ఏం చేయాలి? దానికి ఏకైక పరిష్కారం ఆ పరబ్రహ్మము పైనే, అది సగుణం కాని, నిర్గుణం కాని, యీ రెండింటిలో ఏదీ కాకున్నా కాని, మన దృష్టిని స్థిరపరచి దానియందు ప్రేమను పెంపొందించుకోవడమే.

ఇప్పుడు మిగిలి ఉన్న సమస్య సాక్షాత్కార స్థితి మాత్రమే. సాధారణంగా ప్రజలు దాన్ని శంఖ, చక్ర, గద, పద్మములను నాలుగు చేతుల్లోనూ ధరించిన విష్ణుమూర్తి భౌతిక రూపాన్ని మానసికంగా దర్శించడమేనని భావిస్తారు. కాని నా అభిప్రాయంలో అటువంటి దర్శనం ఆధారకుడి స్థూలతర మానసిక స్థితి ఫలితమే. అందుకు కారణం అదే రూపాన్ని తీసుకొని ధ్యానించడం వలన అతడి సూక్ష్మతరమైన ఆత్మే ఆ రూపంలో అతడికి కనబడుతుంది. రాజయోగంలో సాధనా ఫలితంగా వృద్ధి చెందే మానసిక స్థితి చాలా భిన్నమైనట్టిది. ఆ స్థితిలో అతడు సర్వత్రా సర్వ విషయాలలోను దివ్యశక్తి ఉనికిని అనుభూతి చెందుతాడు. నిజమైన దర్శన స్థితి (లేక దివ్యదృష్టి) అంటే వాస్తవానికి అదే. ప్రజలు దీనిని విలోకించి, తమకు తామే దాని అనుభూతిని పొందాలి.

ఈ దర్శన స్థితిని పొందడం అంటే పరిపూర్ణత్వము కాదు. అది దైవం వైపుకు వేసిన మొదటి అడుగు మాత్రమే. మనం యింకా ఎంత దూరం వెళ్లవలసి ఉన్నదీ, యింకా ఎన్ని స్థితులను దాటవలసి వున్నది కచ్చితంగా నిర్ణయించలేము. మన అంతిమ లక్ష్యం "భూమ" లేక పరతత్వములో లయం కావడం అయినప్పుడు దర్శన స్థితిని ఏవిధంగాను పరమావధిగా తీసికోలేము. ఒకవిధంగా మనం ప్రవేశించిన స్థితి ఫలితాలను అనుభవిస్తూ, యిప్పటికీ యింకా ఒక వినోదస్థితిలోనే ఉన్నాము. ఇది ఒక బిడ్డ తన కొత్త బొమ్మలతో వినోదిస్తున్నట్లు ఉంటుంది. నీ హృదయనేత్రంతో దీనిని చేస్తూ ఇందులోని యదార్థాన్ని తేలికగా గ్రహించవచ్చు. దీన్ని నేను "వినోదం" అంటాను. దానికి కారణం అభ్యాసి దాని నుండి కొంచెం సేపైనా దూరమైతే దుఃఖం చెందుతాడు. మనలో అనేకమంది ఆరాధనా పరంగా చేసే దాని వెనుక ఒక భావం ఉంది. దాని ఫలితంగా అది ఒక విధమైన వినోదమే తప్ప వేరు కాదు. వినోద కారకాలు వివిధ రకాలైనవి ఉన్నాయి. శిశువుకు బొమ్మలు, పండితునకు గ్రంథ పఠనం, ఆరాధకునికి సాధనాభ్యాసాలు, భక్తునికి భావోద్రేక పూరిత ప్రేమ, ఆత్మప్రాప్తి పొందినవానికి శాశ్వత సత్వప్రాప్తి, లయావస్థ, పరిపూర్ణత్వం పొందిన వానికి అతడి అజ్ఞాన స్థితి. కాని యింతవరకు యివన్నీ వినోదం కొరకు ఉద్దేశించిన వినోదాలు మాత్రమే. నిజమైన సత్‌తత్వం మనం యీ దశలన్నింటిని దాటినప్పుడు యింకా ముందు ఉంటుంది. ప్రజలు యీ వినోదాలనే సత్‌తత్వమని భావించి వాటిలోనే చిక్కుపడి ఉండి తమ అన్వేషణను అంతటితోనే అంతమొందించుకోవడం శోచనీయ కరమైన విషయం.

పసుపు కొమ్ము లభించిన వాడు తానొక వ్యాపారినని భావించాడట.

సత్‌తత్వం అనేది ఎటువంటిదై ఉంటుందో మాటలలో వివరించడం ఎంతో కష్టం. అర్థం చేసికొనడానికి దానిని ఆధ్యాత్మిక దశలన్నింటి యొక్క అంతిమ స్థితిగ చెప్పవచ్చు. ఆ

పైన అదికూడ అదృశ్యమై దాని స్మృతి కూడ వెనుకకు వెళ్ళిపోతుంది. అప్పుడు మనం ఒక సమతల ప్రదేశాన్ని చేరుతాము. అక్కడ మన యాదులాట అనంతంగా సాగిపోతుంది. ఆ అనంత ప్రదేశం యొక్క అనుభవాన్ని పొందడానికి ఉత్సాహం చూపే వ్యక్తికి, అతడు తన భావ ముద్రలన్నింటిని పక్కకు నెట్టిన తరువాతనే అందులోకి ప్రవేశించాలని నేను చెబుతాను.

నేను పైని చెప్పినదంతా కేవలం స్వీయ ప్రయత్నంతోనే సాధించడం చాల కష్టం. దానికి కారణం మనం పైపైకి వెడుతున్నప్పుడు ప్రకృతి శక్తి సూక్ష్మాతిసూక్ష్మంగా అవుతుంది. శక్తి ఎంత ఎక్కువగా సూక్ష్మమైతే, అది అంత బలీయమవుతుంది. ఈ దశలో తన స్వీయ శక్తిచే అభ్యాసిని పైకి నెట్టగల సమర్థుడైన గురువు యొక్క సహాయ సహకారాలు అత్యంతావశ్యకం. కాని నా దృష్టిలో గురుశక్తితో పైకి నెట్టబడినప్పటికి, ఆ గురువు తన శక్తిని ప్రయోగించి అతడక్కడ నిలబడునట్లు చేయక పోయినట్లయితే మరల క్రిందికి జారిపోయే ప్రమాదం యింకా ఆ విధంగానే ఉంటుంది. నా సహచరులలో ఒకరిని బ్రహ్మాండమండలం యొక్క నాల్గవ దశకు అతీతంగా పైకి తీసికొనిపోయి, స్వయంగా నేనే ఆ స్థితి యందు ప్రవేశించి, విషయాలను ఒకసారి ప్రత్యక్ష పరిశీలన చేసాను. స్వప్రయత్నంతో ఆ తరువాతి దశను చేరుకోడానికి ఒక వేయి సంవత్సరాల కాలం పట్టుతుందని యింకా పైకి వెళ్ళడానికి అయిదు వేల సంవత్సరాలు పట్టునని తెలుసుకొన్నాను. ఆధ్యాత్మిక దశలు లెక్కలేనన్ని ఉంటాయి. అందువలన వాటిలో ప్రయాణించుటకు పట్టేకాలాన్ని లెక్కకట్టడానికి వీలుకాదు. కేవలం ప్రాణాహుతి శక్తిమాత్రమే యీ కాలవ్యవధిని తగ్గించి వేల సంవత్సరాలు పట్టే గమనాన్ని ఒక జీవితకాలంలోనే పూర్తి చేయడానికి వీలు కలిగిస్తుంది. కాని అంతిమ విజయం నిశ్చయంగా సిద్ధించాలంటే అంతిమ లక్ష్యంకూడా సదా దృష్టియందు ఉండాలి.

అంతిమ లక్ష్యం దృష్టియందు లేకుండా మన సాధనాభ్యాసాన్ని కొనసాగిస్తూపోతే, మన స్థితి, గమ్యమేదో తెలియకుండా పయనించే ప్రయాణీకుని వలె ఉంటుంది. గమ్యాన్ని సదా దృష్టిలో ఉంచుకున్నప్పుడు మాత్రమే ఆధ్యాత్మిక మార్గాన్ని కనుగొనడం సాధ్యమవుతుంది.

మార్గములో మనల్ని స్థిరంగా ఉంచేది ఏది? మనల్ని ముందుకు నెట్టుతూ, సహాయాన్ని అందిస్తూ చివరి వరకూ నడిపించే ఆ శక్తి ఏది? అది మన మనస్సు మాత్రమే. దానినే మనం దుష్టమైనదని, నీచమైనదని తరచు భావిస్తాము. వాస్తవానికి మనమే దానిని అతిగ కార్యకలాపాలలో పాల్గొనేటట్టుచేసి, అస్థిరమైన దానినిగాను, చంచలమైనదిగాను తయారుచేసి దాని అలవాట్లను పాడుచేసినాము. లేనట్లయితే అది దైవాదేశాలను, మహోన్నత స్థాయి సూక్ష్మానుభవాలన్నింటిని మనకు అందజేసే అత్యుత్తమమైన, అత్యంత ప్రయోజనకరమైన ఏకైక సాధనం. దానిని పతన స్థితిలో అది మనల్ని నిస్సందేహంగా చిత్తభ్రమలకు దారితీస్తుంది.

వాటిని మనం తరచుగా పురోగమన దశలని అపార్థం చేసికొంటాము. అటువంటి దుస్థితికి గురైన వ్యక్తులను నేనెరుగుదును. అది కూడ ఆధ్యాత్మికతలో ఎంతోకొంత అభిరుచి కల వ్యక్తి అయితే దాని విషప్రభావ పరిమితిని లెక్క కట్టలేము. అతడు వాటిని మహాత్ములతోను, దేవుళ్లతోను గల సంసర్గముగ వివరిస్తూ దివ్యాదేశాలను పొందుతున్నట్లు చెప్పుకుంటాడు. కాని మనస్సును పరిశుద్ధమైన స్థితికి తెచ్చినట్లయితే, అది ఎన్నడూ యీ విధంగా తప్పుదారి పట్టించదు.

మానవ మనస్సు యొక్క మూలాన్ని గురించిన నా స్వీయ పరిశోధనను నేనిక్కడ మీకు చెప్పవచ్చును. సృష్టి సమయము ఆసన్నమైనప్పుడు కేంద్రానికి దిగువ ప్రదేశంలో ఒక క్షోభ ఏర్పడింది. అదే సృష్టికి ఆధారమయింది. అది అప్పుడు దాని పరిపూర్ణస్థితిలో ఉంది. అది దైవానికి మిక్కిలి దగ్గరగా ఉన్న స్థితి. ఇదే మానవునిలో మనస్సుగ కనబడింది. దీనికి ఆవల కేవలం దైవమే ఉన్నాడు. దీనినే నేను "రాజయోగప్రభావం"లో కేంద్రమని అన్నాను. ఇప్పుడు మనస్సు దాని ప్రస్తుత స్థితిలో ఎంతవరకు భ్రష్టుపట్టిందో మీరు ఊహించండి. అది తిరిగి పరిశుద్ధము కావింపబడి అసలు స్థితికి తీసికొని రాబడినప్పుడు అది ఏది సరైనదో దానినే బహిర్గతం చేస్తుంది. ప్రాణాహుతి ద్వారా మనస్సును ఒక్కసారిగ దాని మూల స్థితికి తీసుకొని రావచ్చును. అందుకు అటువంటి మహాప్రజ్ఞుడైన గురువు అదృష్టవశమున మనకు లభించడం మాత్రమే కాదు, అభ్యాసి కూడ ప్రాణాహుతి యొక్క తీవ్రశక్తిని తట్టుకోగలిగిన వాడై ఉండాలి.

నేను కేవలం కొన్ని ముఖ్యాంశాలను మాత్రమే ప్రస్తావించాను. ప్రతిచోట ప్రాణాహుతి యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పాను. అందుకు కారణం దీనికన్న మేలైన మరింత ప్రతిభావంతమైన ప్రగతికారక విధానాన్ని నేనింతవరకు చూసి వుండలేదు. గురువు యొక్క మహోన్నత శక్తి మన స్వప్రయత్నంతో కలిసి పురోగమన శక్తిని ద్విగుణీకృతం చేస్తుంది. ఇంతేగాక యీ విధంగా తన స్వప్రయత్నం యొక్క ఎరుక అణగివుండి స్థూల యాంత్రిక విధానాలలో కలిగే అహంకార భావాన్ని ఎన్నటికి వృద్ధి చెందకుండ ఉంచుతుంది. "రాజయోగ ప్రభావం"లో నేను సూచించినట్లుగా, ఇప్పుడు కాలం మారిపోతుంది. అందువలన మన పూజ్య గురువర్యులు మహాత్మ శ్రీ రామచంద్రజీ ప్రవేశపెట్టిన విధానాలే ప్రపంచమంతటా ఆచరణలో ఉంటాయి.

దైవజ్ఞానం ఒక విజ్ఞానశాస్త్రము. మూల భాండాగారం నుండి (గ్రంథుల రూపంలో) ప్రవహించు ప్రకృతి శక్తికి సృష్టి, విలయాలు రెండింటిని చేయగల సామర్థ్యము కలదు. భారతదేశ ఋషులు సృజన శక్తిని ఎల్లప్పుడు మానవజాతి పునరుద్ధరణకు వినియోగించారు. విధ్వంసక శక్తి కూడ విస్తారంగా ఉంది. అణుబాంబు సైతం దీనికి సమానం కాదు. ప్రస్తుతం యీ శక్తి కూడ యిప్పుడున్న దానికి బదులుగా ఒక క్రొత్త ప్రపంచాన్ని నిర్మించడానికి వినియోగించ

బడుతోంది. ఆధ్యాత్మిక పునరుజ్జీవనం యిప్పటికే ఆరంభమైంది. మరియు భారతదేశం మళ్ళీ ప్రపంచానికి నాయకత్వం వహిస్తుంది. దానికి ఎంతకాలం పడుతుందన్న విషయం ముఖ్యం కాదు. ఆధ్యాత్మికతను ఆధారంగా లేకుండా భూమిపై ఏ దేశము మనజాలదని త్వరలోనే ప్రపంచం గ్రహిస్తుంది. రాజకీయ చతురత, కపటోపాయాల యుగం యిప్పుడు అతివేగంగా గడచిపోతోంది. ఈ శతాబ్దాంతరంలోగా గుర్తింపదగిన మార్పులు తప్పక రానున్నాయి. ఏది జరుగవలసిందని విధి నిర్ణయించిందో దానిని ఆనందంగా ఆహ్వానించుటకు ప్రతిఒక్కరు సిద్ధంగా ఉండాలి. అందరు ఆధ్యాత్మిక మార్గానికి రావలసి ఉంది. దానివలన మాత్రమే వారికి శ్రేయస్సు నిచ్చయంగా కలుగుతుంది. నాకీ విషయంలో సేవ చేయడానికి ప్రజలు అవకాశం కలిగించడం లేదు. అయినప్పటికీ వారికి కూడా తెలియకుండానే నేను వారికి ఎల్లప్పుడూ కొంతవరకు సేవచేస్తూనే ఉన్నాను.

నేను పైన చెప్పినదంతా నా గురువర్యులు యావత్ప్రపంచానికి యిచ్చిన సందేశం.

'నేత్రాకారంగల నీర్గస్ పుష్పం తనకు చూపులేదని వేల సంవత్సరాలుగా విలపిస్తోంది.

ఉద్యానవనంలో నిజమైన నేత్రాలు కలది జన్మించేది చాల అరుదు'.

# 5. రాజయోగము

(1963)

సహజమార్గ పద్ధతి, లేక సత్‌తత్వ ప్రాప్తికి సహజమైన మార్గములోని ముఖ్యాంశములను కొన్నింటిని నేనీనాడు మీ ముందుంచుతున్నాను. ప్రాపంచిక జీవితంలో సాధారణ నిత్యకృత్యాని కనువుగా సులభంగా మలచుకోగలిగే అత్యంత సరళ, సహజ పద్ధతులలో యీ విధానం నడుస్తుంది. మనస్సును, ఇంద్రియాలను అణచివేసే ఉద్దేశంతో చేసే కఠోర తపోనియమాలను, శరీరాన్ని శోషింపచేసికొనే విధానాలను వేటినీ యిది అనుమతించదు. సహజమార్గ విధానం ఎంత సరళమైందంటే ఈ కారణంగానే ప్రజలు దీనిని బాగా అర్థం చేసుకోలేదు. వారు శాశ్వత సత్వప్రాప్తి ఒక మహాకష్టకార్యమని, దానికనేక జన్మలు, యుగాలు తరబడి పట్టువీడని శ్రమ అవసరమనే భావంతో వుంటారు. అయితే సత్‌తత్వాన్ని గురించి అస్పష్ట భావాలతో నిండి యుండి, దానిని సిద్ధింపజేసుకోవడానికి క్లిష్టమైన పద్ధతులననుసరించే వారికి అది కష్టం కావచ్చు. వాస్తవానికి మానవుడు కాంక్షించే ఆ సత్‌తత్వం ఎంత సరళమైనదంటే దాని సరళత్వమే దానికి అడ్డుతెర అయింది. సరళమైన దానిని సరళ పద్ధతుల ద్వారానే సాధించగలం. అందువలన సరళమైన దానిని పొందడంలో నిశ్చయంగా విజయాన్ని కలిగించేవి అత్యంత సరళ పద్ధతులు మాత్రమే.

నేలపై నుండి సూదిని వ్రేళ్ళతో సులభంగా ఎత్తగలం. కాని దానికై బరువులెత్తే యంత్రాన్ని (క్రేన్‌ను) ప్రయోగిస్తే అది అసాధ్యమౌతుంది. శాశ్వత సత్వప్రాప్తి విషయం కూడ సరిగ్గా అటువంటిదే. అందుచే అత్యంత సరళమైన శాశ్వత సత్వప్రాప్తికి చెప్పబడిన అస్తవ్యస్త విధానాలు, క్లిష్టపద్ధతుల వలన ప్రయోజనం నెరవేరదు. పోగా అవి సాధకుడిని తను స్వయంగా సృష్టించుకొన్న జటిల పాతశాలలో జీవిత పర్యంతం ఇరుక్కొనేటట్లు చేసి బయటకు రాకుండా చేస్తాయి. వాస్తవానికి శాశ్వత సత్వప్రాప్తి అంటే నరాలు, కండరాలతో ఆటలపోటీ కాదు; కఠోర తపోనియమాలు శోషణతో కూడి ఉన్న శారీరక యత్నమూకాదు; అంతఃస్థితి తన యదార్థ స్వరూపానికి మార్పునొందడం మాత్రమే అది. దానినే సహజ మార్గం పరిగణనలోనికి తీసుకొంటుంది. దానికి సంబంధించిన అనుచితమైన అనావశ్యక విషయాలను లక్ష్యం చేయదు. ఈ పద్ధతిలో చెప్పబడిన సాధనలు ధ్యానానికి కళ్ళు మూసుకోవడానికి సంబంధించిన లాంఛన ప్రాయమైన యాంత్రిక విధానాలు మాత్రమే కావు. వాటికొక స్పష్టమైన లక్ష్యం, ఉద్దేశం, అంతము ఉన్నాయి. దానిలో రెండంశాలు ఉన్నాయి. ఒకటి అభ్యాసం; రెండవది సాధన మార్గంలో

చిక్కుల్ని, అవరోధాన్ని తొలగిస్తూ ప్రాణాహుతి లేక యోగశక్తి ప్రసారం ద్వారా అభ్యాసి పురోగమనాన్ని త్వరితం చేసే గురు సహాయం. పూర్వపు సాధనా విధానాలలో తన ఆటంకాలను, అవరోధాన్ని తొలగించుకోడానికి అభ్యాసి మాత్రమే తీవ్రకృషి చేయవలసియుండగా, గురువు బాధ్యత అభ్యాసీకి కొన్ని యాంత్రిక సాధనలను చేయమని చెప్పడంతోనే తీరిపోయేది. అయితే సహజమార్గంలో ఆ విధంగా జరగదు. ఈ విషయంలో బాధ్యత ఎక్కువగా గురువుపైనే ఉంటుంది. ఆయన ప్రాణాహుతి ద్వారా తన శక్తిని ప్రయోగించి అభ్యాసి మనస్సునుండి చిక్కుల్ని, అవరోధాల్ని తొలగిస్తారు.

అతిపురాతనమైన యీ ప్రాణాహుతి విధానం సర్వదా రాజయోగానికాధారమై యున్నది. కాని తరువాతి కాలంలో దాని అసలు మూలకారకులైన హిందువులకు దాదాపు లేకుండా పోయింది. చాలాకాలం మరుగన పడివున్న యీ విధానం యిప్పుడు నా గురువర్యులు ఫతేఘడ్ వాస్తవ్యులైన సమర్థగురు మహాత్మా శ్రీ రామచంద్రజీ వారి అద్భుత ప్రయత్నాల వలన పురుజ్జీవనాన్ని పొంది వెలుగులోకి వచ్చింది. ఈ విధానంలో గురువు తన అతఃశక్తులను ప్రయోగించి అభ్యాసిలో నిద్రాణమైయున్న శక్తులను క్రియాత్మకం అయ్యేటట్లు జాగృతం కావించి, వేగపరచి ఆ దివ్య ప్రవాహధార అతడి హృదయం వైపుకు మరలుస్తారు. అభ్యాసి చేయవలసిన పని ఒక్కటి మాత్రమే. మనస్సు, ఇంద్రియాలన్ని సంపూర్ణ నియంత్రణలోను, క్రమశిక్షణలోను వున్న గురువు యొక్క శక్తితో తనని కలుపుకోవడం. అప్పుడు గురుశక్తి అభ్యాసి హృదయంలో ప్రవహించి అతడి మానసిక ప్రవృత్తులను క్రమబద్ధం కావిస్తుంది. కాని ఇది అనాదిగా వస్తున్న సాంప్రదాయ గురుశిష్య అనుబంధానికి వర్తించదు. మా సంస్థలో దీనిని సేవాత్యాగ భావంతో కూడిన సాధారణ సోదరత్వంగా తీసుకుంటాం. కాని అక్కడొక యిబ్బంది ఉంది. అద్భుత మహిమలను ప్రదర్శిస్తూ ఆకర్షించే వారియందు సామాన్యంగా ప్రజలు మోజుపడతారు. సాధనా ఫలితంగా యీ సామర్థ్యం దానంతటదే బయటపడినప్పటికి, అది యోగసిద్ధికి ఏ విధంగాను ప్రమాణం కాదు. అంతేకాక నిజమైన రాజయోగి దానిని ప్రదర్శించడానికి ఎన్నడూ యిష్టపడడు. అయితే మహిమలు రెండు రకాలు, ఒక రకం దైవ స్వభావపరమైనవి కాగా, ఇంకొక రకం భౌతిక స్వభావపరమైనవి. మొదటి వాటి ఉద్దేశం దైవ సంబంధమైనది కాగా రెండవదాని ఉద్దేశం ప్రాపంచిక సంబంధమైనట్టిది. మొదటి రకపు మహిమలు సూక్ష్మ విధానాలు అనుసరించే వారిలో చైతన్యవంతమై మనం ఎదుర్కొంటున్న జీవిత సమస్యను పరిష్కారం చేస్తాయి. దీనికి విరుద్ధంగా స్థూల విధానాలను అనుసరించే వారిలో రెండవ రకపు మహిమలు బయటపడి హృదయానికి భారతరమౌతాయి. అయితే యీ నీచ సిద్ధుల వ్యామోహంలో లీనమైన వాడు మొత్తం మీద చెప్పడానికి ఒక చిక్కుముడివలె

అవుతాడు. దానితో పాటు తనలో ఒక సుడిగుండాన్నేర్పరచుకొని మునిగిపోతాడు. ఆ శక్తిని యితరులపై ప్రయోగిస్తే వారుకూడా అదే సుడిగుండంలోకి లాగబడతారు. మన సంస్థయందు ఇంచుమించు ప్రతి ఒక్కరు ఈ సామర్థ్యము కలిగివున్నారు. కాని గురువర్యులు మెళకువ దృష్టితో అతడు పెడత్రోవ పట్టకుండా వుండటానికి దానిని అదుపులో ఉంచుతారు. అతనికిది తెలియదు కూడ. కాని నిజమైన అవసరం వచ్చినప్పుడు అది అతని ద్వారా జరుగుతుంది. అందువలన ఆధ్యాత్మికంగా మన సహాయానికి, రక్షణకు అద్భుత మహత్యాల్ని ప్రదర్శించే వాడు, ఆసన ప్రాణాయామాల అసాధారణ గారడీ కృత్యాలు చేసే వాడు, మాయ, జీవము, బ్రహముల తత్వంపై పండితోపన్యాసాల్నిచ్చేవాడు కాక, తన అంతఃశక్తిచే సాధన సమస్యలను పరిష్కరించి, మార్గంలోని అవరోధాల్ని తొలగించి మనకు సహాయపడేవాడు మనకు గురువుగా వుండటం అవసరం. మీలో శాంతి నిశ్చలతాభావాల్ని వృద్ధిచేసి, తన ప్రభావంచే మనస్సులోని నిర్విరామతను సద్దుమణచగల వాని సాంగత్యం అదృష్టవశాన్న లభ్యమైతే అతడు ఇంద్రియాల పరిధికతీతుడని, తన అంతఃశక్తులను ప్రయోగించి మీ జీవిత సమస్యను పరిష్కరించడంలో సహాయం చేయుటకు అర్హుడని తెలుసుకోవాలి. భక్తి ప్రేమలతో అతనితో సంబంధమేర్పరచు కుంటే మీ స్వభావం కూడ ఆ విధంగానే రూపొందుతుంది.

మన సంస్థలో అనుసరించే అభ్యాసక్రమం హృదయంపై ధ్యానం చేయుట. ఇదే సాదన పతంజలిచే గూడా చెప్పబడింది. ఈ విధానం యొక్క మౌలిక సూత్రం "రాజయోగ ప్రభావం"లో యిదివరకే చర్చించబడింది. దానిని మరల యిక్కడ చర్చించదలుచుకోలేదు. మనలోని స్థౌల్యాన్ని బయటకు తోసి మహాసూక్ష్మ స్థితిని పొందుటకు యీ విధానం ఎంతగానో తోడ్పడుతుంది. దైవం సంపూర్ణ స్థూలరహితుడని మనకు తెలుసును. కావున ఈశ్వర ప్రాప్తి అంటే అటువంటి సూక్ష్మత్వ స్థితిని సాధ్యమైన చిట్టచివరి అవధి వరకు పొందుట అని అర్థం. సహజమార్గంలో మన లక్ష్యమదే. ఆవరణల రూపంలో స్థిరపడిన స్థౌల్యత నుండి విముక్తి పొందడానికీ విధానం సహాయపడుతుంది.

సహజమార్గ విధానం పరతత్వానికి మిక్కిలి సన్నిహితంగా వుండే అతి సూక్ష్మ పద్ధతి. అందుచేతనే అదెంతో సరళం అయినప్పటికీ సామాన్యులు దానినర్థం చేసికొనలేరు. దివ్యజ్యోతి ఉన్నదనే భావంతో హృదయంపై ధ్యానం చేయమని అది నిర్దేశిస్తుంది. కాని జ్యోతినేరూపంలోను చూడ్డానికి ప్రయత్నించవలదని ఆదేశిస్తుంది కూడ. అయినప్పటికి అతడా విధంగా చేస్తే విధి వశాన్న జ్యోతి కనబడవచ్చు. అప్పుడది మానసిక కలే గాని నిజమైనది కాదు. అభ్యాసి దానిని కేవలం ఒక భావనా రూపంగా తీసికోవాలి. అటువంటప్పుడది అత్యంత సూక్ష్మంగా ఉంటుంది. ఆ విధంగా మనం అత్యంత సూక్ష్మమైన దానిపైనే ధ్యానం చేస్తాం. ప్రతి మహాత్ముడు దానిని

జ్యోతిగానే వర్ణించాడు. దానికి బాగా సరిపడే పదమొక్కటే, కావున నేను దానిని ప్రయోగించక తప్పలేదు. కాని అది కొన్ని చిక్కు సమస్యల్ని సృష్టిస్తుంది. జ్యోతి అనగానే ప్రముఖంగా కాంతి భావం కలుగుతుంది. దానిని ప్రకాశవంతంగా మెరిసే వస్తువుగ తీసుకుంటాం. అసలైన దివ్యజ్యోతిని ఆ భావంలో తీసుకోకూడదు. దానిని "కాంతిలేని జ్యోతి" అని వర్ణించవచ్చు. అసలైన ఆ వస్తువుకిది వర్తిస్తుంది. ఇంకా సరిగ్గా చెప్పాలంటే అది చీకటి వెలుగల కతీతమైన వస్తువు.

మన సాధనా విధానంలో కూడా అభ్యాసి అప్పుడప్పుడు కాంతిని దర్శిస్తాడు. కాని మొదట్లో పదార్థం శక్తితో సంయోగం చెందినప్పుడు మాత్రమే అది సంభవిస్తుంది. అనగా శక్తి పనిచేయడం ప్రారంభించిందనడానికి అది సూచన. ఇదేకాక కాంతి మన గమ్యం కాదు. కాంతి దర్శనం లోపలైనప్పటికి, వెలుపలైనప్పటికి శాశ్వత సత్వప్రాప్తి సిద్ధించిందనడానికి అది సూచన కాదు.

సహజమార్గ పద్ధతి కేంద్రలోను, ఉపకేంద్రాల్లోను నిద్రాణంగా ఉన్న శక్తులను మేల్కొలుపుతుంది. అవి సక్రమంగా పనిచేసేటట్లు చేస్తుంది. ఉన్నత కేంద్రాలు జాగృతమైతే వాటి ప్రభావం నిమ్న కేంద్రాలపై పడుతుంది. అవి దివ్యత్వంతో సంయోగం చెందినపుడ నిమ్న కేంద్రాలు వాటిలో లయమౌతాయి. ఆ విధంగా పై కేంద్రాలు కింది వాటిని ఆధీనంలోకి తీసుకుంటాయి. క్రింది కేంద్రాలు కూడా వాటిపై స్థిరపడి ఉన్న స్థూల ప్రభావాల నుండి విముక్తి పొందుటకు క్షాళన కావింపబడతాయి. అది మాత్రమే అత్యున్నత ఫలితాన్ని తీసుకొని రాగల సరైన అత్యున్నత సహజవిధానం.

ముఖ్యంగా నేనెంతో ప్రత్యేకంగా చెప్పాల్సిన విషయం ఒకటుంది. లక్ష్యప్రాప్తికి అభ్యాసి నిర్విరామంతో కూడిన ఆతృత, వేదనతో కూడిన తపనలకు సమానమైన తీవ్ర ఆకాంక్షను అలవర్చుకోవాలి. సులభంగా విజయాన్ని సాధించడానికి ఈ వేదన లేక నిర్విరామత భావాన్ని పెంచుకోవాలి. వేదన, అస్తిమితత్వాల కోసం కాక, శాంతి నిశ్చలతలను సాధించడానికే ఈ ఆధ్యాత్మిక రంగంలో అడుగెట్టామని ఎవరైనా చెప్పవచ్చని నా భయం. వారి దృష్టిలో అది సరైనదే కావచ్చు. కాని నా దృష్టిలో మొదటివైన వేదన, అస్తిమితత్వాలు దివ్యత్వాన్ని పొందగోరే వారికి అవసరం కాగా తరువాతవైన శాంతి నిశ్చలతలు మైక పారవశ్యాన్ననుభవించగోరే వారికి చెందుతాయి. ఈ తరువాతి దానిని సాధించడం ఏమంత కష్టం కాదు. కాని మొదటి దానిని పొందడం పసిపిల్లలాటవంటి సులభ కార్యం కాదు. అనేకులు శాంతి స్థితిని రుచి చూసి వుండవచ్చును. ఇప్పుడు మనం మొదటి దానిని రుచి చూద్దాం. ఆ స్థితి రవ్వంత మాత్రమే అయినప్పటికీ దానికి వేలాది శాంతి నిశ్చలతాస్థితుల్ని వదలుకోడానికి సిద్ధపడవచ్చు. వాస్తవానికి అసాధారణ మహాపురుషులు ఈ ప్రపంచంలో అవతరించడానికి కావలసిన నిర్మాణ

కార్యక్రమానికంతటికి ఇది పునాది. నిజమైన ప్రశాంతత యొక్క అసలు స్థితి మనం అర్థం చేసికొనే శక్తికతీతం. అక్కడ ఎటువంటి వైరుధ్యాలకు తావులేదు. యదార్థానికి అది ప్రశాంతత కాదు, నిర్విరామత కాదు, సంయోగం కాదు, వియోగం కాదు, ఆనందం కాదు. దానికి విర్ధమైంది కాదు. మన వేదనంతా దానికోసమే పెంచుకున్నాం. మీరందరూ ఆ బాధ చవిచూచెదరు గాక! అలవర్చుకోవడానికదేమంత కష్టం కాదు. దానికి కావలసినదంతా దృఢ సంకల్పం, దానిపై తదేక దృష్టి, అప్పుడు నీవన్వేషిస్తున్న వస్తువు నీకు మరీ సమీపంగా ఉన్నట్లు తెలుస్తుంది. అదేకాదు! నీవన్వేషిస్తున్న వస్తువు నువ్వే అవుతావు. దానికి మార్గంలో అనావశ్యకాలైన కలుపు మొక్కల్ని, పొదలను దగ్ధం చేయగల దహించి వేసే హృదయం కావాలి.

# 6. రాజయోగ సారము

(ది.20-12-1964న మైసూరులో ఇచ్చిన సందేశము)

మహాత్ములు యాదృచ్ఛికముగా జన్మించరు. వారికై సమస్త విశ్వము గాఢ ఆకాంక్షతో నిరీక్షించినప్పుడే జన్మిస్తారు. ప్రకృతిలో గోచరమయ్యే విజ్ఞానమిదే. ఆధ్యాత్మికత నిస్సహాయంగా కంపించిపోతున్న తరుణంలో, స్థూల భౌతికవాదం మానవ జీవితములోని ఆధ్యాత్మిక స్థానాన్ని దురాక్రమించుకొని ఉన్న తరుణంలో, యోగశక్తి ప్రసార ప్రక్రియ మరుగున పడిపోయిన సందర్భంలో నా గురుదేవుల పవిత్రాత్మ ఉత్తరప్రదేశ్‌లోని ఫతేఘడ్‌కు చెందిన సమర్థగురు మహాత్మ శ్రీ రామచంద్రజీ మహరాజ్ వారి రూపంలో భువిపైన అవతరించెను. ఈ ఆధ్యాత్మిక మేధావి 1873, ఫిబ్రవరి 2, వసంత పంచమినాడు అవతరించెను. వీరి జీవితము ఆధ్యాత్మికతలో నూతన యుగానికి నాంది పలికింది. వాస్తవానికి వారు ప్రకృతిలోని అద్భుతము. ఆధ్యాత్మిక రంగంలో వారి కృషి సామాన్యుని అవగాహనకు అంతు పట్టనిది. మారిన కాలానికి అనుగణంగా ప్రజల గ్రహణ యోగ్యతానుసారము రాజయోగాన్ని అనుభవపూర్వరముగా సవరించినారు. ఈ శాస్త్రంలో వారు ఆశ్చర్యకర పరిశోధనలు చేసి, సాధ్యమున్నంత తక్కువ కాలంలో, అత్యున్నత స్థితిని మానవుడు అనుభవపూర్వరముగా పొందేస్థితిని కల్పించినారు. వారు ఎంతటి పరిపూర్ణమైన శక్తి సంపన్నులంటే, వారిని అనుసరించని వారు కూడ వారినుండి నిరంతరం వెలువడే ప్రకాశపు ప్రభావము వల్ల పరివర్తన చెందినారు.

భారతదేశంలో, ఇంచుమించు అన్ని కాలాల్లోను, అత్యున్నత స్థాయికి చెందిన మహర్షులుండి, వారి బోధన, ప్రచారాల ద్వారా ప్రజలు ఉన్నతతర చేతన స్థాయిలను పొందుటకు తగిన మార్గదర్శకత్వమిచ్చినారు. అయితే, వీరందరిలోను, తనలోని అంతర్గత శక్తులతోనే మనలను ప్రేరేపింప చేయగల మహాత్ముడే మన ఆధ్యాత్మిక సాధనలో సరియైన మార్గదర్శి కాగలడు. మనలోని సంక్లిష్టతలను గమనించి, మన నిజమైన అవసరాలను అవగాహన చేసుకొని, ఈ మార్గములో మనలను నడిపించి, చివరకు అత్యున్నత చివరి స్థితిని చేర్చగల ఆయన మాత్రమే మన మార్గదర్శి. ఆయన ఉపయోగించే ప్రధాన సాధనము ప్రాణాహుతి లేక యోగ ప్రసార ప్రక్రియ అనడంలో సందేశం లేదు. మన అంతరంగ స్వభావాలను క్రమపరచి మనలో క్రమంగా పరివర్తన కలిగించడానికి, మనలో తక్షణ మార్పును తేగల ఒకేయొక ఫలవంతమైన ప్రక్రియ ఇదియే. ప్రతి మనస్సుతోను తలపడి, దానిని శాశ్వతముగా అల్లకల్లో, క్రమరాహిత్య స్థితిలో ఉంచేందుకు సమస్త విశ్వం విషపూరిత వాతావరణ

ప్రభావంలో మునిగియున్న ప్రస్తుత పరిస్థితుల్లో, అన్ని ఇంద్రియాలు అదుపు తప్పి వ్యక్తి మనస్సు అనుక్షణం రెక్కలు కట్టుకొని ఎగిరే స్థితిలోనున్న ఈ తరుణంలో, తమ అమోఘ దివ్యశక్తులతో మనలను ఆదుకొని ముందుకు నడిపింపగల అట్టి మహావ్యక్తి అవసరము మనకు ఎంతో ఉన్నది.

పైన పేర్కొన్న పూజ్య గురుదేవుల రూపంలోని దివ్య మహావ్యక్తిత్వములో మనకు వారి సహాయమే లభించింది. వారు సంస్కరించిన రాజయోగాన్ని ప్రవేశపెట్టినారు. అదే తరువాత "సహజమార్గము"గా రూపొందినది. మన సంస్థలో మనమిప్పుడు అనుసరించే ఈ పద్ధతి అనంతత్వాన్ని సాధించేందుకు సహజమైన సరళమైన మార్గాన్ని మనకు అందిస్తుంది. అదుపు తప్పిన మన ఇంద్రియాల క్రమరాహిత్య చర్యలే ఈ మార్గములో మనకు ప్రధానమైన అడ్డంకులు, దీని పరిష్కారానికి, ఇంద్రియాలను అదుపు చేయడం లేదా వాటి గొంతు నులమడం వంటి పాత పద్ధతులు అంత ప్రయోజనకరమైనవి కావు. నిజంగా కూడ అణచివేత లేక గొంతు నులమడం అనే ఈ పద్ధతులు మనలను కష్టాలనుండి గట్టెంక్కించవు. ఇంద్రియాల కార్యకలాపాలను క్రమపరచుటలోనే పరిష్కారం ఉంది. మానవుని దైనందిన జీవితములో ఏమాత్రము పనికిరాని ఈ మోటుపద్ధతులను సహజమార్గము ఎప్పటికి సూచించదు. సహజమార్గ ఆధ్యాత్మిక శిక్షణా పద్ధతిలో ఇంద్రియాల కార్యకలాపాలు సాధారణ పద్దతులలో సరియైన మార్గంలో క్రమపరుపబడి అవి వాటి మౌలిక స్థితికి, అంటే మనము మొదటిసారిగా మానవ రూపాన్ని సంతరించుకున్నప్పటికి (శుద్ధ) స్థితికి తీసుకొని రావడం జరుగుతుంది. అంతేగాక, స్వతంత్రంగా వ్యవహరించే క్రిందిస్థాయి కేంద్రాలు ఉన్నతస్థాయి చేతనా కేంద్రాల అదుపులోనికి తీసుకొని రాబడి, తద్వారా వాటి కుటిల చర్యలు నిలిపివేయబడతాయి. ఈ ఉన్నతస్థాయి కేంద్రాలు కూడా తమవంతుగా అవి దివ్యకేంద్రాల అదుపులోనికి వస్తాయి. తద్వారా సమస్తము దివ్యముగా తీర్చిదిద్దబడడము మొదలవుతుంది.

పంచ వికారాలనబడే కామ, క్రోధ, లోభ, మోహ, అహంకారాలు మానవుని ఆధ్యాత్మిక మార్గంలో ఘోరమైన ప్రతిబంధకాలని ప్రాచీన మతగ్రంథాలు పేర్కొనుటకు కారణము అవి వాటిని తప్పుగా అర్థము చేసుకోవడమే.

వీటిలో మొదటి రెండు, అంటే కామ క్రోధాలు, మనకు దైవనిర్మితాలుకాగా, తరువాతి రెండు, లోభ మోహాలు మన స్వంత సృష్టి, దైవనిర్మితాలైన వాటిని మనము వదలివేయలేము. కాని వాటిని దివ్యజీవనానికి తగువిధంగా సరియైన పద్ధతులలో క్రమపరచి సరిదిద్దగలము. కామకేంద్రానికి బుద్ధి కేంద్రంతో సన్నిహిత సంబంధం ఉన్నది. కాబట్టి ఏదోవిధంగా కామాన్ని రూపుమాపడం జరిగితే, బుద్ధిపూర్తిగ అదృశ్యమౌతుందని నేను చెప్పక తప్పదు. క్రోధాన్ని

రూపుమాపితే, వ్యక్తి ఇహపరాలలో ప్రగతి సాధించలేడు. నిజానికి కార్యకలాపాలను ఉద్రేకపరచేది క్రోధమే కాబట్టి అది శరీరధారియైన ఆత్మకు (జీవికి) అత్యవసరంగా పనికి వచ్చే పరికరము. అహంకార విషయము కూడ ఇంతే. తనను గురంచి పేర్కొనేటప్పుడు వ్యక్తి "నేను" అంటున్నప్పుడు సాధారణంగా శరీరాన్నే చూపుతున్నా, అదే సమయంలో అది అతనిలోనున్న జీవశక్తిని (దానిని ఆత్మ అనిగాని, మరే పేరుతో పిలిచినాసరే), తెరమరుగున పనిచేస్తున్న ఆ శక్తినే సూచిస్తుంది. ఏదోవిధంగా వ్యక్తి శరీరభావన నుండి, చివరకు ఆత్మభావన నుండి కూడ విడుదల అయితే, తాను గాఢంగా ఆకాంక్షిస్తున్న దానికి అత్యంత చేరువైతాడు. పైన పేర్కొన్న వికారాలు స్వతహాగా చెడుగులు కావు. అపాయకరములు కావు. మనమే వాటిని తప్పుగా ప్రయోగించి, దివ్యత్వము వైపు మన పయనంలో అడ్డంకులుగా తయారు చేసుకున్నాము. శుద్ధ స్థితిలో అవి ప్రాపంచికంగాని, ఆధ్యాత్మికంగాగాని, మన జీవితయాత్రలో ఏదిశలో గాని, అపరిమితంగా సహాయాన్ని అందిస్తాయి. కాబట్టి వాటిని బంధించడం కాని అణచివేయడం కాని మన పనికాదు. అవి సరిగా పనిచేసే విధంగా వాటిని శుద్ధపరచి సరిదిద్దడమే మన కర్తవ్యము.

మానవునిలో అస్థిత్వంలోని ఈ మార్పులన్నింటిని సహజమార్గంలో అత్యంత సహజపద్ధతిలో, ప్రాణాహుతి ద్వారా తీసుకొని రావడం జరుగుతుంది. ఈ విధానములో మనస్సును క్రమపరచే కర్తవ్యము, వాస్తవానికి గురువులదే గాని, అభ్యాసిది కాదు. వ్యక్తి మనస్సు విశ్వమనస్సు స్థితికి ఎదిగినప్పుడు అది తన స్వస్వరూపాన్ని పొంది వ్యక్తికి తగిన మార్గదర్శకత్వాన్ని ఇస్తుంది. మానవుడు ద్విధ్రువప్రాణి (Bipolar Being). దాని ఒకకొన (మూలము) ఆధారానికి దగ్గరగా ఉంటుంది. మరొక కొన ప్రపంచంవైపు ఉంటుంది. ఏదోవిధంగా వ్యక్తమౌతుంది. సృష్టికి కారణమైన ప్రకృతి శక్తుల చలనానికి కారణభూతమైన "క్షోభ" యొక్క ప్రతిబింబమే మానవ మనస్సు. ఈ చర్య సవ్యగతిలో (ప్రదక్షిణముగా) మొదలయింది కాబట్టి ప్రకృతిలోని ప్రతీది గోళాకారంలో ఉన్నట్లు మనము గమనిస్తాము. ఈ విధంగా వ్యక్తి మనస్సు దివ్యమనస్సు (క్షోభ)లో అంతర్భాగమే. ఏదోవిధంగా దాని అధోముఖ కార్యకలాపాలను మూలమువైపు త్రిప్పగల్గితే, అది పరమ ప్రశాంతంగా తయారౌతుంది. దివ్యవ్యక్తిత్వము గల మహాశక్తివంతుడైన వాని సహాయ సహకారములు వల్ల మాత్రమే వ్యక్తి తన మనస్సును మూలమువైపు మరలించగలడని, నా వ్యక్తిగతానుభవము ఆధారంగా, తెలియజేస్తున్నాను. ఈ విషయంలో అట్టి మహావ్యక్తి యొక్క సంకల్ప శక్తులు మాత్రమే అవసరము.

మానవుడు అందుకోగల అత్యున్నత స్థాయి విషయానికి వస్తే, పరమాత్మకృపతో వ్యక్తి తేజోవలయాలన్నీ దాటి కేంద్ర మండలము (Central region) లోనికి ప్రవేశిస్తే, అతని

శరీరాణువులే శక్తిగా రూపాంతరం పొంది అతనిని అనంతంలోనికి చేరుస్తాయి. అయితే అది అభ్యాసము (సాధన), స్వయంకృషి వల్ల మాత్రమే సాధ్యముకాదు. ఉన్నతస్థాయిలలో పైనుండి క్రిందకు త్రోసే శక్తి పనిచేస్తూ ఉంటుంది. కాబట్టి వ్యక్తి స్వయంకృషితో కొంత పైకిపోయినా క్రిందకు దిగజారుతాడు. అందువల్ల ఉన్నతతర కేంద్రాలలో మన ప్రవేశానికి గురుదేవులు (మాస్టర్) సహాయ సహకారములు అత్యావశ్యకములు. సహజమార్గము ప్రపంచానికి అందించే సందేశము సూక్ష్మంగా ఇదే. ఈ విధానాన్ని ప్రయత్నించి, వ్యక్తిగత అనుభవం పొందడానికి అందరికీ సుస్వాగతము.

# 7. చైతన్యవంతమైన రాజయోగము

(ది.23-12-1964న బెంగుళూరులో ఇచ్చిన సందేశము)

ప్రకృతిలోని మర్మాలను బయటపెట్టడానికి మానవుడు నిర్విరామంగా కృషిచేసినాడు. ఫలితంగా విజ్ఞానపు సరిహద్దులు విశాలములైనవి. అందువల్లనే ప్రకృతిలో తాను చూచే వాటన్నింటిలోనికి అతని పరిశోధన కొనసాగుతూ వుంది. మనం దేనికొరకైనా అన్వేషిస్తే, దానిని గురించి ఆలోచించడానికి విషయమేదైనా దొరకుతుంది. దానిని అధిగమించిపోతే, ఒక మర్మము తర్వాత మరొకటిగా మనకు ఎదురౌతుంది. అసలు ఆలోచనే మరింత పరిణామము చెందితే, అది మనలను ప్రతిదాని వెనుకనున్న దాని వద్దకు తీసుకు పోతుంది. మన ప్రాచీనులు, దానిలోనికి తొంగి చూచినపుడు, ఈ విశ్వానికి గల అసలు కారణము, మానవునికి దేవునికి మధ్యగల సంబంధము, ప్రకృతికి ప్రాతినిధ్యం వహించే స్థిరచర విలువలు - మొదలగు వాటిని ప్రత్యక్షంగా కనుగొనడానికి ప్రయత్నించినారు. మనము అందులోనికి నిజంగా తొంగిచూడగలిగితే, అక్కడ అణువులు, కణాల రూపంలో సృజానత్మక, వినాశనాత్మక శక్తులను కనుగొంటాము. అందులో శక్తి చాపములు (Power Arcs) కూడ కనుగొంటాము. తమ ఉనికికి సంబంధించిన పూర్తి వివరణలతో అనుకూల ప్రతికూల జీవాణువులను కూడ చూస్తాము. మార్మికంగా కనబడే ఈ శక్తులనన్నింటిని సృజనాత్మక కార్యాలలో వినియోగించుటకే మన ప్రాచీన ఋషులు ప్రతినబూనినారు. వారు వీటన్నింటికి అతీతంగాకూడ పోయి సమస్త ఉనికికి (అస్తిత్వానికి) మూలకారణమైన కొన్ని చలనములను కనుగొన్నారు. మనమీ స్థితివరకు పోతే, వాటి అస్థిత్వపు ఎరుకను తెలియజేసే కేంద్రాన్ని, దాని క్షేత్రాన్ని చూస్తాము. మనమిప్పుడు ఇంకా ముందుకు పోదాము. దానికిపైన, దిగువన ఏమున్నది? సమస్తము కేంద్రము వైపుకు పోతున్నట్లు, అసలు కేంద్రమే పరిధివైపు వివృత ముఖముతో ఉన్నట్లు గమనిస్తాము. ఈ సహసపు పని తర్వాత మనము మన ఉనికికి గల విలువను తెలుసుకొనడానికి పూనుకున్నాము. మన చుట్టూ ఆవరించి ఉన్న ఆ అత్యున్నతశక్తి యొక్క సహాయమును అనుభూతి చెందినాము. ఈ సృష్టి నాటకపు మూల కథావస్తువు వైపు మన ప్రధాన భావనా ప్రవాహమే మన దృష్టిని మళ్ళించింది. క్రమంగా మనం మానవ శరీరములోని చలనముల పనిని చేసుకొనగలిగినాము. కేంద్ర మండలము వరకు మన ప్రగతికి దారి తెరువబడింది.

మనం మన జీవిత సమస్యను ఏదో విధంగా పరిష్కరించుకోగలిగితే మనమీ మర్మాన్ని భేదించినట్లేనని నేననుకుంటాను. మనలను మనము గమనించినప్పుడు మానవుడు

విశ్వసారమని కనుగొన్నాము. ఇది మన ప్రగతికి దోహం చేసింది. మనలోని కేంద్రాలను, వాటి చలనాలను, వాటి కార్యకలాపాలను, మన మనస్సు శరీరం చేసే పనులను అధ్యయనం చేయడానికి మొదలు పెట్టేందుకు ఇది దారితీసింది. మనలో ఉండే శక్తిని మనం వినాశనకర పనులకు కూడ వినియోగించవచ్చు. కాని మన ప్రాచీనుల పవిత్ర ప్రతిజ్ఞననుసరించి మనమా భావాన్ని పూర్తిగా వదిలేసి, ఆ శక్తిని మానవ పరివర్తనకై వినియోగిస్తాము. నిజంగా మనము సృజనాత్మకత లోనికి తొంగి చూస్తే, దాని సరసనే వినాశనమును కూడ చూస్తాము. ఈ రెండింటికి మధ్యస్థ స్థితులు కూడ ఉన్నవి. వీటిని శాస్త్రజ్ఞులు ఇంకా పరిశోధింపవలసి వుంది. మన దృష్టి వీటిపై లేదు. కాబట్టి మనము వీటిని వదిలేస్తాము. సృజనాత్మకత వైపు వస్తాము. ఈ భావనతో మనలోనికి మనము తొంగిచూస్తే, ఉన్నతతర కేంద్రాలు మనలోని కేంద్రాలలోనికి తమ వెలుగును ప్రసరింపచేస్తున్నట్లు, కాని మన తప్పుడు ఆలోచనలు ఆచరణలవల్ల వాటి ప్రభావము మన కేంద్రాలపై ఏమాత్రము పడలేదని గమనిస్తాము. ఈ కేంద్రాలపై స్థూల్యతపొరలు ఎంత దట్టంగా స్థిరపడిపోయినవంటే అవి పూర్తిగా దుర్భేధ్యములుగా తయారైనవి. మన శరీరంలో ఎన్నో కేంద్రాలున్నవి. అవి ఆధ్యాత్మికంగా, ప్రాపంచికంగా కూడ తమ పనులు నెరవేరుస్తాయి. సామాన్య ప్రజల మంచి కోసం వీటన్నింటిని పరిశోధించి తెలుసుకొనవలసిన అవసరమెంతనా ఉన్నది. మానవులు భౌతికాభివృద్ధికి తమ శక్తుల వినియోగింప ఇష్టములేనివారు, ఆ విషయంలో ప్రగతి సాధించాలని అనుకోనివారు - ఇట్టి బలహీనులకు మాత్రమే ఇది యొక పరిశోధనకు విషయంగా తయారైనదని చెప్పబడింది. భౌతికవాదంలో అపరిమితమైన వేగంతో ముందుకు పోయి తమకు తామే పరిమితుల నేర్పరచుకున్న వాటిని, ఈ కాలపు నాగరికతలను ఆదర్శాలుగా చూపిస్తూ మనలో చాలామంది ఆధ్యాత్మికతను విమర్శిస్తున్నారు. ఈ విధంగా పరిమితులు ఏర్పడడానికి కారణం అవి పరిమితులలోనున్న వానిని మాత్రమే ప్రయత్నించి తరువాత పడిపోవడమే. అసలు భావన పరిమితులనుండి అపరిమితికి ప్రగతి సాధించాలని ఉండాలి. అంతమును అనంతములో (పరిమితిని అపరిమితములో) లయము చేయాలని కూడ ఉండాలి. మరొక విధంగా చెప్పాలంటే, పరిమితత్వము మొదట్లో ఆకర్షణీయంగా ఉండాలి, అప్పుడు మనం దాని ఆధారంగా మూలాధారమువైపు ముందుకు పోగలము. సరే, పరిమితత్వమంటే ఏమిటి? మనలోని కేంద్రస్థానము అనంతాన్ని గ్రహించేశక్తిని కోల్పోయింది. మననుండి పరిమితత్వము ఏపని కోరుతుందో దానిని మనము నెరవేర్చగలిగే విధంగా మనలను తయారుచేసి, అనంతత్వం అపరిమితమైన వైపు ముందుకు సాగడానికి వీలు కల్పించే ఉద్దేశముతోనే సహజమార్గ విధానము ఏర్పడింది. మన ధర్మము మనకు ప్రధాన కర్తవ్యమనే విషయాన్ని ఈ పద్ధతి విశదపరుస్తుంది. కాబట్టి మనము రెండింటిని సరిదిద్దాలి, అంటే రెండు

రెక్కలతో పైకి ఎగరాలి. మనము పరిమితత్వాన్ని అంటిపెట్టుకుంటే దుర్భలమైన ఆధారంతో ముందుకు పోతున్నామన్న మాట. మనము అపరిమితత్వం కోసము పరిమితత్వాన్ని చేపట్టాలి. దీనికోసం మనము చైతన్యవంతమైన పద్ధతులను అనుసరించాలి. ఆ పద్ధతులు ఏవి? ఏవి మనలో ప్రారంభం నుండే అనంతత్వ లక్షణాలను ప్రవేశపెట్టగలిగేవో అవి. ఈ వాక్యంలోని అర్థాన్ని మరికొంత బాగుగా అవగాహన చేసుకుంటే నేను పాఠకులకు కృతజ్ఞుడనై ఉంటాను.

అసలైన మౌలిక గుణాలను తమలోని కేంద్రాలలోనికి గ్రహించి ఉన్నవారు, ఉన్నతతర కేంద్రాల నుండి దిగువ కేంద్రాలలోనికి భక్తి విశ్వాసాలను శక్తిని ప్రసరింపచేయునట్టి ప్రక్రియ తెలిసినవారు, అభ్యాసులు కూడ అవే గుణాలను తాము పొందగలిగేట్లు వారిలోనికి పై ప్రక్రియ ప్రభావాన్ని ప్రసారము చేయగలవారు - ఇట్టి వారిచే మాత్రమే వీటిని ప్రవేశపెట్టడానికి వీలవుతుంది. దీనికై ఒక శక్తివంతమైన, చైతన్యవంతమైన సహాయ హస్తము అత్యవసరము. మన కేంద్రాలలో పేరుకుపోయిన స్థూల్యతను మనము తొలగించుకోనంతవరకు, మనము తయారుచేసుకున్న స్థూల్యత, సంక్లిష్టతల వలన ఉన్నతతర కేంద్రాల ప్రభావము మనకు చాల దూరమౌతుంది. అందుకే మన సహజమార్గము మనలోని కేంద్రాల క్షాళనకు ప్రాధాన్యమిస్తుంది. గురుదేవులు కూడ ప్రాణాహుతి ద్వారా ఈ కార్యాన్నే నెరవేరుస్తారు. ఆ పరతత్వపు కృప అభ్యాసికి నేరుగా లభించనంతకాలము గురువు తనపై ప్రసరిస్తున్న ఆ కృపను అభ్యాసివైపు మరలింప చేస్తాడు.

ఇంతకు మునుపే నేను మీకు ప్రకృతి శక్తులను గురించి, శక్తి చాపాలను గురించి తెల్పి ఉన్నాము. వీటన్నింటిని మానవుని పరివర్తన చెందించేందుకు అవసరమైన విధంగా వినియోగించడం జరుగుతుంది. హృదయంలో దివ్యకాంతి ఉన్నదనే భావనతో మనము హృదయముపై ధ్యానం చేస్తూ పోతాము. ఆవిధంగా చేయడం వల్ల క్రమంగా మనం ఉన్నతోన్నత స్థితులకు చేరుతాము. మరింత బాగా చెప్పాలంటే అభ్యాసి తన అంతరంగ చేతనలోనికి లోతుగా చొచ్చుకొనిపోయి, తత్ఫలితంగా వ్యాపకత్వమును అనుభూతి చెందుతాడు. ఇది మొదటిదశ. అంటే మనము మనలో అనంతత్వ బీజమును నాటినామని అర్థం. అంటే మన దృష్టి నుండి జారిపోయిన దానిని మరల మనము పునరుద్ధరించినామన్నమాట.

ఇక ఇప్పుడు రెండవదశ దృష్టిపథంలోనికి వస్తుంది. ఈ దశలో వ్యక్తి సర్వప్రాణులలోను పరమాత్మ ఉనికిని అనుభవిస్తాడు. అసలు మూలము మార్పు చెందడమే మూడవదశ. ఇందులో పై స్థితి మారి సర్వము పరమాత్మనుండేనని, అంతా ఆయన సర్వాంతర్యామిత్వమేననే అనుభూతి కలుగుతుంది. నాల్గవదశ మనము చివరకు పొందవలసిన అభావస్థితిని కలిగిస్తుంది. ప్రతి వస్తువులోను ప్రతి అణువులోను మనము ఏకరూపతను గమనిస్తాము. అనుసరిస్తున్న

పద్ధతి సరియైనదై, మార్గదర్శి పరిపూర్ణుడైతే, ప్రతి సాధకుడూ ఈ దశలగుండా పయనిస్తాడు. మనము ఇంకా ముందుకు పోయి తరువాతి మండలంలో ప్రవేశిస్తే, బ్రహ్మాండ మండలము చేరేవరకు మనకు అరుదుగా పై దశలన్నీ సంభవిస్తాయి. అక్కడ కూడ ఈ దశలే వస్తాయి, కాని సూక్ష్మరూపంలోనే వీటిని అనుభూతి చెందడం కలుగుతుంది. గురువు సరియైన వ్యక్తి కాకపోతే, ఆధ్యాత్మికతకు సంబంధంలేని శక్తులలో అభ్యాసి మునిగిపోయే ప్రమాదం వుంది. చిట్టచివరి స్థితివరకు గురుదేవుల కార్యము కొనసాగుతూనే ఉంటుంది. ఇంతవరకు నేను, ఏయే హృదయకేంద్రాల ద్వారా గురుదేవులు తమ కార్యాన్ని నిర్వర్తిస్తారు, మనస్సును ఇంద్రియాలను క్రమబద్ధం చేయడానికి యేయే విధానాన్ని అనుసరిస్తారు, మానవులను ఉన్నతతర స్థితులకు చేర్చడానికి ఏ ప్రక్రియలను అనుసరిస్తారు అనే విషయాలను తాకకుండా అభ్యాసీ కర్తవ్యము, గురుదేవుల కర్తవ్యముల గురించి మాత్రమే చర్చించినాను. అభ్యాసి చేయవలసిన పని - గురుదేవులకు పరిపూర్ణ విధేయుడై ఉండడము మాత్రమే. అంటే అభ్యాసి తనపై తాను నమ్మకముంచి, గురుదేవులను పరిపూర్ణంగా విశ్వసించి - కనీసము వారిపై నమ్మకముంచి - వారు తనకిచ్చే సూచనలను 'తుచ' తప్పక అనుసరించాలని నా అభిప్రాయము. ఆ చిట్టచివరి స్థితివరకు చేరినట్టి శక్తివంతుడైన గురుదేవులకై మనము అన్వేషించాలి. అట్టి గురువులు లభించుట కష్టమైనపనే, కాని, ఉపనిషత్తుల్లో చెప్పినట్లు, అట్టి శక్తివంతుడైన శిష్యుడు లభించుట కూడ అంతకష్టమైనపనే. పరతత్వ్వ సాధనపట్ల తీవ్ర ఆకాంక్ష ఉండే అన్వేషకుని యింటి గడపవద్దకే గురుదేవులు వస్తారు. నమ్మకము, అపనమ్మకము అనేవి రెండు. ఈ రెండూ అవసరమే. అయితే మనం చేస్తున్న పనేమిటంటే నమ్మకము అవసరమైన చోట్ల అపనమ్మకాన్ని, అపనమ్మకము అవసరమైన చోట్ల నమ్మకాన్ని కలిగి ఉంటున్నాము.

నిజమైన ఆకాంక్ష గలవానికి పరతత్వ్వ ప్రాప్తి కష్టమేమి కాదనే విషయాన్ని చివరగా మరొకసారి మీకు నొక్కి చెప్పదలచుకున్నాను. గాఢ ఆకాంక్ష ఉంటే అతి తక్కువకాలంలో పరతత్వ్వప్రాప్తికి దారితీసే మార్గంలోనికి వ్యక్తి వచ్చి చేరుతాడు. వ్యక్తిలోని తీవ్ర ఆకాంక్ష అతనిలో నిరంతర నిర్విరామతను కలిగించి అతడు తన ధ్యేయాన్ని పొందడానికే కృషి చేసేట్లు చేస్తుంది. మనలో చాలామంది నిత్య ప్రార్థన పూజలు మన యింద్రియాలను సంతృప్తిపరచడానికే చేస్తాము. ఇందులో మానసికానందము ఇంద్రియానందము ఉన్నాయి. ఇట్టి వారు ఇటువంటి ఎన్నో ఆనందాలలో చిక్కుకొని ఉన్నారు. అది వారిని శాశ్వత సత్వప్రాప్తికి దారితీసే జీవితములోకి తొంగిచూసే అవకాశము లేకుండ వారిస్తున్నది.

# 8. రాజయోగ ప్రభావము

(1965 - డిసెంబర్ - మైసూరులో ఇచ్చిన సందేశము)

మనలో చాలామంది సాక్షాత్కారాన్ని, స్వేచ్ఛను గాఢంగా కాంక్షించేవారున్నారు. అది వారి విధిగా కూడా భావిస్తారు. అయితే, మనమెప్పుడు దానిని విధి అంటున్నామో అప్పుడే మనమొక పరిమితికి కట్టుబడిపోయినట్లు ఆరోపిస్తుంది. ఆ పరిమితి ఏమిటి? అది మన భావనల, వివేకముల ఇరుకైన పరిధి మాత్రమే. మనమిప్పుడు బయటపడలేని పరిమితిలో ఉన్నాము. ఇక్కడ నుండి విశాలతర మండలాలలోనికి ప్రగతికై ప్రయత్నిస్తున్నాము. విశాలతర మండలమంటే అనంతత్వపు దర్శనమని నా అర్థం. అయితే ఇది ఆ పనికై మనమనుసరించే సాధనామార్గాలు పద్ధతులపై ప్రధానంగా ఆధారపడి ఉంటుంది. దురదృష్టవశాత్తు మనము పరిమితులను బంధనాలను పెంచే మార్గాలలో పడితే, ఆ సత్ తత్వానికి అనంతత్వ దర్శనానికి చాలా దూరంలోనే ఉండిపోతాము. కొందరు ప్రత్యే వ్యక్తుల మనస్తత్వానికి తగినట్లు కొన్ని విధానాలుండవచ్చు. కాని అవి మౌలికంగానే తప్పువి కావచ్చు. లేదా యితర విధాల అసమర్థమైనవి కావచ్చు. లేదా తాత్కాలికంగా ఉపశమనమిచ్చేవి, మరింతగా సుఖసంతోషాలను అనుభవింపచేసేవి, మరిన్ని ఆకర్షణలను, పిల్లలకు ఆనందమిచ్చే ఆటవస్తువుల వంటివి - కావచ్చు. బహుశ అవి అనంత మార్గంలో అతడు మరింత ముందుకు పోయేట్లు అతనిని ప్రేరేపించే ఆకర్షకములు కావచ్చు. కాని, ఎంతకాలం ఆ వ్యక్తి ఆకర్షణకు లోబడి ఉంటే అంతకాలము అతని ప్రగతి కరుడు కట్టుకొని పోతుంది. అతని స్థితిని తన యిరుకైన రంగమే సర్వ ప్రపంచమని భ్రమపడే బావిలోని కప్పతో పోల్చవచ్చు. కాని మన ప్రస్తుత స్థితి అనంత గుణాలుగల ఉన్నతమైన ఆనందమువైపు మనలోని చైతన్యము మేల్కొనునట్లు ప్రేరణ కలిగించ గలిగితే అప్పుడు పరిమితులు లేని రంగంలోనికి ప్రగతి సాధించవలెననే భావన మనలో మేల్కొల్పుటకు వీలవుతుంది. అందుకే ఒక గింజ ఎత్తు జ్ఞానము కావాలంటే దానికి కనీసం పదింతలు తెలివి అవసరమంటారు. ఆ మాత్రపు తెలివి ఉంటే మన ధ్యేయం మన దృష్టి పథంలోనికి వస్తుంది, మనము మరింతగా పరతత్వపు రంగంలోనికి చొచ్చుకొని పోవడానికి మనలను ప్రేరేపిస్తుంది. మన ప్రత్యుత్పన్న మతిత్వాన్ని (Resourcefulness) మన ప్రగతికై ప్రయోగించడమనే అంశంలో నిలిపివేసినపుడే కష్టము కలుగుతుంది. అటువంటిది ఏర్పడినప్పుడు మన మనస్సులో స్వేచ్ఛ అనే భావమే అంకురించదు. ఆ స్థితి నిజానికి మన దుఃఖపూరితస్థితిని తెలియజేస్తుంది. అటువంటి వ్యక్తులు తమ ఆలోచనలకు, సాధనలకు

ఒకదాని వెనుక ఒకటిగా పొరలను కలిపే ఆలోచనలకు శాశ్వతంగా బలియై ఉంటారు. అంటే వారు తాము చిక్కుకొని ఉన్న వలనుండి తమను విడిపించే మార్గాలను ఎవరైనా సూచించినా వినలేనంతగా తమ మార్గాలకు గట్టిగా బంధింపబడి ఉన్నారు.

మనము దేనితో మొదలు పెట్టినామో, అదే విధముగా మన ప్రగతికి ప్రతిబంధకమౌతుంది. చిట్ట చివరకు మనము అనంతత్వము లోనికి ప్రవేశించవలె కాబట్టి మానవాత్మ ప్రగతిని సూచించే గుర్తు ఏదీ వాస్తవానికి ఉండకపోవచ్చు. ఏదో విధముగా మనము మానవుడు చేరగలిగిన అత్యున్నత మజిలీని లెక్కలోనికి తీసుకోగలిగితే, అప్పుడు, మొదలు మనము దేనిని గ్రహించినామో అదే మనకు మార్గము పొడవునా దారి చూపుతుంది. అనంతత్వపు నిజతత్వాన్ని మనకు అందివ్వగల గురుదేవులను పరమాత్మ మనకు పంపుతాడు. ఆ విధంగా గాక వ్యక్తి నిజమైన సత్యతత్వాన్ని గురించిన భావనను సరిగా గ్రహించనిచో అతను తన సాధనకు చేపట్టే మార్గాలు, పద్దతులు అతని ప్రగతికి ప్రతిబంధకాలుగానే సహకరిస్తాయి. అందువల్ల తప్పని సరిగా విజయం కలగాలంటే ధ్యేయాన్ని ప్రాప్తింపచేసుకోవాలనే గాఢ నిర్విరామ స్థితి కలిగి ఉండుట ఒక్కటే అవసరము. అదే గురుదేవుని నీ గడపవద్దకు తెస్తుంది.

సత్య తత్వంలోనికి కనీసం తొంగి చూడాలనుకునేవారికి, నా ఉద్దేశములో, హృదయపు లోతులను స్పృశించే విధానమే సరియైనది. ఈ పనికి మామూలుగా ఉపయోగించే బాహ్య పద్ధతులు వాస్తవానికి నిరుపయోగాలు. అవి ధ్యేయానికి దారితీయవు.

దీనికి పనికివచ్చే సరియైన పద్ధతులను కనుగొనాలంటే ఈ సృష్టికంతటికి ఉనికినిచ్చిన కారణాల్ని లెక్కలోనికి తీసుకోవాలసి ఉంటుంది. ఈ పనికై ఏదో శక్తి కచ్చితంగా పనిచేసింది. అయితే, అది ఏది? సృష్టి చేయాలనే భావ గర్భితమైన సంకల్పమే అది. దానితోబాటే స్థితిలయముల భావములుకూడా అక్కడే ఉన్నవి. ఆ సంకల్పమే మనిషిలోనికి కూడ అవతరించి అతని సత్తాలో అంతర్భాగమయింది. మనలో ఉండే ఈ శక్తిని సరిగా ఉపయోగించుకుంటే, దీని మర్మము ఛేదింపబడుతుంది. దీనికి దానివలెనే అన్ని శక్తులు ఉన్నాయి. కాని మానవునిలో అది మానవత్వపు హద్దులకు లోబడి ఉంటుంది. మనము ఎదిగే కొలది ఇది శక్యత (సాధ్యత)గా పెంపొంది మన ఉనికికై వివిధ రంగాలను మండలాలను గ్రహిస్తుంది. ధ్యేయము వైపు మన యాత్రలో వీటన్నింటి ద్వారా మనము పయనించవలసి ఉంటుంది. బంధనాలని పిలువబడే ఇవి పొరలుగా మారి, సత్యతత్వములోనికి తొంగి చూడడానికి కూడా వీలు కలిగింపవు. మహా శక్తివంతుడైన సమర్థ గురుదేవుల సహాయం లభించినప్పుడే మనము ఆ పొరలను చీల్చుకొని అనంత పరతత్వములోనికి మన యాత్రను సులభము, సుగమము చేసుకొనగలము. ప్రాథమిక

దశల్లో గ్రంథులు, కేంద్రాలు, ఉపకేంద్రాలు కూడా మన ప్రగతిని అడ్డుకుంటాయి. సత్యతత్వ సాధనలో మనము వీటిగుండా పయనింపవలసి ఉన్నది. మన తప్పుడు ఆలోచనలు, సాధనాల వల్ల సంక్లిష్టతలు కూడా ఏర్పడతాయి. వాటిని మనము క్షాళన ద్వారా పూర్తిగా తొలగించుకొన వలసి యున్నది.

క్లుప్తంగా చెప్పాలంటే, మార్గం పూర్తిగా పర్యటించిన, తనలో దివ్యశక్తులను పెంపొందించుకున్న గురుదేవుల సహాయము ఎంతో సహాయకారి అవుతుంది. అప్పుడు మాత్రమే దివ్యశక్తి ఆ దైవిక కేంద్రాలనుండి అభ్యాసిలోనికి ప్రవహింప మొదలుపెడుతుంది. సూక్ష్మమైన ఈ శక్తి చాలా శక్తివంతమైనది. కాబట్టి అభ్యాసి ఉన్నత స్థితులలోనికి పైకి చేరుకునే దానికి స్వయంగా ఎంత ప్రయత్నించినా బలవత్తరమైన ఈ శక్తి ప్రవాహమువల్ల అతడు క్రిందికి త్రోసివేయబడతాడు. ఆ సందర్భాలలో ఈ ప్రవాహము మధ్యనుండి అభ్యాసిని పైకి లాగి అనంతత్వపు దృశ్య సాక్షాత్కారాన్ని అతడు పొందేటట్లు చేయగలిగింది, గురుదేవుల చైతన్యశక్తి మాత్రమే.

అభ్యాసి తానుగా అత్యావశక్యంగా చేయవలసింది కొంత ఉంది. మొదటిది : అతనికి గురుదేవులపై సంపూర్ణ విశ్వాసముండి ఆయనతో అన్నివిధాల సహకరించాలి. ఆ విధంగా ఉంటే అతడు దినదినాభివృద్ధి చెందుతూ తనలో కలిగే మార్పులను, పరివర్తనను అనుభూతి చెందుతాడు. అతనిలో అధోస్థాయి ఎరుకగల చైతన్యస్థితి పరివర్తన చెంది, ఉన్నతతర విధాల చైతన్యపు స్థితిలోనికి అతని యాత్ర మొదలవుతుంది. సాధారణంగా చైతన్యము మూడు స్థాయిల్లో ఉంటుందంటారు. అవి : బాహ్య చైతన్యము, అంతర చైతన్యము, అధిమానస చైతన్యము. ఏమైనా ఇవి విశాలతర విభాగాలు మాత్రమే. ఇందులోని ప్రతి విభాగములోను అసంఖ్యాకములుగా స్థాయిలున్నాయి. నిమ్న చేతన చర్యల ప్రభావము అంతర్ చైతన్యముపై స్థిరపడి విధిని ఏర్పరుస్తుంది. అందువల్ల ప్రప్రథమంగా మనము చేయవలసిన పని సరియైన భావన, సాధనలతో దానికదే శక్తిగా మారి అంతర్ చేతనను కాంతివంతము చేయగలిగేట్లుగా అధోచేతనను సరిదిద్దాలి. ఇది మనలను అధిమానస చైతన్యస్థితికి తీసుకువస్తుంది. అధిమానస చైతన్యమనే దానిని అధి - అంతర్ - చైతన్యంగా మార్పుచేస్తే, అప్పుడు దాని తరువాతి ప్రభావాలు మనకు అర్థముకావడం సులభమౌతుందని నేను అనుకొంటాను. ఏది ఏమైనా, గురుదేవుల కృపవల్ల మనమాస్థితికి చేరితే, మరొక అంశము మనకై ఆవిష్కరింపబడుతుంది. దీనికంటే ఉన్నతతర దశలు మనకు గోచరం కావడానికి మనమొక విధంగా దీనిలో లయమౌతాము. ''ఉన్నతతర'' అనే పదం దీని అతి అరుదైన స్థితిని మాత్రమే సూచిస్తుంది. ఇదే అర్థంలోనే, ఈ సందర్భంలో ఉపయోగింపబడిన ఆధ్యాత్మిక రంగాలకు, స్థాయిలకు

వర్తిస్తుంది. క్లుప్తంగా చెప్పాలంటే, చైతన్యంలోని వివిధ దశలు మనలను ఒకటి తర్వాత కొటిగా ముందుకు తీసుకుపోతూ త్రిమూర్తిత్వ స్థితికి, ఆ తరువాత అనంతత్వస్థితికి, దానికి అతీతంగా కూడా చేరుస్తుంది. అప్పుడు స్వేచ్ఛ స్థితి మొదలవుతుంది. అయితే ఇది చాలా ప్రయాసతో కూడిన యాత్రాఫలితంగానే లభిస్తుంది. స్వేచ్ఛోదయం కాగానే యాత్రవల్ల కలిగిన శ్రమ తొలగిపోతుంది. దాని భారముతో మనము కృంగి పోయియున్నామనే భావనకూడా కలుగదు.

మన ప్రయాణము ఇంతటితో ముగియదు. సత్యతత్వ సాక్షాత్కారము మౌలికరూపమైన ఆ మూలాధారమువైపు మన ప్రయాణము ఇంకా కొనసాగుతుంది. రంగురంగుల దృశ్యాలు అంతమై, అనంతత్వం తన అసలు రంగులో వెంటనే కనబడడం మొదలవుతుంది. అప్పటికీ యాత్ర పూర్తికాలేదు. ఇంకా కొంతయుంది. కాని అది వివరణకు అనిర్వచనీయమైనది. స్వేచ్ఛకు సంబంధించిన భావము ఎంతో కొంత అక్కడ ఉన్నది. అది అక్కడ ఉన్నంతసేపు, మన యాత్ర అంతానికి వచ్చియున్నా, అది ఇంకా మనకు బంధమే. ఆ స్థితిలో పరమాత్మ సహాయసహకారములు మాత్రమే మనలను ముందుకు తీసుకొని పోగలవు. అయితే మనము సంపూర్ణమైన మరపు స్థితిలో ఉన్నప్పుడే అది సంభవము. అందువల్లనే నేను ఈ అర్థములో, ప్రజలు తమ్ముతాము తెలుసుకొనడం కంటే తమ్ముతాము మరచి పోవడం మంచిదని ప్రోత్సహిస్తాను.

నిజమైన భక్తుడు, ఆత్మ సమర్పణ (శరణాగతి) స్థితిలోనే, వాస్తవానికి భగవదిచ్ఛకు, అంటే గురువుల సంకల్పానికి, పరిపూర్ణంగా శరణాగతుడై ఆయన కృప అనే సూర్యకాంతిలో తాను చలికాచుకుంటాడు. అదే భక్తునికి భగవంతునికి మధ్యనుండవలసిన సంబంధము. ఇదే సంబంధాన్ని మనము సర్వత్ర పోషించుకోవాలి. ఎందుకంటే మనలను అధిమానస స్థితియనే అత్యున్నత స్థితికి చివరకు చేర్చేది ఆ సంబంధము మాత్రమే. ఈ స్థితిలోనే మన అస్తిత్వపు నిజస్వరూపము వ్యక్తమవుతుంది. అయితే స్వేచ్ఛా భావన ఇంకా కొనసాగితే, అంటే ఆ భావన వ్యక్తిలో ఇంకా మిగిలియుంటే అతడు యింకా సంకెళ్ళ (బంధనాల) నుండి విడపడలేదన్నమాట. స్వేచ్ఛకు సంబంధించిన ఎరుకకూడా పోయినప్పుడే వ్యక్తి తాను ఆశ్చర్యకర దిగ్భ్రమలో మునిగిపోయిన అనుభూతి చెందుతాడు. అప్పుడక్కడ పరతత్వానికి సంబంధించిన భావన కూడా ఉండదు. వ్యక్తి తాను అనంతత్వంలో సమ ఉజ్జీగా నడక సాగించడం లేదనే అనుకుంటాడు. మనము అనంతత్వపు సర్వస్వములో పరిపూర్ణంగా లయమై ఉన్నామనో, లేదా అనంతత్వ సర్వస్వము మనలోనికి పరిపూర్ణంగా గ్రుమ్మరింపబడిందనో అంటే మనమీ స్థితిని మరింత అర్థమయ్యేటట్లు చెప్పినట్లువుతుంది. సర్వస్వము లయమైపోయినప్పుడు వ్యక్తికి తానెక్కడున్నది ఎరుకకు రాదు. బ్రహ్మములోనికి లయమై పోవడం మొదలవుతుంది. అయినా

మానవుడు చేరగలిగిన చివరిస్థితిని సాధించడం మనము ఇంకా ముందుకు పోవలసి ఉంది.

అట్టి అత్యున్నత ఫలితాలను, అతి తక్కువ కాలంలోనే, మానవ జీవితంలోని కొద్దికాలం లోనే మనకు అందించగలది సహజమార్గ సాధన లేక పూజ తప్ప మరేదీ లేదని నేను ధైర్యంగా, ఘంటాపథంగా చెప్పగలను. సహజమార్గమంటే అదే.

# 9. సూక్ష్మమైన రాజయోగము

(దీ.25-03-1967న విజయవాడలో

ధ్యాన మందిర ప్రారంభ సందర్భంగా ఇచ్చిన సందేశము)

సత్సంగానికి ఒక మందిరాన్ని నిర్మించి యిచ్చిన డా॥ వి. పార్థసారధి పట్ల కృతజ్ఞతాభావంతో, నేను ఈ దినం మీతో సంభాషిస్తున్నాను. ఇది అత్యున్నత స్థాయికి చెందిన వాస్తవమైన కార్యమని నా భావన. దీనితో ఆయన ఇంతవరకు చేస్తూయుండిన కృషి చాలా సులువుగా పెంపొందుతుంది.

మన ప్రాచీనులు, సాక్షాత్కార మార్గాలకై, క్రియాశీలక జీవనానికి దూరంగా, తమ సహచరులతోను ఇతరులతోను గల ప్రాపంచిక బంధాలనన్నీ తెగదెంపులు చేసుకొని, అరణ్యాలలో అన్వేషించినారు. సహజమార్గ విధానంలో మనము మన ఇండ్లలో మన చుట్టూ ఆ వాతావరణాన్ని సృష్టించి అడవులు చేసే పనిని అదే నెరవేర్చునట్లు చేస్తాము. ఇందులో మనం చేసే పని; మనల్ని మనం మరింతగా పరతత్వంతో అనుసంధించుకుంటాము. దాని ఫలితంగా వైరాగ్యం మనలో దానికదే ఉపలక్ష్యంగా ఏర్పడుతుంది. ఆ విధంగా మనము ఈ సహజమార్గంలో, మన కృషితో పనిలేకుండా వైరాగ్య స్థితిలోనికి ప్రవేశిస్తాము.

మనకొక ధ్యేయము తప్పనిసరి. దానిని మనం అత్యంత స్వాభావికమైన పద్ధతిలో సాధించ ప్రయత్నించాలి. సాక్షాత్కార ప్రాప్తికి ఎన్నో పద్దతులు వున్నాయి. ప్రతి పద్ధతిముందు, ఏది అత్యుత్తమ విధానమని పరిశీలించడం మన ధర్మం. తన జీవిత మర్మాన్ని ఛేదించుకునేందుకు ఏ విధానము సరియైనదనే నిశ్చయము ఆయా వ్యక్తుల నిర్ణయం మీద, పరమాత్మ కృపమీద ఆధారపడి యుంటుంది.

మానవునిలోని సంకల్పశక్తి (ఇచ్ఛాశక్తి) పరమాత్మకత్యంత సన్నిహితమైనదనే విషయము అందరూ అంగీకరించినదే.

మన ఆలోచనలు ప్రతి క్రియవల్లనే మన యీ ప్రస్తుత క్షీణ స్థితి కలిగింది. అందువల్ల అనేక ఆలోచనల సహాయముతోనే మనము ఉన్నత స్థితులకు పరిణామము చెందగలము. కాబట్టి వాటిని మనము దివ్యత్వాన్ని అనుసరించడానికి వినియోగిస్తే, అది మనలను చివరకు ధ్యేయానికి దగ్గరగా చేరుస్తుంది. నీ ధ్యేయము నీ ఎదుట ఉన్నది అంటే నీకు తాజాతనమిచ్చి నీవు మరింత ముందుకు పోగలిగేటట్లు నిన్ను తయారు చేయగల స్వచ్ఛమైన గాలి నీవైపు

వీస్తున్నదన్నమాట. తన లక్ష్యము ఎప్పుడు సాధిస్తామా అనే నిర్విరామ మానసిక స్థితి వ్యక్తికి ఉంటే, ఆ మార్గంలో మొదటి అడుగు వేయగానే తరువాతి స్థితులు వాటికవే అతనిని అనుసరిస్తాయి. అనేక ధ్యేయాలను కలిగి వాటిని సాధించడానికి వివిధ మార్గాలను అనుసరించకుండా ఉండాలంటే వ్యక్తికి ఒకే ధ్యేయం అవసరము. ఫలితాన్ని గురించి యోచించక వ్యక్తి తన కర్తవ్యాన్ని నెరవేర్చాలనే విషయాన్ని కృష్ణపరమాత్మ నొక్కి చెప్పినారు. ఆయన 'నిష్కామకర్మ'ను ఎందుకు సూచించినారు? ఎందుకంటే : ఫలితాన్ని గురించి నీవు ఆలోచించినప్పుడు నీవు దానిలోనికి దుముకుతావు. ఫలితంగా ధ్యేయము వైపు కర్తవ్యానికై నిన్న ప్రోద్భలము చేయవలసిన శక్తి విచ్చిన్నమౌతుంది. ఆ విధంగా వ్యక్తిలోని శక్తి, వివిధ మార్గాలగుండా ప్రవహించే నదిలోని నీరు వృధా అయినట్లుగా, పూర్తి ఖర్చయి ఖాళీ అవుతుంది. కాబట్టి ఒకే ఒక ధ్యేయాన్ని కలిగి, దానిని సాధించడానికి సర్వశక్తులను వినియోగింప ప్రయత్నించాలి. ఫలితాన్ని గురించి ఆలోచింపరాదు. లేకుంటే, నీవు నీ శక్తిని అనేక మార్గాలలో వినియోగించడం వల్ల ఆ శక్తి చాలావరకు నిరర్ధకమవుతుంది.

పరతత్వము సూక్ష్మాతి సూక్ష్మమైనది. మనము ఏదో విధంగా పరతత్వమంత సూక్ష్మంగా మారగలిగితే ఆయనలో మనము ఒకటైనామని అర్థము. సహజమార్గ విధానంలో మనం ప్రారంభం నుండే సూక్ష్మంగా ఎదగడానికి ప్రయత్నిస్తాము. గురువుగారు కూడా దానికొరకే ప్రయత్నిస్తారు. మన కర్తవ్యాన్ని పూజగా భావిస్తాము. అదే మనలను సూక్ష్మస్థితికి తెస్తుంది. మరోచోట నేను చెప్పినట్లు, మనలో ఏర్పడే కృత్రిమ కంపనాలను మనం అదుపుచేసి, దైవికమైన కంపనాలను కలిగి ఉండడానికి ప్రయత్నిస్తాము కూడా. ఈ విధానంలో మన దృష్టి సర్వస్వము సూక్ష్మత వైపునకే మరలింపడి ఉంటుంది. కాబట్టి 'యోగ' రీత్యా మనలో స్థూల్యతను పెంచే వాటిని విడిచిపెట్టేస్తాము. మన ప్రయత్నము ఆ విధముగా కొనసాగి చివరకు స్థూల్యత మన నుండి వీడ్కోలు తీసుకొనే సమయము వస్తుంది. సూక్ష్మత కూడా తన ఆకర్షణను కోల్పోతుంది. దాని తర్వాత వచ్చేదేది? మనము కోరకున్నది మనము అన్వేషిస్తున్నది మాత్రమే. మీకందరికి అట్టి స్థితిగాని స్థితి లభించాలని నా హృదయపూర్వక ప్రార్థన.

# 10. ముక్తిని ప్రసాదించే ధర్మమార్గము

(ది.28-05-1967న హైదరాబాద్‌లో యోగాశ్రమ భవన ప్రారంభోత్సవ సమయంలో ఇచ్చిన సందేశం)

ఇది నేను మన సహోదరులందరితో కలసియున్న ఓ సంతోష సమయము. చిన్నదయినను ఈ భవన సముదాయమును కట్టుటలో సహకరించిన మన సహచరులకూ, అందరికీ, నా హృదయపూర్వక అభివందనములు తెలుపుచున్నాను. ఇప్పుడు సేవలను మన సహవాసులకు అందించటానికి మెరుగైన అవకాశము కలిగి ఉన్నాము.

ఈ ప్రస్తుత సామాజిక పరిస్థితుల్లో వారు సేవాధర్మాన్ని వదలి గురుత్వాన్ని పొందాలన్న తపనను వెలువరించటం, చాలా విచారించవలసిన విషయం. మనం లేమినుండి అధికారమునకు, సేవల నుండి నాయకత్వమునకు వృద్ధినొందితిమని చరిత్ర తెలుపుతున్న సత్యము. గురుత్వమను ఆలోచన సేవాధర్మ ఆలోచనతో నిండియున్నది. కానీ సత్పురుషులు ఆ సేవాధర్మమే ఈనాడు వారున్న ఈ స్థితికి కారణమన్న విషయమును విస్మరించారు. ఎప్పుడైతే ఆలోచనా మూలమును విస్మరిస్తారో దాని ఆకృతి పూర్తిగా భగ్నమవుతుంది. అప్పుడు సేవకుడూ ఉండడు, ఆ గురువూ ఉండడు. నిజమైన గురువైనట్లయితే, శిక్షకుడు శిష్యులందు ఒక పరిమళమును, ఆ తపోవనానికి ఆకర్షించబడే విధంగా తన యోగ్యమైన శిక్షణ చేత గుబాళించగలగాలి. శిష్యులలో పరిపూర్ణతతో ఉద్దీపింప చేయగల సమర్ధతను పెంపొందించు కొనువరకు, ఏ వ్యక్తీ, ఆధ్యాత్మిక శిక్షణ ఇచ్చుటకు అర్హుడు కాడు.

ఇప్పుడు, ఉదయించే ధర్మసందేహమల్లా, అలాంటి వ్యక్తిని ఎలా కనుగొనడం? నా అభిప్రాయం ప్రకారం, అటువంటి గురువును పొందే అర్హత ఉన్నదీ, లేనిది వారు నిర్ణయించుకోవాలి. అది కొరవడినప్పుడు దానికి అర్హులుగా సంసిద్ధం చేసుకోవాలి. కొన్ని సమయాల్లో అదృష్టం కలిసివచ్చి, కొందరికి అర్హత లేకపోయినప్పటికీ, ఆధ్యాత్మిక శిక్షణ ఇచ్చే గురువు లభించటం తటస్తిస్తుంది. అట్టి సందర్భాలలో అది కేవలం దైవకృప మాత్రమే. నా ఇష్ట హక్కులను తిరిగి చెబుతున్నాను. "అర్హులైన వారి వేదనతో కూడిన హృదయపూర్వక ఆర్తనలే, గురువును అతని ద్వారం వద్దకు రప్పిస్తాయి." వ్యక్తి, తనను తాను అర్హుని గావించుకొనుటకు, తన లక్ష్యమును, తన ప్రస్తుత స్థితిని పూర్తిగా దృష్టిలో ఉంచుకోవాలి. తర్వాత ఆధ్యాత్మిక వికాసమును కలుగచేసే పద్ధతులనూ, మీ లక్ష్యసాధనను, నిరోధించే వాటిని ఛేదించగలిగే పద్ధతులను అవలంబించుకొనవలెను. ఇవి సత్‌తత్వాన్వేషణను ఏర్పరచు

మూలవాక్యములుగా గుర్తుంచుకోవాలి. మనలో దేవుని తెలుసుకొనటమే చాలనుకొనేవారే ఎక్కువమంది కలరు. ఈ అభిప్రాయం సరియైనది కాదు. ''దేవుని పొందటం'' అనేదే ఆధ్యాత్మికతలోని నిజమైన భావము.

ఒక క్రమమైన పద్ధతిలో మనం సాగినట్లయితే అనుభవాలు కలుగుతాయి. పరిమాణపు వేళ్ళు మొదటి రోజే నాటుకుంటాయి. అనుభవాలు కూడా మొదట్లోనే ఉంటాయి కాని అవి ఊహాజనితమైన ఆలోచనలతో కూడి ఉంటాయి. అలా అదే క్రమంలో సాగుతూండగా ఆఖరున పొందే అనుభవం వేరే ఏ అనుభవాల అవసరం లేనటువంటిది.

ఎంతోమంది ఒక లక్ష్యం అంటూ ఏదీ లేకుండా వారి వారి పద్ధతుల్లో దేవుణ్ణి ప్రార్థిస్తుంటారు. కాబట్టి వారు అదే కక్ష్యలోనే, ఎక్కడైతే మొదలుపెట్టారో అదే చోటిలో పరిభ్రమిస్తుంటారు. ప్రజలు ఎక్కువగ, ఇతరులను చూసి, వారు అనుసరించే పద్ధతులనే అవలంబిస్తారు. హిందూ మతంలో విచారకరమైన అంశం ఏమిటంటే ఋషులనుకొనే ప్రతివారు ఏదో ఒక పద్ధతిని, ఆధ్యాత్మికతలో ఎటువంటి అనుభవం లేనప్పటికీ బోధిస్తుంటారు. ఆధ్యాత్మిక పద్ధతి సక్రమమైనదై, గొప్ప ఋషుల అనుభవాలతో కూడి, పవిత్ర గ్రంథములలో మూలమైనదై ఉండవలెను. మనఃపూర్తిగా వాటిని గ్రహించి, సుదూరాలకు కొనిపోనటువంటి దారులను, పద్ధతులను అనుసరించకుండా ఉండాలి. పదకొండవ శతాబ్దంలో భారతదేశం వచ్చిన చరిత్రకారుడు ఆల్‌బెరౌని పదాలు నా జ్ఞప్తికి వచ్చుచున్నవి. ఆయన ఈ విధంగా అన్నాడు ''ఇతరుల ఉద్దేశాలను లక్ష్యపెట్టుటకు సిద్ధముగా లేకుండా, జీవన విధానములోని అన్ని అంశములు వారి స్వంత అభిప్రాయాలే అంతిమమయినవన్న తలంపే హిందువుల క్షీణ దశారంభమునకు కారణము.''

''సహజమార్గ'' పద్ధతిలో శిక్షకుడు, అభ్యాసి అభివృద్ధి మార్గములో పొందే అడ్డంకులను తొలగించుతూ, దివ్య తేజస్సును అతనికి ప్రసరింపజేస్తాడు. అదే అభ్యాసి స్వయంగా పొందటానికి వందల ఏళ్ళు పట్టవచ్చు. అదికాక తనను పరిశుద్ధ పరచుకోవటంలో తరచూ విఫలం అవుతాడు. మనం హృదయం మీద ధ్యానంతో మొదలెట్టి, ధ్యానవిషయాన్ని సూక్ష్మాతి సూక్ష్మంగా వుంచుతాము. పూర్వపు ప్రమాణముల ఆధారంగా శ్రీ రామానుజాచార్యులు ఆకారము గల విషయముపై ధ్యానమును నిషేధించారు.

మనమందరం, మన పక్షపాత వైఖరిని విడచి, ముక్తిని ప్రసాదించే ధర్మమార్గములోకి పయనిద్దామని, నేను మనఃపూర్తిగా ప్రార్థిస్తున్నాను.

# 11. శాశ్వత సత్య ప్రాప్తికి సూక్ష్మమార్గము

(ది.20-06-1967న బెంగుళూరులో ఇచ్చిన సందేశము)

ఆధ్యాత్మిక అవసరాలకు అనుగుణంగా మానవాళి మేల్కొనే సమయమాసన్నమైంది. సృష్టి ప్రవాహవేగం మానవునిలో బాహ్య లక్షణాలను ఏర్పరచించి. ఆ కారణంగానే, కాలం గడచేకొలది మానవుడు అనేక ప్రపంచాలను తనకుతానుగా సృష్టించుకున్నాడు, ఫలితంగా అతడు సంక్లిష్టుడుగా తయారైనాడు. అతనిలోని ప్రస్తుత అపరిపక్వ మానసిక స్థితికి అతని చర్యలే కారణం. పరమాత్మ సులభుడు, సులభ పద్ధతుల ద్వారానే ఆయనను సాధింపవచ్చుననే మౌలిక భావన, దురదృష్టవశాత్తు, మానవుల దృష్టి నుండి తొలగిపోయింది. సత్‌తత్వ ప్రాప్తి సామాన్య మానవుల అందుబాటులో లేదని ఇంచుమించు అన్నిరకాల వేదికల నుండి ప్రచారం చేయబడింది. తమకుతాము "గురువు"ల మని చెప్పుకునే వారి వలన ప్రచారం చేయబడిన ఈ తప్పుడు భావన యించుమించు ప్రతివారి హృదయంలోను గాఢంగా నాటుకొని పోయి, ఫలితంగా ఈనాడు ఉన్నతతర స్థితుల పట్ల ఆకాంక్ష కూడా వారిలో కరువైంది.

మతానికి సంబంధించిన ఆచార్యాధిపత్య పరంపరలోనున్న వారితో సమానంగా, కాకుంటే ఇంకా అధికంగా, సత్‌తత్వ ప్రాప్తి పొందడానికి తగిన హక్కు, అర్హతలు సామాన్య మానవునికి ఉన్నాయనే విషయాన్ని మీ హృదయాలలో నాటుకునేటట్లు నేను చెప్పదలచినాను. సరియైన, సహజమైన మార్గాన్ని పరిపూర్ణ భక్తి విశ్వాసాలతో అనుసరించడం ఒక్కటే కావలసినది. సరళమైన ఈ సత్యాన్ని తెలుసుకొని దానిని తన నిత్యజీవిత కార్యక్రమంగా చేసుకోమని సహజమార్గము ప్రజలను ప్రేరేపిస్తుంది.

పరమాత్మ సూక్ష్మాతి సూక్ష్మ అస్తిత్వము. ఆయన సాక్షాత్కారం పొందడానికి సూక్ష్మాతి సూక్ష్మ మార్గమొక్కటే శరణ్యము. పరమాత్మ ప్రాప్తి కొరకు వ్యక్తి న శారీరక అవసరాలను లేదా తన ప్రాపంచిక అవసరాలను అలక్ష్యము చేయమని దీని అర్థం కాదు. స్థూల్యతను మరింతగా పెంచే మార్గాన్ని మనము ఒకవేళ అనుసరిస్తే పరతత్వపు దర్శనానికి మనము చాలా దూరంలో ఉండిపోతాము. ధ్యాన వస్తువు స్థూలమైనది కాకపోతే దానిపై చేసే ధ్యానము సూక్ష్మమైనదనే విషయము అందరూ అంగీకరించినదే. అందువల్లనే, సహజమార్గములో, హృదయంలో దివ్య ప్రకాశమున్నదనే భావనతో మాత్రమే ధ్యానము చేయవలెనని మనము సూచిస్తాము. ఉపనిషత్తులు కూడా దీనిని స్థిరపరుస్తున్నవి. దివ్య ప్రకాశపు శక్తి ప్రసారము (ప్రాణాహుతి) ఆధారంగా ఈ విధానము రాను రాను సూక్ష్మతరంగా మారి చివరకు సూక్ష్మాతి సూక్ష్మమౌతుంది.

మానవ జీవితపు గతిని నిర్ణయించడంలో గురువు పాత్ర అతిప్రధానమైనది. అభ్యాసి తన స్వయంకృషితో, ఒక స్థాయి తర్వాత ఉన్నత తరగతులలోనికి ప్రగతి సాధించలేడనే విషయంలో అనుమానం లేదు. ఎందుకంటే, ఆ యాత్రలో అతనికెదురయ్యే సూక్ష్మశక్తిని అతడు అధిగమించలేడు. అధోస్థితులలో కూడా వ్యక్తి తన స్వయంకృషి తోనే ప్రగతికై ప్రయత్నిస్తే అది కష్టసాధ్యమవుతుంది. తనకు మాత్రమే తెలిసిన మానవ చైతన్యము అక్కడ ఉంటుంది. ఒకటి తర్వాత ఒకటిగా స్థితులను అధిగమిస్తూ అతడు దివ్యచైతన్యములోనికి పోవలసి వుంది. చివరికది అతనిని ధ్యేయం చేరుస్తుంది.

దివ్యత్వానికి తగిన వాతావరణాన్ని ఇంతవరకు మనము ఏర్పరచుకోలేదు కాబట్టి ఆ దివ్యత్వాన్ని దాని నిజస్థితిలో భావించే స్థితిలో మనము లేము. ఇదే మన విషాదకర గాథ (స్థితి). వెలుగుకు ముఖాముఖిగా వెళ్ళుటకు బదులు మనము దాని వెనుకకు, అంధకారంలోనికి పోతాము, ఆ పనిచేసినందున గర్వపడతాము కూడా. ఫలితంగా సత్‌తత్వము నుండి దూరమవుతాము. దైవత్వంతో సంబంధం లేని వ్యక్తులు సృష్టించిన ప్రస్తుత వాతావరణానికి లోనైన మనం, విచక్షణాశక్తిని కోల్పోయినాము. కాబట్టి, ఎవరైనా పై విషయాలు మన దృష్టికి తెచ్చినా మనము వాటిని పట్టించుకోము. మానవత ఉన్నత స్థితికి చేరాలంటే - అది తప్పక ఉన్నత స్థితికి చేరుతుంది - కాల వైపరీత్యాలవల్ల గాని లేదా అనుభవం వల్లగాని పరిస్థితులు మార్పు చెందవలసి వుంది, కొంతకాలం పట్టినా అది జరిగి తీరుతుంది.

# 12. రాజయోగ మౌలిక సూత్రములు

(ది.05-01-1968న బెంగుళూరులో ఇచ్చిన సందేశము)

సృష్టి ఏర్పడక పూర్వము మౌలిక అస్థిత్వము కలిగి ఉండినది. సమస్తము సారభూతముగా అందులోలయమై ఉండినది. ‘‘క్షోభ్’’తో వీటి వ్యక్తీకరణ మొదలయింది. ఈ క్షోభ్ అంతర్గర్భిత చైతన్యరంగంలో ఒకవిధమైన మధనమును రేకెత్తించినది. చైతన్యం పునరుజ్జీవనం పొందింది, దానితో శక్తికి ఉత్సాహము పుట్టి, సృష్టి వ్యక్తీకరణకు చర్య మొదలయింది. ఈ చర్య పరతత్వంతో పరిపూర్ణ పొందిక కలిగి ఉన్నప్పటికీ, ఈ వ్యక్త స్థితికి వచ్చుటలో అది విభిన్న మార్గాన్ని అనుసరించినది, కాబట్టి బాహ్య ఆకారంలో దానికంటే భిన్నంగా కనిపించింది. దానికి మానవ రూపకల్పనతో గల సన్నిహిత సంబంధం వల్ల దీనిని మానవతా రేఖ (Line of humanity) అనవచ్చును.

ఇప్పుడీ రెండు రేఖలు - దివ్యత, మానవతలు - ఒక దాని సరసన ఒకటిగా, సమాంతరముగా, చైతన్యవంతంగా నడుస్తున్నవి. మూలాధారమువద్ద సృష్టి చేయడమే ప్రధానలక్ష్యంగా ఉండడం వల్ల మానవతారేఖ ప్రాధాన్యత సంతరించుకొనడం మొదలైంది. ఆ సమయంలో మానవుడు ఇంకా సూక్ష్మ స్థితిలోనే ఉన్నా మానవునితో సహా సమస్తమూ గుర్తించగల రూపాన్ని సంతరించుకొనడం ప్రారంభమైంది. మరొక విధంగా చెప్పాలంటే మానవతారేఖ సమస్త నిర్మాణానికి మూలాధారమయిందని అనవచ్చు. అయితే దీని చర్యలు, దీనితో సమాంతరంగా పురోగమిస్తున్న దైవత్వ రేఖయొక్క అంతర్గర్భిత చర్యలకు అనుగుణంగా ఉండినది. అందువల్ల శక్తి సక్రమంగా పనిచేస్తూ ఆకారాలను స్వరూపాలను బహిర్గతం చేయడం కొనసాగించింది. మానవతారేఖ దివ్యత్వరేఖతో పొందిక గలిగి పనిచేయక పోయివుంటే, నిజంగా అది అంత బాగుగా పనిచేసి ఉండేది కాదు. క్లుప్తంగా చెప్పాలంటే, మానవత దైవత్వంతో సమాంతరంగా పయనిస్తూ దానితో ఏకీభించి పనిచేసింది.

చర్యలు అనేకరెట్లు పెంపొందుతూ పోయినవి. మిగిలనవాటితో సహా మానవుడు కూడా క్రమంగా స్థూల, స్థూలతర రూపాలు పొందడం ప్రారంభమైంది. మానవుని తయారీలోని సమస్తము మానవత అనే ప్రకరణము క్రిందికే వస్తుంది. అన్నింటికీ మూలంలో దైవత్వమే ఉంటుందనడంలో సందేహం లేదు. ఈ కారణంవల్లనే పరమాత్మ మానవునిలో అంతర్యామిగా ఉన్నాడని అంటారు. ఇంచుమించు అన్ని మతాలవారు ఈ అభిప్రాయాన్నే కలిగియున్నారు.

దివ్యత్వరేఖతో మనవతారేఖ సంబంధము కలిగి ఉంటూ, దివ్యత్వము వైపు పయనిస్తున్నపుడు మన అంతిమధ్యేయం నెరవేరుతుంది.

ఈ రెండూ ఒకే దైవమునుండి, అంటే అనంతత్వం నుండి ఉద్భవించినవే కావడం వల్ల దివ్యత్వము వలెనే మానవత్వం కూడా పరిశుద్ధ రూపంలో ఉండినది. చైతన్య శక్తి స్థాయి నామమాత్రముగా లేదా నిద్రావస్థలో ఉండిందని కూడా అనవచ్చును. చర్యలు ప్రతిచర్యల వల్ల ఏర్పడిన తీవ్ర సంచలనములు (Jerks) ఒక విధమైన జాగృతిని కలిగించినవి, ఫలితంగా వ్యత్యాస, వ్యతిరేకభావములు బయటపడడం మొదలయింది. శీతోష్ణములు విభిన్న మార్గాలలో సాగుతూ ఆకారాలను పెంపొందించినవి. ఇవన్నీ మానవ నిర్మాణంలో ప్రవేశించడం వల్ల అతని ఉనికి వీటన్నింటి మిశ్రమముగా తయారైనది.

వీటన్నింటిని వాటి వాటి తొలి స్థితులకు తీసుకొని రావడమే ఇప్పుడు మనము చేయవలసిన పని. లేదా అవి దివ్యత్వముతో తమ సంబంధాన్ని తిరిగి ఏర్పరచుకొనేటట్లు వాటిని సమత్వస్థితికి, నిర్మల స్థితికి పునరుద్ధరించాలి. దీనిని సాధించడానికి ఒకే యొక మార్గము : వాటిలోనికి తగిన సమతాస్థితిని ప్రవేశ పెట్టడం మాత్రమే. పరతత్వ ప్రాప్తికి సహజ విధానమైన మన సహజమార్గములో మనము ఆ పనే చేస్తాము.

మానవుని పరిపూర్ణంగా దివ్యునిగా మార్చడమంటే ఏమిటో ప్రజలందరికి పూర్తిగా అర్థంకావడానికే ఈ ప్రకృతి రహస్యాన్ని ఇక్కడ నేను వివరించడం జరిగింది.

సహజమార్గపు మౌలిక సూత్రాలను వివరించే అవకాశం నాకు కలిగినందుకు చాలా సంతోషంగా ఉంది. మనఃపూర్వకముగా అన్వేషించే ప్రతియొక్కరికి, దివ్యత్వ స్థితి అందించడానికి నేను సంసిద్ధంగా ఉన్నాను.

# 13. అనంతం వైపు సాగు రాజయోగము

(ది.27-11-1968న విజయవాడలో ఇచ్చిన సందేశము)

పరమాత్మను నిర్గుణ పరబ్రహ్మమును సాక్షాత్కరింప చేసుకొనడానికి (పొందుటకు) విశ్వములోని మతాలన్నీ ఏదో యొక మార్గాన్ని నిర్ణయించినవి. చాలమంది ప్రజలు వాటిని అనుసరించుట మొదలు పెట్టినారు. కాని, కాలం గడిచేకొలది కాలకొడవలి వీరిలో మార్పులకు కారణమై వీరు ఇరుప్రక్కలకు తొంగిచూడడం ప్రారంభించినారు. ఈ ప్రపంచపు నిత్యజీవన పరిస్థితులు వారిని ఆకర్షించడం మొదలయింది, జీవితపు అవసరాలు వారు యితర విధానాలను అనుసరించేటట్లు నిర్భంధపరచినవి. కళలు, వృత్తులు పెంపొంది వివిధ రకాల దేవతల రూపాలను ఈ కళాకారులు తీర్చిదిద్దగా, ప్రజలు వాటిని పూజించనారంభించినారు.

ప్రారంభంలో, ఆ కాలపు విజ్ఞులు, సాక్షాత్కార సాధనకు నిశ్చయపదమైన 'యోగ'మునకు దారితీసే పూజా విధానాలను నియమించవలసి వచ్చినది. అయితే ప్రకృతి నియమానుసారం పరిణామాన్ని వికేంద్రీకరణ, వికేంద్రీకరణను పరిణామము అనుసరిస్తుంది. వారి మనస్సులు నిజమూలతత్వము వైపు ముందుకు సాగకపోవడం వల్ల ప్రతిమలు దైవస్వరూపములైనవి. అసలైన పూజా విధానము మరుగునపడినది. దాని ఫలితాన్ని ఇప్పుడు మనము చూస్తున్నాము. దివ్యకృప ప్రసారానికే ప్రతిబంధకంగా తయారయ్యే విధంగా స్థూల్యత పెరిగింది. స్థూల్యత పెంపుదల యిదేవిధంగా కొనసాగితే, ఉన్నతోన్నత స్థితులను చేరుట అసాధ్యమవుతుంది. సహజమార్గ విధానములోని అందమేమిటంటే, పరమాత్మ కృప అభ్యాసిలోనికి ప్రవేశించడానికి వీలుగా స్థూల్యత తొలగించి అంతరంగాన్ని శుద్ధిచేయడమే. ఈ స్థూల్యత పెంపుదల అట్లే ఉంటే అభ్యాసి అడుగడుగునా తప్పటడుగు వేయడం లేదా జాగుచేయడం సంభవిస్తుంది.

మార్గములో ఎదురయ్యే మరొక కష్టమేమిటంటే ఈ కాలపు ప్రజలకు 'యోగ'మంటే భయం పట్టుకుంది. ఎందుకంటే, ఎప్పుడు యోగాన్ని గురించి మాట్లాడినా, వారి మనస్సులు హఠయోగము, ప్రాణాయామము మొదలైన వానిపైపు మళ్ళించబడినవి. ఈ విధానములు చాలమందికి అపాయము కలిగించి ఉండవచ్చును. చాలమంది తాము అనుసరించే పద్ధతులతోనే సంతృప్తిపడి ఉండడం వల్ల, పునర్నిర్మింపబడిన రాజయోగ విధానమైన మన సహజమార్గ పద్ధతి ప్రభావమును పరీక్షించడానికి కూడ అంగీకరించరు. కాని అటువంటిదేమి అందులో లేదు. సంతృప్తినే ప్రశాంతతకు చిహ్నంగా వారు భావిస్తున్నారు. కాని, సంతృప్తి అనేది ఇంద్రియాలకు సంబంధించిన స్థూలతరమైనదైతే, ప్రశాంతత ఆత్మకు సంబంధించినది.

ఈ పూజను వారొక్క దినము చేయకపోయినా వారు నిర్విరామతను (ఏదో పోగొట్టుకొన్న భావాన్ని) అనుభవిస్తారు. అయితే అక్కడ ప్రశాంతత చోటుచేసుకొని ఉంటే, నిర్విరామత చెందడం అనే ప్రశ్న ఉదయించదు. మనము ఆధ్యాత్మికంగా ప్రగతి సాధిస్తూపోతే ఈ ప్రశాంతత స్వభావము కూడా మారుతూపోయి చివరకు ఫలితముగా 'శాంతిగాని శాంతి' లభిస్తుంది. మనము ఆధ్యాత్మికముగా ప్రగతి సాధించాలంటే పరిమితిలోని అపరిమితితో (అనంతత్వముతో) మొదలు పెట్టాలి. ఈ విధంగా మనము సత్యతత్వంతో సంబంధమేర్పరచుకుంటాము. తరువాత స్థితిలో, పరిమితత్వ భావము తొలగింపబడి మనము అనంతత్వంలో నిమగ్నం కాగలము. ఇప్పుడు తలుపులు తెరువబడి మనము సరియైన మార్గంలోనికి వస్తాము. మనస్సు నుండి పరిమితత్వంను తరిమివేసినపుడు దారి సుగమమవుతుంది. మనం అనంతంలో అనంతంవైపు ముందుకు సాగుతాము. ఫలితంగా అనంతత్వ భావన కూడా బయటపడదు. ఇప్పుడు సత్యతత్వము ఉదయిస్తుంది. ఇంకా ముందుకుపోయి మనము ఆ సత్యతత్వంలోనికి దుమికితే ఆటముగిసి, 'దర్శనము' మొదలవుతుంది. అయితే ఇది అంతము కాదు. ఇంకా ముందుకు పోవాలి. ఇది కాదు, ఇది కాదు ('నేతి నేతి').

# 14. దైవ స్మరణ

(ది.18-12-1968న బెంగుళూరులో ఇచ్చిన సందేశము)

మీతో కలసి ఉండడము నాకు చాలా ఆనందం కలిగించినది. నా సహచరులందరూ ఒకచోట కలిసినప్పుడు అది నాకు దేవాలయమౌతుంది. వారు వారి హృదయాలను దేవాలయాలుగా చేసుకోవడం వారి విధి. నియమిత పద్ధతిలో మీరు ధ్యాన సాధన చేస్తున్నందులకు చాల సంతోషం. అయితే కొందరు ధ్యానమైన వెంటనే తమకు దానితో సంబంధములేనట్లు ఉంటారు. పరమాత్మను గురించిన భావనను మరచిపోయి, పగలంతా తమను గురించిన స్మృతిలోనే ఉంటారు. దైవకార్యానికై తమనుతాము రూపుదిద్దుకోవలసిన కర్తవ్యము వారిదే. వారంతా ఈ సంస్థ మనదని, మన దైవమిదేయని, ప్రారంభం నుండే భావిస్తే, అపుడు ఆయన స్మరణలో ఎంతో సహాయాన్ని పొందుతారు.

# 15. ప్రాణాహుతిలో కూడిన రాజయోగము

(ది.06-05-1969 నాటి సందేశము)

ప్రస్తుత ప్రపంచము అశాంతి అయోమయాలతో కూడిన స్థితిలో ఉంది. ప్రతి యొక్కరు శాంతికోసం బాధపడుతున్నట్లున్నది. అయితే, శాంతికై చేసే ప్రయత్నాలన్నీ విజయవంతమౌ తున్నట్లు లేవు. దీనికి కారణం ఈ ప్రయత్నాలన్నీ బాహ్యమైనవే. అవి బయటి పొరను (ఉ పరితలాన్ని) మాత్రమే తాకుతున్నవి. వాస్తవానికి ఈ సమస్యకు ప్రపంచంతో గల సంబంధం చాలా దూరం. నిజానికిది వ్యక్తికి సంబంధించిన సమస్య. తరువాతనే సమాజానికి చెందినది. కాబట్టి దాని పరిష్కారం కూడ అదే క్రమంలో ఉండాలి. ప్రపంచశాంతి వ్యక్తిగత శాంతితో చాల సన్నిహిత సంబంధం కలిగి ఉంది. కాబట్టి, వ్యక్తి యొక్క అంతర్గత మానసిక స్థితిని మనము లెక్కలోనికి తీసుకోవాలి. మానవుని మనస్సును ప్రశాంతత మరియు క్రమస్థితికి తీసుకువస్తే బయటి ప్రపంచములోని సమస్తము అదే రీతిలో దానికదే ఒక క్రమస్థితికి వస్తుంది. ప్రపంచానికి నిజమైన ఆధారము పోయింది. ఇది చాల విచారకర విషయము. దానిని పునరుద్ధరించడానికి, మానవుల వ్యక్తిగత మనస్సులలో శాంతి ప్రశాంతతల భావన పెంపొందడానికి తగిన పద్ధతులను అనుసరించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. దీనికై మనము చేయవలసినది ఏమంటే, ఆయా వ్యక్తుల మానసిక స్వభావాలను తగు విధంగా సరిదిద్దితే, అవి తమ ప్రభావముతో వారి మనస్సులను సరియైన రీతిలో మలచి క్రమపరుస్తాయి. వ్యక్తిగత మనస్సు విశ్వమనస్సు స్థాయికి ఎదిగినప్పుడే ఇది సాధ్యము. ఆవిధంగా ఊహించు! అప్పుడు సమస్యేలేదు. ప్రస్తుత స్థితిలో, శాంతి ప్రశాంతతలు తమలోనే లోటుగానున్న వ్యక్తి మనస్సులు, ప్రపంచములో శాంతిని సాధించాలని ప్రయత్నిస్తున్నాము. ఇది పరిహాసాస్పదంగా లేదూ? మానవులకు అందుబాటులో ఉండే ఒకే ఒక్క మార్గము ఆధ్యాత్మిక జీవనాన్ని అనుసరించడమే. అయితే, దురదృష్టవశాత్తు, ఈనాడు అదీలేదు. ఫలితంగా అయోమయతకు దారితీసింది.

దీని పరిష్కారానికి అనేక మార్గాలను విధానాలను సూచించడం జరిగింది. అయితే వీటన్నింటిలోను ప్రధాన లక్షణము లోపించింది. ఏ సాధనా విధానములోనైనా ప్రధాన విషయము మనస్సు పోకడలను సరియైన మార్గములోనికి మరలించడమే. కాబట్టి మనస్సును క్రమపరచుటే అన్ని ఆధ్యాత్మిక సాధనలలోని మౌలిక విషయము. మనస్సు తన ప్రప్రథమ స్థితిలో ఉన్నప్పుడు పూర్తిగా శుద్ధంగా, క్రమంగా ఉండేది. మన తప్పుడు చర్యలు, అపమార్గాల

వల్ల అది చెడగొట్టబడింది. అది తన పూర్వపు స్థితిని తిరిగి పొందడానికి దానిని సరిదిద్దవలసి ఉంది.

ఇంచుమించు అన్ని సాధనా పద్ధతులలోను రెండు అంశాలున్నవి. ఒకటి స్వయంకృషి లేక అభ్యాసము, రెండవది గురువుగారి సహాయ సహకారాలు. తగిన స్థితిని పొందడానికి స్వయంకృషి లేక అభ్యాసము మాత్రమే సర్వస్వము కాదు. దీనికి దైవకృప తోడుపడవలసి ఉన్నది. ఈ కార్యనిర్వహణకు ఇది అత్యావశ్యకము.

దివ్యకృప గురుదేవులనే మాధ్యమముగుండా మాత్రమే వ్యక్తిలోనికి ప్రవహించడం సాధ్యమౌతుంది. అందువల్ల అభ్యాసి, గురువు ద్వారా దివ్యకృప తనలోనికి ప్రవహింపవలెనని కోరుకొనడమే నిజముగా చేయవలసిన పని. స్వయంకృషి లేక అభ్యాసము ఆ దివ్యకృపకు మనలను పాత్రులుగా చేయుటకు సాధనము మాత్రమే.

నేను ఈ విధంగా చెప్పడములో మతపరమైన గురుత్వమునకు అనుకూలముగా ఏదో విధంగా వాదిస్తున్నానని అర్థంకాదు. దివ్యకృపను ప్రాణాహుతి లేక యోగప్రసారము ద్వారా అభ్యాసిలోనికి ప్రవహింపచేయగల శక్తియుతుడైన వ్యక్తే గురువు కాగల అర్హత గలవాడు. అట్టి అర్హుడైన గురువర్యుని ఎన్నుకొనడం నిజంగా ఒక సమస్యే. గురువుల అర్హతను పరికించే సులభపద్ధతి ఒకదానిని నేనిక్కడ సూచిస్తాను. నీవు ఎవరితోనైనా కలసి ఉండే అవకాశము వస్తే, అతని సాంగత్యము వల్ల నీలో శాంతి ప్రశాంతతల భావన పెంపొందిందా లేదా యని, నీ మనస్సులో నిర్విరామంగా చెలరేగే భావనల ఉధృతం మనస్సుపై భారం వేయకుండా తాత్కాలికంగానైనా చల్లబడిందా లేదా అని అర్థంచేసుకొనే దానికి ప్రయత్నించు. ఆ విధంగా చల్లబడితే ఆయన అర్హుడే. నీ జీవిత సమస్యల పరిష్కారానికి నీకు సహాయపడగల, తగిన అర్హతగల వ్యక్తి అతడేనని నీవు నిర్ధారించుకోవచ్చు.

సహజమార్గంలో దివ్యకృప అభ్యాసిలోనికి ప్రాణాహుతి ప్రక్రియ ద్వారా చొప్పించబడుతుంది. వాస్తవంగా చూస్తే, అత్యంత తక్కువ వ్యవధిలో అభ్యాసి ఆధ్యాత్మిక ఔన్నత్యానికి, అతనిలోని సంక్లిష్టతల తొలగింపుకు, ప్రాణాహుతి ప్రక్రియ సహాయము వల్ల కలిగే ఫలితము కొన్ని దశాబ్దాల స్వయంకృషితో కూడ పొందడం అసాధ్యము. ప్రాచీన గ్రంథాలలో నియమించిన పద్ధతుల ప్రకారం స్వతంత్రంగా ధ్యాన కార్యక్రమాన్ని చేపడితే, ఘోరమైన కష్టాలు ఎదురౌతాయి. పాత పద్ధతిలో వ్యక్తి తన మనస్సు యొక్క ఎడతెగని చర్యలను అణచివేయడానికి నిరంతరం శ్రమించవలసి వుంటుంది. కాలమంతా ఈ పనితోనే సరిపోతుంది. వాస్తవంగా ధ్యానం చేసేందుకు ఏమీ మిగలదు. ధ్యాన సమయమంతా ఆలోచనలను, స్వభావాలను అదుపులో

పెట్టుకునేందుకు చేసే శ్రమకే ఖర్చయిపోతుంది.

అత్యంత కష్టమైన దీనిని అధిగమించడానికి సహజమార్గంలోని సాధకుడు చేయవలసిన పని ఎవరి మనస్సు, ఇంద్రియాలు, గుణగణాలు పరిపూర్ణంగా క్రమపరుపబడి సురక్షితమైవున్నవో అట్టి గురుదేవుని శక్తితో తనను తాను అనుసంధించుకొనుట మాత్రమే. అప్పుడు గురుదేవునిలోని శక్తి అభ్యాసి మానసిక స్వభావాలను కూడ క్రమపరచడం ప్రారంభిస్తుంది. అందువల్ల నిశ్చయమైన విజయానికి గురుదేవుల సహాయం అత్యంత ప్రధానం.

సాధారణంగా ప్రజలు, ప్రారంభదశలో, తమ మానసిక చర్యల నిలుపుదలను లక్ష్యంగా ఏర్పరచుకుంటారు. ఇంద్రియాలకు అతీతంగానున్న మహాశక్తితో లేక పరిమితులను అధిగమించిన వ్యక్తితో అభ్యాసి సంబంధం ఏర్పరచుకుంటే, ఈ ప్రాప్తిని సులభంగా పొందవచ్చు. అట్టి మహావ్యక్తితో మనము భక్తి ప్రేమలచేత అనుసంధించుకొని, సరియైన పద్ధతిలో సాధన (ధ్యానం) చేస్తే, తగిన విధంగా పరివర్తన చెందడం ప్రారంభిస్తాము. క్లుప్తంగా చెప్పాలంటే, మనలను పరిమితులకు, ఉద్రేకాలకు కట్టిపడవేసే బంధనాలను మనము ఒక్కొటొక్కటిగా తెంపివేయవలసి వున్నది. పరమాత్మ కృప అవతరించి ప్రపంచానికి, మానవులకందరకు శాంతిభద్రతల నొసంగు గాక !

# 16. ప్రాణాహుతితో మూలమువైపు మనయాత్ర

(1970 జనవరి సందేశము)

మనము మొదటిసారి ఈ ప్రపంచములో పుట్టినపుడు, ఏ మూలాధారము నుండి మనము దిగివచ్చినామో అది పరిశుద్ధమైనది కాబట్టి, మనము కూడ పరిశుద్ధులుగా ఉండినాము. కాలం గడిచే కొలది, అసంఖ్యాకములైన (లెక్కలేనన్ని) జన్మల పరంపరలో, మన చర్యల ఫలితంగా, మనచుట్టూ వివిధరకాల స్థూలత్వమును సేకరించుకున్నాము.

ప్రస్తుత జన్మలో కూడా మనము కార్యకలాపాలను సాగిస్తూనే వున్నాము. ఈ చర్యలే నెమ్మదిగా మన మౌలిక పరిశుద్ధత చుట్టూ స్థూలత్వపు పొరలను ఒకదానిపై ఒకటిగా ఏర్పరచిన ఫలితముగా కాలక్రమేణా మనము, తనచుట్టూ పట్టు గూడును అల్లుకొని అందులోనే బంధింపబడిన పట్టుపురుగువలె తయారైనాము. మానవుడు తన భౌతిక అస్తిత్వంలో ఈ స్థితికి చేరుకున్నప్పుడు అతని జీవితము (చేసేపనులు - వాటి ఫలితాలు) కృత్రిమత్వంతోను స్థూల్యతతోను నిండివుంటుంది. అతనిలోని మౌలిక పరిశుద్ధత మినుకు మినుకుమంటూ అస్పష్టమైన, తరచు ఏమాత్రము దృష్టి గోచరము కాని కాంతి స్థితికి తగ్గింపబడును. అతనికి స్వగృహము యొక్క జ్ఞాపకముండదు, మరియు క్రియా, ప్రక్రియల వల్ల తని చుట్టూ ఉన్న గుల్లపెంకు పదార్థము కఠినంగా, కఠినతరంగా తయారై మూలస్థానపు ఎరుక రానురాను అస్పష్టమై, చివరకు పూర్తిగా మరచిపోబడుతుంది.

ఇప్పుడు మనము మన ప్రస్తుత జన్మతో విసుగుచెందే స్థితికి చేరినాము. అయితే మన అసలు ఉనికి యొక్క పరిశుద్ధ ఆనంద స్థితి, స్మృతి మనకు లేదు. ఎందుకంటే ఈ అస్తిత్వానికి అలవాటుపడిపోయి ఆ మొదటి స్థితిని గూర్చిన స్మృతి అసలు లేకపోవడమే దీనికి కారణము.

ప్రస్తుత స్థితినుండి తప్పించుకోవాలంటే మనము మన మూలానికి తిరిగి చేరాలి. మనలను బంధించి వుంచిన పొరలను తొలగించుకుంటూ తిరిగివెళ్ళే మార్గం కనుగొనడం సంభవం కాకపోవచ్చు, కాని ఆ అనంతత్వపు మూలంతో సంబంధమేర్పరచుకొని తనలోని అత్యున్నత చేతనను ప్రాణాహుతి ద్వారా మనలో ప్రవేశపెట్టి మనబంధనాల చిక్కుముడులను విడదీయు శక్తిగల మార్గదర్శకుని సహాయముతో ఇది సాధ్యము.

ప్రాణాహుతి ప్రసాదము యొక్క మొట్టమొదటి, ఇంచుమించు తక్షణ ప్రభావము మాటలతో వర్ణింపలేని శాంతి ప్రశాంతతలు. ధ్యానంలో కలిగే ఈ అనుభవము మనము తిరిగి

చేరవలసిన ఆ మూలమును మనకు మెల్లమెల్లగా జ్ఞప్తికి తెస్తుంది. పదేపదే కలిగే ఈ అనుభవాలు మన మొదటిస్థానపు స్మృతిని బలపరచి మన ఇప్పటి జీవితపు బంధనాలను విడదీస్తాయి. ప్రాణాహుతి ప్రసారము ఈ జ్ఞాపకపు లోలోతులలోనికి తీసుకువెళ్ళే కొద్దీ, మూలమువైపు మనయాత్ర దృఢంగా స్థిరపడును.

ఇట్టి అనుభవం మీకందరికీ కలగాలని నా కోరిక.

# 17. అనంతత్వానికి మార్గము

(ది.16-01-1970న రాయచూర్ యోగాశ్రమ ప్రారంభ సందర్భంగా సందేశము)

మన రాయచూర్ కేంద్రము దినదిన ప్రవర్ధమానమై ఈనాడు తన స్వంత "ఆశ్రమ" భవనం కలిగి ఉండడము నాకు చాల ఆనందదాయకంగా ఉన్నది. ఆశ్రమము కలిగి ఉండుట అన్నది ప్రాచీన సాంప్రదాయము. ప్రాచీనకాలంలో ఒక చిన్న కుటీరమే కావలసినంత అయ్యేది. నాగరికత పెరిగేకొలది ఆశ్రమానికి ఆధునిక వసతులతో భవనము కావాలనే అభిప్రాయం ఏర్పడింది. అత్యుత్తమమైన ఆధ్యాత్మిక సేవ చేయడానికి తగిన వసతులు ఏర్పరచడమే ఆశ్రమ భవనము కలిగివుండాలని ఆశించడంలోని ముఖ్యోద్దేశము. ఏ ఆశ్రమములో నిజముగా పూజ ధ్యానములు నిర్వహింపబడుచుండునో అది గురుదేవుల ఆధ్యాత్మిక శక్తితో పూర్తిగా నింపబడి అక్కడ అభ్యాసుల పరివర్తనకు దోహదం చేస్తుందనే విషయం అందరికి తెలిసినదే.

ఆలోచనలకు కూడ జీవముంది. అవికూడ యితరుల జీవితాలపై తమ ప్రభావాన్ని చూపుతాయి. అయితే విషాదకర విషయమేమంటే మనం మన ఆలోచనలతో తేళ్ళను పాములను సృష్టించి యితరులను పీడిస్తున్నాము. ఈ స్థితిలో అవి ఆధ్యాత్మిక కార్యాన్ని నిర్వర్తించకపోగా దైవ వ్యతిరేకత అనే రొంపిలోకి లోతుగా కూరుకుపోయేట్లు చేస్తాయి. కాలానుగుణంగా మనము మేల్కొని యితరుల మంచికై - ఇది ఆధ్యాత్మిక సేవకన్నా తక్కువ స్థాయిదైనా - మనము మంచి పద్ధతులను ఆచరించాలి.

సాధారణంగా మానవుని పోకడ భగవంతునివైపే అనడంలో సందేహము లేదు. కాని విషాదకర విషయము కూడ దాని వరసనే మొదలౌతుంది. వారు భగవంతుని తనవంటి వానిగా మాత్రమే భావించి ఆ సూక్ష్మాతి సూక్ష్మ అస్తిత్వాన్ని స్థూలమార్గంలో పొందాలని ప్రయత్నిస్తారు. ఈ విషయములో కొంత ప్రగతి సాధించినవారు ఏవో కొన్ని ప్రశ్నలు వేసి, వాటినే ప్రతి మహాత్ముని ప్రశ్నిస్తూ, తమకు ప్రశ్నించడంలో నేర్పుందనే విషయాన్ని ప్రదర్శిస్తారు. సాధారణంగా వాళ్ళు అడిగే ప్రశ్నలలో ఒకటి : ఇన్ని బాధలు, కష్టాలతో నిండిన ఈ ప్రపంచాన్ని దేవుడెందుకు సృష్టించాడు? అని. అదే సమయములో వారు తమను తాము గమనిస్తే, ఆ ప్రశ్నకు సమాధానాన్ని తమలో తామే కనుగొనగలరు. ఇదే ప్రశ్న నాకు కూడ చాలాసార్లు వేయబడింది. కొన్నిమార్లు దివ్యచైతన్య శక్తి పరంగాను, మరికొన్ని మార్లు తదితరంగాను నేను సమాధానమివ్వడం జరిగింది. ఈ రహస్యాన్ని శాస్త్రీయపద్ధతిలో వివరిస్తాను. పరమాత్మ

శక్తి ఉద్భవించే (శక్తి ఉత్పాదక) కేంద్రం. వినియోగం లేకపోతే శక్తి గడ్డకట్టుకొని పోతుంది. అందువల్ల, తన అస్తిత్వాన్ని కాపాడుకునేందుకు ఆయన శక్తిని బహిర్గతం చేయగా, అదే సృష్టిగా వ్యక్తమయినది. చాలమంది దివ్యత్వాన్ని గురించి ఊరకే ప్రశ్నలు వేస్తుంటారు. అయితే దానిని ఏవిధంగా పొందాలనే భావన సాధారణంగా వారి మనస్సులలో కనిపించదు. మామిడి పండును తిని రుచి అనుభవిస్తే తప్ప దానిని గురించి ఊరకే మాట్లాడుతూపోతే తెలియదు. సత్యతత్వ (పరతత్వ) మనేది పిరికివారి రంగముకాదని నేను చెప్పవలసి వుంటుంది. సింహహృదయులు మాత్రమే అనంతత్వాన్ని చేరడానికి సాహసిస్తారు. ప్రజలను ఆ విధముగా మార్చుటే సహజమార్గపు కర్తవ్యము.

సహజమార్గ విధానము యాదృచ్ఛికముగా (అకస్మాత్తుగా) ఉద్భవించలేదు. గాఢ ఆకాంక్షతో ఎదురుచూస్తున్న మానవాళికి అది దయతో ప్రసాదించబడింది. సహజమార్గము పరతత్వ ప్రాప్తికి సహజమైన (ప్రకృతి సిద్ధమైన) విధానమును అనుసరిస్తుంది. దైనందిన కార్యక్రమంగా ప్రజలు అనుసరించడానికి ఆ విధానము ధ్యానంతో ప్రారంభమౌతుంది. పరమాత్మలో నిగూఢంగానున్న కృపను ఆహ్వానించే ప్రధాన మూలాధారము ధ్యానమే. ప్రపంచ ప్రారంభంతోనే దాని అంతము కూడ మొదలైనట్లుగా, ఈ మొదలే దాని అంతమౌతుంది. "అనంతం" వైపు మన ప్రయాణంలో, - ధ్యాన సమయములో - మనం వివిధరకాలైన వాతావరణాలతో కూడివున్న వివిధ రంగాల గుండా పయనిస్తాము. అనుభవాలు కలుగుతాయి. ప్రారంభదశలో, బహుశ, కొన్ని అనుభవాలు ఊహాజనితాలు కావచ్చు. కాని తరువాతి దశలోనివి దివ్యమైనవి. ఈ దివ్యానుభూతులు దివ్యత్వపు స్థితులను తెలిపే దృశ్యాలు. దివ్యత్వము మనవైపు ఎప్పుడు పూర్తిగా విచ్చుకోబడడం జరుగుతుందో అప్పుడు మన ప్రయాణము సుగమవుతుంది. అనంతత్వాన్ని సాధించాలని మన హృదయాన్ని భక్తిపూర్వకంగా సిద్ధంచేస్తే, మన యాత్రలో అనేక ఆధ్యాత్మిక స్థితులను అనుభూతి చెందుతాము. తాను వెనుదిరిగి ప్రకృతితో సమానుడై, తన్నుతాను సూక్ష్మముగా, సూక్ష్మతరముగా తయారుచేసుకొను వ్యక్తిలో అనంతత్వం ఉదయిస్తుంది. స్థూల్యత పూర్తిగా తొలగిపోనిదే పరతత్వములోనికి తొంగిచూచుట కూడ సాధ్యపడదు. దారిలో ప్రతిబంధకము లుంటే దానికి మనమే బాధ్యులము. ఇవన్నీ తొలగింపబడితే తప్ప సత్యతత్వావిర్భావమును మనము ఆశించలేము. సూక్ష్మాతి సూక్ష్మ అస్తిత్వాన్ని సాధించడానికి సూక్ష్మ మార్గాలనే మనము అనుసరించాలి. దానికి విరుద్ధంగా మన మార్గాలు స్థూల్యములయితే మనలో ముందే వున్న స్థూల్యతకు తోడుగా వక్రతను కూడ ఏర్పరచుకొనడం ప్రారంభిస్తాము. మనలోని ప్రతి రక్తనాళము స్థూలతర ప్రభావముతో మార్పులు తేవడానికి ధృవాన్ని (Pole) ఏర్పరుస్తుంది. గురువర్యుల శక్తితో వాటిని నాశనం చేస్తే తప్ప అనంతత్వానికి మార్గం తెరువబడదు.

యోగాశ్రమ భవన ప్రారంభ సమయమైన ఈ పవిత్ర సందర్భంలో, ఈ భవన నిర్మాణానికి ధారాళంగా సహాయము సేవలు అందించిన విశాల హృదయములను నేను అభినందిస్తున్నాను. పరమాత్మ అందరినీ ఆశీర్వదించుగాక !

# 18. జీవిత లక్ష్యమునకు మార్గదర్శకుడు

(1970 మే నెల సందేశము)

అత్యంత ఆనందంతో ఈ అవకాశాన్ని వినియోగించుకొని నేను మీకో సందేశాన్ని అందిస్తున్నాను. ఇది చిన్నదే కావచ్చు. కాని నా హృదయపు లోలోతులనుండి ప్రేమాభినామాలతో యిది పెల్లుబికి వచ్చింది.

తన దృష్టి పథం నుండి తొలగిపోయిన తన నిజస్వభావాన్ని మరల పొందవలెనని ఆత్మ ఆకాంక్షిస్తున్నది. ఈ అల్ప ప్రాణి సహయాత్రీకులను స్వేచ్ఛా పథములో ముందుకు సాగిపండని కోరుతున్నది. వారు లక్ష్యాన్ని క్షేమంగా చేరడానికి నేను సహాయపడే ఉద్దేశంతోనే నేను నా సహ యాత్రీకులను ఈ విధంగా కోరుతున్నాను. మొదటిసారి చూస్తే, ఈ భావన మీకు క్రొత్తదిగా తోచవచ్చు, కాని కొంతసేపాగి సమస్యను పరిశీలిస్తే, విధివైపరీత్యం వల్ల, ఎక్కడనుండి నీవు, తటాలున లాగివేయబడినావో, ఆ నీ స్వగృహానికే నీవు యాత్ర సాగిస్తున్నావనే నిర్ణయానికి తప్పక వస్తావు.

"విధి వైపరీత్యము" అనే పదాలను ఎప్పుడు ఉపయోగిస్తామో, దానితోనే సమతారాహిత్యత మనకు జ్ఞప్తికి వస్తుంది. సమతూకపు స్థితి యున్నంతకాలం మనకు రూపమంటూ ఏది ఉండేది కాదు. మనమిప్పుడు చేయవలసిన పనియేమిటంటే కేవలము అంతరంగాలను విప్పి, మనము పోగొట్టుకున్న సమతూకపు స్థితిని పునరుద్ధరించుకొనడం మాత్రమే.

మనము మనలో సమతను పునరుద్ధరించుకున్నాము అని చెప్పడం ఎంత సులభం! అది సులువైనదని అనడంలో సందేహం లేదు, కాని దానిని సాధించి చూపడం చాల కష్టం, ఎందుకంటే : సమతారాహిత్యపు స్థితిలో మనము అనేక చిక్కులను సృష్టించుకున్నాము. మనము మార్గాన్ని ఎంచుకునేందుకు, మన జీవిత సమస్యను పరిష్కరించుకునేందుకు, మనదేశంలో సామాన్యంగా ప్రచారంలో ఉండే కఠినమైన విధానాలనే అనుసరింపచూస్తాము. అందుకే దాని ఫలితంగా నిరాశ నిస్పృహలు లభిస్తాయి. బాగా బలిసిన పదార్థాలనుండే సారాన్ని పిండాలని మనము అనుకుంటాము. దీనినే మరొక విధంగా చెప్పాలంటే, కణాలను తేజోవంతం చేసే భాస్వరం సమృద్ధిగా ఉండే ఎముకలలో నుండి, అవి ఎంత మలినముగా నున్నాసరే, వాటి నుండి సారాన్ని పిండటానికి బదులుగా భౌతికమైన జ్ఞానముతో నిండిన వాటినుండి సారం పిండుతున్నాము. ఈ పద్ధతిలో మన యీ పోరాటములో కష్టము మరింత అధికమౌతుంది.

సులభమైన దానిని పొందడానికి సులభ పద్ధతులచే ఉపయోగించండి. సిద్ధాంతాలు ఉపయోగపడవు. చేరవలసిన దూరాన్నంతా స్వానుభవంతో కొలిచి, మౌలిక ఆధారాన్ని కనుగొన్న వ్యక్తి యొక్క మార్గదర్శకత్వంలో నీవు అనుసరించే ప్రత్యక్షానుభవపూర్వక విధానమే నీ భవిష్యత్తును తీర్చి దిద్దుతుంది !

నీకు అత్యంత సన్నిహితంగా ప్రియముగా నున్న నీ లక్ష్యమునకు నిన్ను తీసుకుపోగల మార్గద్శకులు భారతదేశంలో కొందరున్నారు. అయితే, నీకు తగినవారిని ఎన్నుకోవలసింది నీవే. నీ అన్వేషణలో నీకు ఆ పరమాత్మ మార్గదర్వకత్వం వహించడానికి, ఎవరిలో స్వార్థంలేక, సేవానుభవము మాత్రమే ఉంటుందో అక్కడే సత్యతత్వముంటుందని నేను చెప్పక తప్పదు. ప్రత్యేకంగా జ్ఞప్తియందుంచుకోవలసిన మరొక ముఖ్య విషయం : తనలోని అంతర్గత దివ్యశక్తులతో నిన్ను ప్రేరేపించి, నీ కర్తవ్యాన్ని సులభతరము చేయగల వ్యక్తియే నీకు ఆధ్యాత్మికతలో మార్గదర్శకత్వము వహింప సమర్థత గల వానిగా తెలుసుకొని నీవు గట్టిగా ఆయనను అనుసరించాలి. అటువంటి వ్యక్తి లభించినాడంటే నీ జీవిత సమస్య విజయవంతంగా పరిష్కారమైనదనడానికి నిశ్చయమైన గుర్తు. అన్వేషకులైన మీకందరికి అట్టి మార్గదర్శి లభించాలని నా ప్రార్థన. తథాస్తు !

మీకు అట్టి మార్గదర్శకుడు లభిస్తే, మీ ఆధ్యాత్మిక ఔన్నత్యానికై ప్రార్థించడం తప్ప నేను చేయవలసి మిగిలిపోయిన కార్యమేమీ ఉండదని నేననుకుంటాను. మీకందరికీ ఆ వెలుగు లభించాలని ఆశించడం నా విధి.

# 19. సవరించి పునర్నిర్మించిన రాజయోగము

(ది.20-02-1972న చెన్నై పట్టణంలో యోగాశ్రమ భవన
ప్రారంభ సందర్భంగా ఇచ్చిన సందేశము)

ఇప్పుడు నేను ప్రారంభిస్తున్న ఈ భవనాన్ని రామచంద్రమిషన్ కార్యకలాపాలకు సమర్పించిన మిత్రులు శ్రీ చిక్కపుట్ట గౌడకు కృతజ్ఞతలు తెల్పుతూ, ఈ సందర్భంగా మీతో మాట్లాడడానికి నాకు ఎంతో ఆనందంగా ఉంది. సంఘటనలు వస్తూపోతుంటాయి. కాని వాటి స్మృతి మాత్రము తేజరిల్లుతూ, రాబోయే తరానికి, ఈ భవనం మంచి పనికోసం ఇవ్వబడిందనే విషయాన్ని నిరంతరం జ్ఞప్తిచేస్తూ, ఆధ్యాత్మిక కార్యకలాపాలు సుఖంగా గడచిపోవుటకు రాబోయేతరంవారు కూడ ఆవిధంగా చేస్తే బాగుంటుందని ప్రోత్సహిస్తుంది.

ఆనందమయ జీవితం గడపడం ఎలా? అనేది ప్రస్తుతము ప్రపంచం ముందున్న ప్రశ్న. సూర్యునికి వెన్నుజూపి ముందుకు పోయినప్పుడే సమస్య వస్తుంది. బుద్ధి బలము తన సంకుచిత పరిధిలోనే పనిచేస్తుంది. ఎప్పుడైనాసరే మనము విశాల దృష్టితోనే వస్తువులను గమనిస్తూ దాని పరిధిని అది అధిగమించేటట్లు దానిని విశాలతరము చేయాలి. పరిధి దాటబడగనే నీవు పరతత్వాన్ని ఆలింగనం చేసుకునేందుకు అవసరమైన ఆవిష్కారం నీలో కలుగుతుంది. సిద్ధాంతాలు నీకు ఏ మేలు చేయవు. అవి మిమ్ములను తమ సంకుచిత పరిధికి అంటిపెట్టు కునేటట్లు చేస్తాయి. కాబట్టి వాటివైపు నీ దృష్టి మరలింప పనిలేదు. నీవు పరతత్వాన్ని ఆలింగనం చేసుకునేందుకు మొదలుపెడితే అది నీవైపు అనుకూలంగా ప్రతిధ్వనిస్తుంది. నీవు సరియైన మార్గంలో ఉన్నావని తెలుసుకునేందుకు అది ఒక గుర్తు. దానిని రుచిచూచే విధంగా నీవు దానిని పెంపొందించుకో. సాధారణంగా మన అలవాటు ఏమిటంటే, మనం మౌలిక పదార్థాన్ని గురించి మాట్లాడుతాము కాని, దానిని గ్రహించే ప్రయత్నము చేయము. నీవు పూర్తిగా ఆయన వాడవైనప్పుడు మాత్రమే దానిని గ్రహించడం జరుగుతుంది. పవిత్ర గ్రంథాలు నీకు పరతత్వపు జాడను సూచిస్తాయి. కాని దానిని సాధించడానికి ముందుకు పోవలసింది నీవే. సృష్టిని గురించి మాట్లాడడము సులభం, కాని దానిలో మన పాత్ర ఏమిటని ప్రశ్నిస్తే దానికి ఎప్పుడూ బదులుండదు. ఇతరులను చూసి వారు వారి కర్తవ్యాలను, విధులను సరిగా చేయడం లేదని ఆరోపించడమే గాని, వ్యక్తులు ఆత్మ పరిశీలన చేసుకొని తాము ఇతరులకు చేయవలసిన దేమిటో అర్థము చేసుకోరు. ప్రపంచంలో యిన్ని దుఃఖాలు బాధలు ఎందుకున్నవని దైవత్వాన్ని తప్పుపట్టడానికి వారు సర్వసిద్ధంగా వుంటారు. ప్రపంచపు బాగుకై తాము నిర్వహింపవలసిన

పాత్రను గురించి ఆలోచించరు. ప్రపంచాన్ని తామే నాశనం చేస్తున్నామని, నిజంగా ప్రకృతి ప్రవాహమార్గంలో తామే చిక్కుముడులను సృష్టిస్తున్నామని అనుకోరు. ప్రకృతి రంగానికి తమవైన అపరిశుద్ధ భావనలను నిరంతరం కలిపే విధంగా వారి ఆలోచనా సరళి మొరటుగా తయారైంది. ఫలితంగా అక్కడ సంక్లిష్టతలపై సంక్లిష్టతలు ఏర్పడినవి. ఇవన్నీ మానవ మనోనిర్మితాలే. వీటికంతా బాధ్యులు వారే. ఎందుకంటే, ప్రపంచ నిర్మాణానికై కేంద్రము నుండి శక్తి అవతరించిన వెంటనే ఏర్పడింది మనస్సే. మనస్సుతో బాటు తప్పుడు ఆలోచనా సరళి కూడా పెంపొందింది. అయితే ప్రపంచంలోని దురవస్థలు, బాధలు, దుఃఖాలకు వీరు పరమాత్మనే బాధ్యుడుగా భావిస్తారు. ఈ లోకం మరల ఉజ్వలంగా ప్రకాశించాలంటే వారు వారిదైన సృష్టిని నాశనము చేయవలెను. దీనికై అనుసరించవలసిన విధానము - అత్యంత సూక్ష్మమైన దాని సాధనకై సూక్ష్మ విధానమే అవసరము - అది 'యోగ' మాత్రమే. 'సహజమార్గము' అని పిలువబడే మన పద్ధతి దీనికొరకే వెలిసింది. ఈ రంగములో కూడా పరిశోధనలు జరిగినవి. మా గురుదేవులు ఉత్తరప్రదేశ్ రాష్ట్రములోని ఫతేఘడ్ నివాసి శ్రీ రామచంద్రజీ మహారాజ్ వారు దివ్యత్వాన్ని త్వరగా చేరగల విధంగా 'యోగా'న్ని సవరించి పునర్నిర్మించినారు. మన ఈ పద్ధతిలో గురుదేవుల సహాయాన్ని సమృద్ధిగా పొందుతాము, అదే ఈ విధానములోని ప్రధాన లక్షణము. ఆధ్యాత్మిక యత్నంలో చివరివరకు సహాయమందివ్వడానికే ఈ సరళమైన ధ్యానపద్ధతి నిర్దేశింపబడింది. పరీక్షించనిదే దీనిని నమ్మవద్దు. అన్వేషకులు ప్రయత్నించి, అనుభూతి చెంది దీనిపై విశ్వాసముంచడానికి వీలుగా ఈ సహజమార్గము తెరచియుంచిన పుస్తకము వంటిది.

అన్వేషకులకు సలహాపూర్వకముగా ఒక విషయాన్ని చెప్పదలచినాను. మనస్సుతోనే మనస్సును అర్థం చేసుకోవచ్చు. అట్లే దైవత్వముతోనే దైవత్వము అర్థమౌతుంది. మరొకవిధంగా చెప్పాలంటే దివ్యత్వము కొరకు మనము దైవికమైన శక్తిని వినియోగించాలి. సూర్యుడు ఎల్లప్పుడు వెలుగుతూనే వుంటాడు. అయితే, ఆయన కాంతిని పూర్తిగా పొందడానికి నీవు, ఆవరించియున్న మేఘాలను తొలగించుకోవలసి వుంది. దీనికై, అసలు ఉనికి యొక్క అంతరాళాన్ని స్పృశింపగల విధానము అత్యవసరము.

# 20. సరళమైన రాజయోగము

(ది.09-07-1972న పశ్చిమ దేశాల నుండి తిరిగి వచ్చిన సందర్భంగా ఇచ్చిన సందేశము)

పరమాత్మ సరళుడు, ఆయనను పొందడానికి అనుసరించే విధానము కూడ సరళమైనది, అనువైనది. ఆంగ్లములో హోమోశేపియన్ (Homosapian) అని వ్యవహరింపబడే మానవుడు బుద్ధిజీవి. బుద్ధిమంతుడైన ఈ మానవుడు పరమాత్మకై అన్వేషణ సాగించినాడు. ఆలోచన శుద్ధము, దివ్యము అయినప్పుడు మూలమును నిశ్చయంగా చేరుతుంది. విశేషణములు, గుణములతో ఇది అపరిశుద్ధమవుతే సాక్షాత్కారసాధన కూడ అపరిశుద్ధమవుతుంది. హీనదశకు చేరుతుంది. స్థూల పద్ధతులు స్థూల ఫలితాలే ఇస్తాయి.

సరళము, శుద్ధము, అనంతములైన పరతత్వముపై మాత్రమే ధ్యానము చేయుటవల్ల మానవుడు సంకట స్థితి నుండి రక్షింపబడుతాడు. ఇది అతనిని మరింత సరళుడుగా మారుస్తూ స్వగృహానికి మరింత సన్నిహితము చేస్తుంది. నీ ఆలోచనను బట్టే నీవు తయారవుతావు (As you think so you become).

అత్యంత సూక్ష్మమైనదాని ప్రాప్తికై అత్యంత సూక్ష్మ విధానమే అవసరము. ఒకే విధానము, ఒకే గురువు, ఒకే ధ్యేయము అవసరము. అయితే వీటిని ఎవరికి వారే ఎంచుకొనవలసి ఉంది.

మనము సూక్ష్మ విధానాన్ని అనుసరిస్తేనే ఆలోచనల సాంద్రత తొలగింపబడుతుంది. మీకు దివ్యత్వము కావాలంటే అనుసరింపవలసిన మార్గము సులభము, సుగమము, అత్యంత స్వాభావిక మైనదిగా ఉండవలెననేది ఈ రంగములో నా అనుభవము.

వ్యక్తి బాల్యంలో, తన లేతవయస్సులో, ఆటవస్తువులంటే ఇష్టపడతాడు. కొంత పెద్దయిన తర్వాత ఆటవస్తువుల మీద ఇష్టముండదు. తన ఆనందానికై సూక్ష్మతరములైన ఇతరములకై అన్వేషిస్తాడు.

ఇందుకు సంబంధించి అనేక కష్టములను నేను గమనించినాను. ప్రజలు తమకేది కావాలో దానిని అనుసరిస్తారు. తమకు ఇష్టము వచ్చినట్లు ప్రవర్తిస్తారు. అయితే ఫలితము మాత్రం నాకు, వారికి ఎంతో ఇష్టమైనది, నేను ఆశించిన విధంగా వుండాలని ఆశిస్తారు. ఫలితంగా ఒకవిధమైన ఆటంకము ఏర్పడుతుంది. దీనిని నేను చాలమంది హృదయాలలో గమనించినాను. ఇది అనంతత్వాన్ని మరుగుపరచి, అది అభ్యాసి దృష్టిలో పడకుండా చేస్తుంది.

నన్ను అన్నింటికీ బాధ్యుని చేసేటట్లయితే, నేను చెప్పినట్లుగా తప్పక అనుసరించండని మిమ్ము కోరవలసి వుంటుంది. జపం ఎట్లా చేయాలో తెలియకనే ప్రజలు చేస్తారు. అట్లే పరమాత్మ తృప్తికి కాక, తమ తృప్తికే ఇతర పూజా విధానాలను వారు అనుసరిస్తారు. మీలో సహజత్వాన్ని (స్వాభావికతను) సృష్టించాలని నేను ప్రయత్నిస్తే, మీరు యాంత్రికతను ఇష్టపడతారు. ఈ విధంగా మీరు అద్దాన్ని వెనుక వైపునుండి చూస్తున్నారు.

“రాజయోగము” వంటి సాధికారికమైన గ్రంథాలను మనము చదువము. ఇది మన దయనీయస్థితి. తప్పుడు పద్ధతులను అనుసరించడం ద్వారా పేరుకుపోయిన ఇతరములన్నీ తొలగిపోయినప్పుడే రాజయోగము ప్రవేశిస్తుంది. ప్రశిక్షకులు అభ్యాసులలోని స్థూల్యతలను తొలగించి శుద్ధి చేస్తూవుంటే, వారు మరల వాటిని తమచుట్టూ చుట్టుకుంటున్నారు.

మీ కాళ్ళమీదనే మీరు నిలబడవలసి ఉన్నట్లుగా, ఈ సమస్యకు పరిష్కారం కూడ మీరే అన్వేషించవలసి ఉంది. దీనికి తగిన శక్తి అవసరమనుటలో సందేహం లేదు. దీనికై మా సహాయము తప్పనిసరి. అది ఎల్లప్పుడు మీ అందుబాటులోనే ఉంటుంది.

మద్రాసులో ఉన్న, ఉన్నతతర స్థితులకు చేరిన వ్యక్తులను చాలమందిని ఈనాటి సత్సంగములో నేను చూడగలనని ఆశించాను. కాని కొందరిని మాత్రమే నేను చూస్తున్నాను.

# 21. సత్ తత్వప్రాప్తిని పొందుటకు సహాయపడే గురువర్యులు

(ది.24-02-1973న మద్రాసులో లాలాజీ మహారాజ్ వారి శతాబ్ది సందర్భంగా ఇచ్చిన సందేశము)

మహోన్నతులైన మన గురువర్యులు సమర్థగురు మహాత్మ శ్రీ రామచంద్రజీ మహారాజ్, ఫతేఘడ్ (ఉ.ప్ర) వారి శతాబ్ది ఉత్సవ శుభ సందర్భంగా మనమంతా ఇక్కడ సమావేశమైనాము. మనమీ సందర్భాన్ని మన గురువర్యులలోనికి మాత్రమే ప్రవేశించేందుకు వినియోగించుకోవాలి. ఇది మన ఆధ్యాత్మిక ఉన్నతికి అవసరమైన ఆహారంగా, బలవర్ధక ఔషధంగా పనిచేస్తుంది. మనం ఏ పదార్థాన్ని చూచినా అందులోనుండి స్మరణభావన స్రవిస్తున్న అనుభూతిని చెందే విధంగా స్మరణము ఉండాలి. మానవులకు ఉండవలసిన నిజమైన స్మరణమంటే ఇదే. అది మన మంచికి మనమాడే క్రీడ.

ఇప్పుడు జీవితపు సాలెగూడులో క్రొత్త అధ్యాయము ప్రారంభమౌతుంది. మన గాఢభక్తి ప్రభావము ప్రతిధ్వనించడం ప్రారంభించి ఆ పరతత్వమే మనలను స్మరిస్తున్నదన్న భావం కలుగుతుంది. అది దైవిక న్యాయము. నీ పాత్రను నీవు పరిపూర్ణంగా పోసిస్తే పరమాత్మ తన పాత్ర పోషణలో వెనుకబడడు. అది ఉన్నతతర ఆధ్యాత్మికతకు ప్రారంభం మాత్రమే. తత్ఫలితంగా మన ఇంద్రియాలన్నీ పరతత్వంలో తమ అర్ధభాగాన్ని పొందడానికి తగిన సంగ్రహ రూపం పొందుతాయి. ఇది నా స్వానుభవము.

అవి సంక్షిప్తరూపాలను పొందినపుడు మన పునరుత్పత్తికి క్రొత్త శక్తిగా తయారౌతాయి. ఇది మనకు సహాయపడే మరొక పరికరము. దీనిని మనము సాధిస్తే మనమింకా మున్ముందు స్థాయిలకు చేరేందుకు తగిన ఆధారాన్ని ఏర్పరచుకున్నట్లే. దైవిక ప్రభావము దానిలో వడియగట్టబడుట మొదలు కాగానే 'నేను' అన్నది తగిన విధంలో మలచుకొంటుంది. దానంతటదే సరిదిద్దబడుతుంది. అప్పుడు ఆధారమే ఒక విదమైన శక్తిగా మారి మన ఔన్నత్యానికి అవసరమైన మూల పదార్థానికి బలము చేకూరుస్తుంది. మనలోపల ఆధారము ఏర్పడినప్పుడు దానితో గూడ నున్న దానిలోని అంశాల ప్రేరణ మన ఉనికిలోని మొత్తం నరాలను ప్రభావితము చేస్తుంది. ఈ అంశాలు వాస్తవ జీవితములోని అంతర్భాగాలు. ఈ రకపు జీవితాన్ని మనము "జీవితములోని జీవితము" అని నిస్సందేహంగా అనవచ్చు. మనమెదుర్కొనే ముఖ్యమైన ఇబ్బంది ఏమిటంటే అవివేక మార్గంలోనికి మళ్ళింపబడిన మన చర్యలే ఆటంకాలవుతాయి. ఆలోచనల ఫలితంగా చర్యలేర్పడతాయి. చర్యల ఫలితంగా ఆలోచనలు ఏర్పడుతాయి

(Actions are the results of thoughts, and thoughts are our own actions). నిజం చెప్పాలంటే మనస్సుకు మనమే తప్పుడు సూచనలు ఇస్తాము. నా యీ అభిప్రాయాన్ని మీరు కాదనవచ్చు. అటువంటి సూచనలను మనము ఎట్లా ఇస్తున్నాము? పరిసరాలు అట్టి భావాలు ఏర్పడడానికి గల పరిస్థితులను సృష్టిస్తాయి. మనము అట్లాంటి పరిసరాల్లోనే సంచరిస్తాము.

అందుకే ప్రకృతి పరంగా ఉండే పరిసరాలు గల పర్వతాలకు వెళ్ళండని ప్రాచీన ఋషులు ప్రజలను ప్రోత్సహించేవారు. ఎంపిక చేయబడిన ప్రదేశము మానవ నివాటవసానికి చాల దూరంగా ఉండేది. ఎవరైనా వ్యక్తి పర్వత శిఖరం చేరితే అక్కడ అతడు ఏ ఆలోచనను గాక, ఒక విధమైన ప్రతిధ్వని మాత్రమే వింటాడు. పరిశుద్ధత అస్థిత్వం నుండే మొదలవుతుంది. అంతర్గత వాతావరణాన్ని సరిగా వినియోగింపకపోవడం ఫలితంగా అన్నిరకాల అపరిశుద్ధతలు, తప్పుడు సూచలను కలిగినవి. ఇవన్నీ ఏకమైనప్పుడు సంకుచిత దృష్టి ఏర్పడుతుంది. ఇది కొన్నిమార్లు దానికదే ఏర్పడుతుంది. మరి కొన్నిమార్లు పరిస్థితుల ప్రాబల్యం వల్ల ఏర్పడతుంది. ఒక విధమైన అయోమయ స్థితి ఏర్పడడానికి ఇది ఒకానొక కారణము. ఇవన్నీ పేరుకు పోయినప్పుడు వేర్వేరు రంగులను సంతరించుకుంటాయి. ఇవన్నీ, ఊర్ధ్వభాగంలోని మనస్సుకు సూచన ఇచ్చే అధోమనస్సును కలుషితము చేస్తాయి. మార్గదర్శకత్వం సరిగా లేకపోతే నీ మనస్సే కంటకమయమౌతుంది. అప్పుడు మనం, పరతత్వానికి వ్యతిరేకదిశలో చరిస్తుంటాము. కాబట్టి అనుకూల స్పందనములను కలిగేట్లు చేయుము.

సృష్టి ఏర్పడకముందు సమస్థితి ఉండేది. ఈ సమస్థితి చెడిన ఫలితంగానే మనము ఉద్భవించినాము. ఈ అంశాన్ని వేదాంతపరంగా నేను విశదీకరించదలచుకోలేదు. సృష్టి చేయవలెననే భావన కేంద్రపు దరిదాపుల్లో కదలింది. శక్తి బయటకు ప్రవహించడం మొదలయింది. ఆ శక్తి ఏది? అదే నిర్మలమైన, నిరాడంబరమైన ప్రథమ మనస్సు. అదే మన రూపాన్ని, ఆకారాన్నీ నిర్మించింది. అది తనతో తెచ్చిన పరిశుద్ధత ఇంకనూ పోషింపబడుతూనే ఉంది. దానికి మనము తప్పుడు సలహాలనిచ్చినప్పుడు, పరిపూర్ణంగా నిర్మలంగా ఉన్న ఆ మనస్సు, తనలోని నిరంతర నిర్మలత్వాన్ని కాపాడుకునేందుకు వీటిని బయటకు త్రోసివేస్తుంది. అదే ఆలోచనలు ఏర్పడడానికి కారణం. వాస్తవంలో అది లోపల ఉండే వాటిని బయటకు త్రోసివేస్తుంది. అవి ఏదోయొక ఉపరితలాన్ని ఆవరించి ఉన్న పొగమంచువలె కనబడతాయి. వాటినే మనము ఆలోచలను అంటాము. వాటిపట్ల మనము శ్రద్ధ చూపితే వాటి శక్తి పెరుగుతుంది. మీరెవరైనా దివ్యభావనలు పెంపొందించుకుంటే మీ మనస్సు, అది వాస్తవంగా ఆ అసలైన నాళము నుండి ఉద్భవించింది కాబట్టి, దాని నిజస్వరూపము అదే కాబట్టి, ఈ దివ్యభావనలను గ్రహిస్తుందే కాని బహిష్కరించదు.

వ్యక్తి తన జీవిత సమస్యను సులభంగా పరిష్కరించుకోదలిస్తే, తన మనస్సుకు మంచి సూచనలనే అందివ్వాలి. ఈ విధంగా చేయగల స్థితి వ్యక్తికి సాధనవల్ల అతడు తననుతాను సక్రమంగా మలుచుకోవడం వలన కలుగుతుంది. దివ్యమైన తనస్వస్థితిలో ఉండి పోవడం చాల సులభము. ప్రగతికి ఇదే నిశ్చయమైన దారి. సత్‌తత్వ ప్రాప్తి పట్ల ఏమాత్రము మొగ్గు కలిగి ఉన్నా, అదే నీ భవిష్యత్తును తీర్చి దిద్దుతుంది.

మన భారతదేశంలో అనేక మార్గాలు ప్రచారంలో ఉన్నాయి. అవి బహుశ సరియైనవి కూడ కావచ్చు. అయితే, సరియైనదంటే ఏది? నిన్ను కలతలేని స్థితిలోఉంచే విధానమే సరియైనది. అన్ని స్పందనములు దివ్యములు కావాలి. అది ఏవిధంగా సంభవిస్తుంది? భారము తొలగిపోయినప్పుడు తెరమరుగున ఉన్నదేదో అది మనసువైపు ఆవిష్కరింపబడుతుంది. మనమనుకొన్న ఫలితాన్ని ఈ విధానాలలో ఏది లభింపచేస్తే, అదే సరియైనది, సవ్యమైనది, సహజమైనది. ఈ స్థితిని నీలో కలిగించుకునేందుకు ప్రచారంలో ఉన్న మార్గాలలో ఏది తగి ఉన్నదో నీకు నీవే ఎంచుకొనవలసి ఉంటుంది. నీవు నిజంగా దానికొరకే ప్రయత్నిస్తూ ఉండి, నీకు సరియైన గురువర్యులు లభించి ఉంటే, విషయమంతా చాల సులువౌతుంది. ఎంతో శ్రమ, కాలము వ్యర్థము కాకుండపోతుంది. "ఆ విధమైన గురువర్యులు ఎట్లా లభిస్తారు?" అని ప్రజలు ప్రశ్నించవచ్చు. దానికి సమాధానంగా "పై చెప్పిన దానిని తప్పక అనుసరించే శిష్యుని పొందడం ఎలా?" అని నేను అనవచ్చు. మహాసముద్రంలో ఈదడానికి ఈతగాళ్ళు, ఈత రెండూ అవసరము. ఈత నేర్వడం ఈతగాని వంతుకాగా, ఈత నేర్పడం గురువర్యుల వంతు. మనము ఆయన చెప్పినవి త్రికరణశుద్ధిగా మనలను తీసుకోపోగల గురువర్యులు లభిస్తారు. అయితే, నిజం చెప్పాలంటే తన దివ్యశక్తులతో మనలను ప్రోత్సహించునట్టి గురువర్యులే ఇప్పుడు కావలసినది. ఉన్నతస్థాయిలలో కొన్ని స్థితులున్నవి. వాటిని మనం అధిగమించవలసి ఉన్నది. నిజానికి మనము కొంతదూరం పోగలము. ఆ తర్వాత అభ్యాసిశక్తి సూక్ష్మశక్తిని అందుకోలేదు. అతనిని ఎవరైనా ఒక త్రోపు తోస్తే తప్ప ఆ స్థాయిని దాటిపోవడం చాల కష్టం. గురువర్యులు చేసేపని అదే.

పరమాత్మలో లేనిది, తనలో మాత్రమే ఉన్న దానితో వాదనకుదిగే వారిని ఎందరినో నేను కలవడం తటస్థించింది. కొందరు తాము తమ అంతరాత్మనే గురువుగా చేసుకున్నామని అంటారు. అయితే వారు తమ అంతరాత్మను గాక, కచ్చితంగా తమ అహంకారాన్నే గురువుగా చేసుకున్నారని నా నమ్మకము. శాస్త్రరీత్యా అంతరాత్మ అనబడేది మనస్సు, చిత్తము, బుద్ధి, అహంకారాలనే నాల్గింటి సమ్మేళనము. ఈ నాలుగు పరిపూర్ణంగా శుద్ధమైనప్పుడే అంతరాత్మ సరియైన సూచనలనిస్తుంది.

ఇవి పరిశుద్ధమైనపుడే ఉన్నత శక్తులు లభిస్తాయి. అదే సమయంలో పరిశుద్ధత అంతటా వ్యాపించడం మొదలవుతుంది. సరియైన మార్గాన్ని అనుసరించకపోతే, సరియైన ఫలితాలనివ్వదని ఇక్కడ స్పష్టం చేస్తున్నాను. మనమందరము సాక్షాత్కారాన్ని కోరుతాము. కాని మనలో కావలసిన తపనలేదు. మనమందరము మన మొదటిస్థాయికి చేరాలనీ, ఈ భూలోకపు, ఆ దివ్యలోకపు జీవితాల అంతరాన్ని పరిశీలించగలగాలని ప్రార్థిస్తున్నాను.

# 22. అనంతత్వ జ్యోతి

(దీ.24-10-1974న హైదరాబాదులో తమ రాబోవు 75వ జయంతుత్సవముల సందర్భంగా ఇచ్చిన సందేశము)

రాబోయే నా 75వ జయంతిని పురస్కరించుకొని మీరు చూపిస్తున్న ఉత్సాహాన్ని నేను అభినందిస్తున్నాను. నా దృష్టి పథంలో ఈ అంశాన్నుంచుకొని నన్ను నేను గమనిస్తే ఇటువంటి ఉత్సవానికి నేను తగినవాణ్ణేనా అనే ప్రశ్న ఉదయిస్తుంది. నా అంతరంగంలోని భావాలకు అనుగుణంగా పనిచేస్తున్న అభ్యాసుల శక్తే దీనికి కారణమని సమాధానం వస్తుంది. అందువల్ల దీనికి సంబంధించిన కీర్తి ప్రతిష్ఠలన్నీ మీవే. నేను నా గురువర్యుల చేతిలోని ఒక ఆటవస్తువును మాత్రమే.

నేను అనారోగ్యంతో ఉండేవాడిని. ఇప్పటికీ ఇంకా బలహీనంగా ఉన్నాను. అయితే నేను నా గురువర్యులను స్మరిస్తే ఆ మహాత్ముని ప్రభావం నాలో ప్రవేశించి అన్ని శక్తులతో కూడిన యువనికిగా నన్ను మార్చివేస్తుంది. అనారోగ్యంతో బాధపడేవారందరూ రోగాన్ని అసహ్యించుకుంటారు. కాని మౌలికంగా అది ఒక శుద్ధికార్యము. అపవిత్ర "సంస్కారాలు" "భోగము"నకు వచ్చినప్పుడు సృష్టికర్త దృష్టి మనపై పడుతుంది. అది చిన్న ఊయలవలె మనకు పనిచేసి పోషకమౌతుంది. మంచి "సంస్కారాలు" భోగానికి వచ్చినప్పుడు కూడ దైవదృష్టి మనపై బడుతుంది. అంటే మనలోని అపవిత్ర సంస్కారాలను తనతోబాటు తీసుకొని పోయే అనారోగ్యము వల్ల కూడ మనకు మంచే జరుగుతుందని అర్థము. ఇదంతా ఆయన (పరతత్వం) మనపై అభిమానంతో ఆడే ఆట. ప్రేమ, ద్వేషాలు రెండూ ఒకటేనని నేనంటే ఆశ్చర్యపోకండి. ప్రేమ అనుకూలభావన అవుతే ద్వేషం ప్రతికూల భావన. అత్యంత దయాదాక్షిణ్యాలుగల పరమాత్మను స్మరించడానికి ప్రజలు ఇష్టపడక పోవడం చాల వింతగా వుంది. ఆయన చర్యలన్నీమనకు చాల మంచి చేసేవి. భగవత్స్మరణము లాభం లేని వ్యాపారమని ప్రజలనుకుంటారు కాని అతిపెద్ద కర్మాగారము నుండి లభించగలిగే దానికంటే దీనినుండే లాభమెక్కువని నేనంటాను.

ఎవరైనా "విశ్వప్రేమ"ను గురించి మాట్లాడినప్పుడు నేను చాల సంతోషపడతాను. ఈ కాలపు పెద్దలు, సాధారణంగా, విశ్వప్రేమను ప్రచారం చేస్తారేగానీ, దానిని ఎట్లా ఏర్పరచవచ్చో దానికి మార్గాలను అన్వేషించరు. ద్వేషాన్ని తొలగించు, అంతే, విశ్వప్రేమ అక్కడే వుంది అంటాను నేను. అబద్ధాలు పలికే వ్యక్తి తన అలవాటును తొలగించుకోవాలనుకుంటే, అతను నిజం

చెప్పడం మొదలు పెట్టాలి. ఎందుకంటే, అట్లా అయితే సహజపద్ధతిలో ఏకాగ్రత ఆధారంగా అతనికి ఒకవిధమైన మంచి నడత అలవడుతుంది. అట్లాగాక, అబద్ధమనే దానిని తొలగించుకోవాలని ప్రయత్నించి, దానిపై శ్రద్ధ కనబరిస్తే, దానిపై ఏకాగ్రత చూపినట్లుయి, దానికి శక్తినిచ్చినట్లవుతుంది. ఫలితంగా అది మరింత బలపడుతుంది. విశ్వప్రేమ విషయము కూడ అంతే. పట్టుగూడులో పట్టుపురుగున్నట్లు అది అందులోనే ఉండిపోతుంది.

ఈ మధ్య నాకు వచ్చిన అనారోగ్య సందర్భంగా సంభవించిన ఒక సంఘటన మీకు తెలియజేస్తాను. నేను చిత్తభ్రమ స్థితిలో (Delirium) ఉన్నప్పుడు ఒక అభ్యాసికి అమోఘమైన శక్తితో ప్రాణాహుతి ప్రసారం కచ్చితంగా అతని అంతరంగ స్థితిని గమనిస్తూ చేసి, కొన్ని నిమిషాల వ్యవధిలోనే అతడు యాభైయెనిమిది బిందువులు అధిగమించేటట్లు చేసినాను. సంస్థలోని ఇతర సోదరీ సోదరులకు కూడ నేను ప్రాణాహుతి ప్రసారము చేస్తూనే ఉండినాను. కొందరభ్యాసులడిగిన ప్రశ్నలకు కూడ సమాధానమిచ్చినాను. నాకు స్వస్థత చేకూరిన తర్వాత అవి వారికి చాల సంతృప్తికరంగా ఉండినవని వారు నాతో అన్నారు. ఇది పెద్ద కష్టమైన విషయమేమీ కాదు. నీ అంతరంగ చేతనము అది క్రమశిక్షణకు లోబడేటట్లుగా శుద్ధిపరచు, నీకు కావలసింది అక్కడే లభిస్తుంది. అదే సమయంలో మన సంస్థ కార్యకలాపాలు ఏవిధంగాను నష్టపడవు. కాబట్టి మన సాధనాపద్ధతి ఎంత సార్థకమైనదో, అమోఘమైనదో గమనించు.

మన గురువర్యుల బోధనలను ప్రతిహృదయానికి అందించడం ద్వారా మన సంస్థ చేసే సేవలోని పరమార్థం మానవత్వాన్ని వినాశనం నుండి కాపాడడమే. ఈనాడు మానవజాతి, 'భౌతికత' అనే అజ్ఞానాంధకారంలో తారాడుతున్నది. భయము, దురాశ, అసూయలు మానవుని తమ చేజిక్కించుకున్నాయి. విలువల గురించిన భావనలు నశించిపోయినవి. మీదపడి ఉన్న ఈ అంధకారం నుండి తొలగించి, నిజముగా మానవుని పునరుద్ధరించగలది ఆధ్యాత్మిక దీపమే. భగవంతుడు మననుండి ఆశించిన స్థాయికి మనము ప్రగతి సాధించే విధంగా మనలో ప్రతియొక్కరి హృదయంలోను ఆ అనంతత్వ జ్యోతి ప్రకాశించుగాక !

# 23. విశ్వ ప్రేమ

(1976 జనవరిలో షాజహాన్‌పూర్‌లోని ఆశ్రమ భవన
ప్రారంభ సమయంలో ఇచ్చిన సందేశము)

సంఘటనలు వచ్చేవి వస్తుంటాయి, పోతుంటాయి. కాని మనము మాత్రం మార్పు లేకుండా అట్లే ఉంటాము. మనలను మనము నిశితంగా పరిశోధన చేసుకుంటే అందులో మార్పులేని స్థితి ఉందని గమనిస్తాము. అయితే, మనకు ఇష్టమున్నా లేకపోయినా, మార్పుచెందే దానితో కూడ మనము సంబంధం ఉంది. ఇవి రెండూ కూడ మనలను బంధనాలలో ఉంచేవే. ప్రశాంత జీవితం గడపాలనుకుంటే మనం వీటికన్నింటికి అతీతంగా ఎదుగవలసివుంది. మన సంస్థలోని పద్ధతిని శ్రద్ధతో సాధన చేస్తే, ఈ ఫలితాలను అది తప్పక అందిస్తుంది.

తాము ఆలోచనలు, ఉద్రేకాల రొంపిలోనుండి బయటపడడానికి అతికష్టము మీద ప్రయత్నిస్తున్నామని అనేకమంది సహచరులు నాకు వ్రాస్తూ ఉంటారు. అది అభ్యాసి విధి అనడంలో సందేహం లేదు. ఆ స్థితికి అతడు మేల్కొంటే, దానికి తగిన విధంగా పని మొదలౌతుంది.

నేత పనివాని వివేకంతో వస్త్రము తయారౌతుంది. అతని చేతులు పనిచేస్తూ ఉంటాయి, కాని అతడు తనచేతి కదలికల ద్వారా తన వివేకాన్ని ప్రదర్శిస్తాడు. తెలివికి దాని కేంద్రముం టుంది. అయితే అది చేతులద్వారా కూడ పనిచేస్తుంది. అదేవిధంగా, బాగుపడాలనే భావన ఉందంటే, అది ప్రగతికి కచ్చితమైన సూచన.

ప్రతి పుష్పము తనకు తగు ప్రమాణంలో తాను పెరిగి వికసించడానికి తగినట్లుగా పరమాత్మ ఈ విశ్వాన్ని సృష్టించాడు. కానీ కాలవైపరీత్యములు ఆ పరమాత్మ ప్రయోజకత్వమును మరచిపోయేట్లు చేసినవి. అందువల్ల కొందరు జీవితాన్ని భోగాల అనుభవానికే అనుకుంటే, మరికొందరు జీవితం విసుగ్గా ఉందనుకుంటారు. మరయితే జీవితమంటే ఏమిటి? అనేది ప్రశ్న. మనము జీవించి ఉన్నంత కాలం శాశ్వతంగా ఉండవలసిన ఉనికి స్థితి అది. ఈ స్థితి ఆ పరతత్వంతో పరిపూర్ణంగా సంబంధం కలిగి యుండి, అడుగడుగునా ఆ పరతత్వపు సువాసనను ఆఘ్రాణిస్తూ ఉండాలి.

పిల్లలు ఒకసారి తల్లితో, మరొకసారి తండ్రితో, ఎక్కువ అనురాగంతో అనుబంధింప బడినట్లు ప్రవర్తిస్తారు. అది వారి నైజము. దీనికంతా మూలమైన ప్రేమ అక్కడ ఉన్నది కాబట్టి

ఆ అనుబంధం కూడా ఉంది. అయితే అందులో అన్ని విభాగాలు ఉండకపోవచ్చు.

జలపక్షి, బాతువలె మనం జీవించాలి. అవి నీటి నుండి బయటపడగానే వాటి రెక్కలకు తడి ఉండదు. అదేవిధంగా మనం కూడా మన తల్లిదండ్రులను, కుటుంబంలోని ఇతరులను వ్యామోహము లేనివిధంగా ప్రేమించాలి. ఈ భావాన్ని ఆధ్యాత్మికంగా వ్యక్తంచేయడమంటే ఇట్లే.

అంత గాఢమైన మాతృప్రేమ ఆ వ్యక్తి తన యాత్రలో ఒక అడుగు ముందుకు వేసినాడనే విషయాన్ని మొదటిసారిగా వ్యక్తం చేస్తుంది. ప్రేమాధిక్యతకు అది గుర్తు. అన్నివైపులకు చలించే ఆధారం నుండి అతడిప్పుడు ప్రేమను గురించి నేర్చుకొనడం ప్రారంభమైంది. భిన్నత్వపు మనఃస్థితిని తొలగిస్తే చాలు, వ్యక్తి ప్రేమ అందరికి సమానంగా అందింపబడుతున్న అనుభూతిని పొందుతాడు, అప్పుడదే విశ్వప్రేమ అవుతుంది. అట్టి పరిస్థితుల్లో తండ్రి, తల్లి, భార్య, భర్త మొదలైన వారికందరికి సమాన భాగం లభిస్తుంది. ప్రేమ చెడ్డది కాదు. దాని సక్రమ వినియోగము మనకు తెలియదు. మన సాధనా విధానము దానినే మనకు కాలక్రమేణ నేర్పుతుంది.

ప్రతి జీవి ఆనందంగా, ప్రశాంతంగా ఉండాలనేదే ప్రకృతిలో దాగియున్న తత్వము. మనము దానికి వ్యతిరేకంగా జీవిస్తే మనము, ఆ పరతత్వపు ఆజ్ఞను కాదన్నట్లే. మనమంతా కుటుంబీకులమే, అయితే ఇతరులపట్ల మన ప్రవర్తనలో సమత కలిగి ఉండాలి. అంతేగాక, డబ్బు ప్రతిచోట మనకు అవసరమే. మన పోషణకు, హాయిగా జీవించడానికి దానిని సంపాదించడం మనవిధి. అయితే డబ్బును, దానికొరకు మాత్రమే ప్రేమించడం ఒక జబ్బు, నీచమైన కోరిక అని 'డన్స్' అన్నాడు.

జీవితావసరాలు చాల తక్కువగా ఉండాలి. "నిరాడంబరంగా జీవించు, అమోఘంగా ఆలోచించు", అనేది ఒక ఆంగ్లసూక్తి. బంధములో బంధ రాహిత్యమే మనకు కావలసినది. అన్ని పరిస్థితులలోను హాయిగా ఉండేవాడే అత్యంత సుఖజీవి.

నేను అందరి సేవకోసమే ఉన్నాను. అందరు తమతమ కష్టాలను అధిగమించి, ఆధ్యాత్మికతకై జీవించవలసిన విధంగా సుఖమయ జీవితాన్ని గడపాలని అర్థిస్తున్నాను. నేను భారతదేశానికి మాత్రమే పరిమితము కాను, మొత్తము విశ్వానికి చెందిన వాడిని. కాబట్టి అనంతత్వ ప్రేమలో దాగి ఉన్న ఆ ఆనందాన్ని (అందాన్ని) అందరూ రుచి చూడాలనేదే నా ఆకాంక్ష.

# 24. సత్ తత్వాన్వేషణ

(ది.12-09-1976న బెంగుళూరు యోగాశ్రమ భవన ప్రారంభోత్సవ
సమయంలో ఇచ్చిన సందేశము)

బెంగుళూరు కేంద్రంలో నూతన ఆశ్రమ భవన ప్రారంభోత్సవ శుభ సందర్భం వచ్చినందుకు చాల సంతోషిస్తున్నాను. అనారోగ్యం వల్లనూ, ఇక్కడ పని ఒత్తిడి వల్లనూ మీ అందరినీ వ్యక్తిగతంగా కలుసుకునే అవకాశాన్ని యీ శుభ సమయమందు వినియోగించుకోలేక పోయినందుకు చింతిస్తున్నాను.

మానవ జీవన విలువలను సంరక్షించుకొనుటకు, ఎదుటివారు మనకై వారి బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించారాలేదా అనే పట్టింపు లేకుండా, మానవాభ్యుదయమునకు మనవిధి మనం నిర్వర్తించాలి. కొద్దిగా కష్టనష్టాలుండా త్యాగాలు చేయవలసివచ్చినా, యిదియే మనము సాధించవలసిన మహోన్నతమైన నీతి అనేది నా నమ్మకం. ఇదే సదాచారములోని ఒక భాగము. మనం ఒక పని చేసేటప్పుడు అడ్డంకులు రావడం చాల సహజం. అవి క్రమంగా తొలగిపోతాయి. భగవంతుణ్ణి అన్వేషించే మంచివారు అన్నిచోట్లా వుంటారు. మనం మన సేవలను సక్రమంగా చేస్తే విజయం తప్పక పొందుతాము. భగవంతుణ్ణి అన్వేషించే మంచివారు అన్నిచోట్లా వుంటారు. మనం మనసేవలను సక్రమంగా చేస్తే విజయం తప్పక పొందుతాము. దివ్యత్వము క్షణమైన సరే పొందినవారు ధన్యులు. 'సహజమార్గం'లో చాల ఉన్నతమైన విషయాలు కొన్ని సమయాల్లో క్రింది దశలలోనే పొందగలుగుతారు. భగవద్భక్తితో ప్రకృతి ప్రతియొక్కరిని దహించి వేయుచున్నది. కొద్దిపాటి తేడాతో శీతోష్ణములు చాలవరకు ఒకేలాంటివి. దాని క్రింది భాగము వేడి కలిగియుంటుంది. భారములేని బరువు దానిమీద యున్నది. రెంటినీ సహజముగా చేయగలిగితే అదే నిజమైన సత్‌తత్వ ప్రాప్తి, కాబట్టి బరువు మాత్రము తీస్తే ఆ సాంద్రత కనిపించదు. గాలి ఐహికరమైన వాటిని తాకినపుడు దాని సాంద్రత పెరుగుతుంది. ఆ తాకటం లేనప్పుడు అన్నిటిమీద సమానత కలుగుతుంది. ప్రకృతి రెండు చేతులను ఒకేసారికాక, ఒక చేతినే తెరుస్తుంది. ఒక చోట చల్లదనం ఉన్నప్పుడు దాని చెంతనే వేడిమికూడ వుంటుంది. వీటన్నిటిని తనకు తగినట్లుగా మలచుకొనడానికి మనిషి జ్ఞానమే దీనికి ఉపయోగపడుతుంది.ఈ జీవనకాల చక్రంలో మనం ఒక భాగం. ఇంకో విధంగా చెప్పాలంటే, మనమంతా ప్రకృతిలో ఒక భాగం. ప్రకృతిలో యిమడడానికి ప్రయత్నించాలి తప్ప దాన్ని అణగతొక్కటానికి కాదు. అన్నీ, ప్రకృతికి సహకరించేలాగ మార్చుకోగలిగితే, సమానత్వం, సమతుల్యం పెంపొందుతుంది.

అదే మనం కోరుకొనేది కూడా. ఈ సమతుల్యం సాధనవల్ల అభివృద్ధి చెందుతుంది.

ఒక ఆలోచన వున్నట్లయితే క్రియ దాని ఫలితం అవుతుంది. ఒక భావం వున్నట్లయితే పదాలుంటాయి. వీటన్నిటిని క్షీణింపజేస్తే, సత్యోదయము ప్రారంభమై ఫలపుష్పాదులనిచ్చే పూర్తిస్థాయికి పెరుగుతుంది. భగవంతునిలో ఐక్యమవుట అతిముఖ్యమైనది. అది తనగురించి తనకి ఏమియు తెలియని నిరాడంబరమైన, సాధారణమైన వ్యక్తికి సిద్ధిస్తుంది. సత్ తత్వాన్వేషణ మనిషిని సక్రమమైన మార్గంలో పెడుతుంది. అది అతని నిద్రాణమైన స్థితినుండి కొత్త జీవితాన్ని యిచ్చి మనిషి చేరుకోగల ఉన్నత స్థితులకు సిద్ధము చేస్తుంది. ఇది మాత్రమేకాక మొత్తము జీవకోటి అభివృద్ధిలో అన్ని అడ్డంకులనూ ఛేదించి, రూపురేఖలను మార్చివేస్తుంది. సత్‌తత్వప్రాప్తికి నిజమైన అర్థం "మరణానికే మరణం" "అంతానికే అంతం". ఈ స్థితిలో ఎవరైతే పూర్తిగా నిమగ్నమౌతారో వారికి మార్గము యిప్పుడు స్పష్టము.

మీరందరేకాక, సకల జీవకోటి తమవంతు గట్టి ప్రయత్నంతో రుచిలేని రుచి అయిన సత్‌తత్వమును, అతి తొందరగా పొందగలరని, ఆ శక్తిని మీకు ప్రసాదించమని భగవంతుని ప్రార్థిస్తున్నాను.

# 25. పరతత్వం పొందడానికి సులభమార్గము

(ది.30-04-1977న మదురైలో తమ 78వ జయంతుత్సవముల సందర్భంగా ఇచ్చిన సందేశము)

ప్రియమైన సోదర సోదరీమణులారా !

నాకు ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొనే అలవాటు లేదు. జన్మదిన వేడుకలు చేసుకునే అలవాటు అసలే లేదు. కానీ, మదురై కేంద్రంలో, ఈ చుట్టుపక్కల్లో ఉన్న అందరి పట్టుదల వల్ల మీ అందరి ప్రేమాభినామాలు నన్ను ఈ సందర్భంగా మీ మధ్యకు రావటానికి దోహదం చేసాయి. మన ప్రధాన కార్యదర్శి శ్రీ పార్థసారధి రాజగోపాలాచారి తనవంతు పాత్ర నిర్వహించి నన్ను ఈ కార్యక్రమానికి రప్పించారు.

ఇక్కడ ఆసీనులైన సోదర సోదరీమణులందరూ ఏదో విధంగా, భగవంతుని లేదా పరతత్వాన్ని పొందాలని ప్రగాఢమైన కోరిక కలిగి ఉన్నారు. ఎవరి మనసులో ఈ సత్‌తత్వ కాంక్ష గట్టిగా, మనస్ఫూర్తిగా ఉంటుందో వారికి తప్పక సత్‌తత్వ మార్గమునకు సాధనములు వాటంతట అవే అలవడతాయి. 'మనసుంటే మార్గముంటుంది' అన్నట్లుగా, ఆ కాంక్షే మిమ్మల్ని ఆ పరతత్వము దగ్గరకు చేరుస్తుంది. ఎప్పుడైతే భావము హద్దులు దాటుతుందో అది ఆలోచనవుతుంది. ఆ ఆలోచన దృఢమైనప్పుడు సత్‌తత్వాన్వేషణ క్రియారూపం దాల్చి పెంపొందుతుంది. ఎవ్వరైతే అట్టడుగు వరకు వెళ్ళగలుగుతారో వారు ముత్యములు పొందగలుగుతారు. అలాగే సత్‌తత్వ ప్రాప్తి కొరకు ప్రజ్వలించిన కోరిక మీ గమ్యానికి దగ్గర చేస్తుంది. ఫలసిద్ధి పొందాలనుకునేవారు, దృఢ నమ్మకముతో మంచి నీతి మార్గము అలవరచుకొని, తమను తాము సంసిద్ధము చేసుకోవాలి.

యోగ మార్గమునకు మంచి నడత, యుక్తమైన స్వభావములే పునాదుల వంటివి. అందుకే మా గురువర్యులు మహాత్మ శ్రీ రామచంద్రజీ మహారాజ్ గారు ఈ విషయాన్ని గట్టిగా నమ్మి, నియమనిష్ఠలతో గూడిన స్వభావమును అలవరచుకొనమని దృఢంగా చెప్పారు. జీవన యాత్రను సద్గుణములతో సాగించాలని ఉద్బోధించారు. అవిలేని వ్యక్తి, అన్నింటికంటే ఆవలనున్న, అతి విలువైన, పొందదగిన ఆధ్యాత్మికతను పొందుటకు అనర్హుడవుతాడు. విమోచనము, మనకు అత్యంత ప్రియమైనది. కాని దాని నిర్వచనము కూడ మనకు తెలియదు. ఓర్పు వ్రేళ్ళయితే, పుష్పాలు మన ఫల ప్రయోజనాలు. ఇవి ప్రతి అభ్యాసీ కష్టించి సాధించాలి.

చాలామంది అభ్యాసీలు వారి కష్టనష్టాల గురించి వ్రాస్తూ, నన్ను వాటినుంచి దూరం చేయమని వ్రాస్తుంటారు. వారికే కాకుండా మీ అందరికీ నే చెప్పేదేమిటంటే కష్టాలు ఒక నిశ్శబ్దస్థితిని జ్ఞప్తికి తెస్తాయి. మనం అసౌకర్య స్థితిలో సుఖాన్ని పొందుతాం. మనం ఒక స్థితిలో ఉన్నప్పుడు దాని వ్యతిరేక స్థితిని జ్ఞప్తికి తెచ్చుకొంటాం. దాన్ని పొందటం కోసం ఆరాటం పడతాం. ఈ విధంగా మనం ఊరట చెంది శాంతిస్తాం. నిజం చెప్పాలంటే, కష్టాలు ప్రకృతి సిద్ధంగా మన మంచికే జరిగే పనులు. నేను దైవానికి ఉపయోగించిన 'శూన్యత్వము' అనే పదానికి కొంతమంది తారుమారు భావాలకు గురయ్యారు. కాని 'శూన్యత' అనే పదం మాత్రమే కాక 'తత్వ'కూడా ఉందని మరిచారు. ఎప్పుడైతే సూక్ష్మమైన వాటి గురించి మాట్లాడతామో అక్కడ వ్యతిరేక భావం స్ఫురిస్తుంది. మనం 'అవును' అన్నప్పుడు అక్కడ 'కాదు' అనునది స్ఫురిస్తుంది. 'లేదు' అన్నప్పుడు 'లేని' తత్వము - 'శూన్యత' గోచరిస్తుంది. 'ఉన్నది', 'లేదు' అన్నటువంటిది కాదుదైవం. రెంటికీ అతీతమైనదే భగవంతుడు. 'ఉన్న'తత్వము కాదు 'లేని'తత్వమే 'శూన్యత్వము' అదేదైవానికి పర్యాయపదం. పరతత్వమే మన అంతిమ లక్ష్యము. భగవంతుడు ఏ స్థితిలోనైనా ఉండనీయండి, అది మనకు అక్కరలేని విషయము. మనకు సంబంధించినంత వరకు 'ఉన్నది', 'లేదు'లు మాత్రమే. కాని వీటిని ఎప్పుడు, ఎక్కడ, ఎలా నిర్వచించాలో తెలియదు. ఇది అనుభవ మూలకంగా వస్తుంది. ఆ అనుభవం ప్రయోగ మూలకంగా వస్తుంది.

కొద్దిమంది నాకు వారి వత్తిడుల గురించి ఫిర్యాదులు చేస్తుంటారు. వాటిని తొలగించమని కోరుతుంటారు. వత్తిడులు ఎక్కువైనప్పుడు, అంతకుముందున్న ఆ వత్తిడిలేని స్థితి తొలగిపోతుంది. ఆ వత్తిడిలేని స్థితిలో వత్తిడి బలంగా లేనప్పటికి కొద్ది మాత్రం దాని తాలూకు బరువు వుంటుంది. ఆ రెండు లేనప్పుడు, ఒక నిశ్శబ్ద స్థితి, కొద్దిగా మాత్రం శూన్యము ఉంటుంది. పూర్తి శూన్యత ఉండదు. కాని మనకి వీలయినంతగా శూన్యత కావాలి. ఆ సంపూర్ణ శూన్యత భగవంతుడు మాత్రమే. మనం దైవత్వంలో ఐక్యం అవుతున్నప్పుడు ఆ శూన్యస్థితి తనంతటతానే కరిగిపోతుంది. అది అతి దగ్గరవుతుంది. నిశ్శబ్దత, ఆధ్యాత్మికతలోని ఒక భాగంలోని కొన్ని రేణువులు మాత్రమే. అదే సత్‌తత్వము కాదు. విశదీకరించాలంటే నిశ్శబ్దత దైవానికి అతి దగ్గరలోనిది.

నిశ్శబ్దతకు ఆధారమైన ఆసనము నిశ్శబ్దమే. మనకంటికి కనిపించని కీటకాలున్నట్లే, నిశ్శబ్దతను మనం చూడలేకున్నా, నిరంతర అభ్యాసం వల్ల ఈ 'సహజమార్గము'లో చూడ గలుగుతాము. ప్రార్థన ఈ విషయంలో చాలా ముఖ్యమైనది. ప్రార్థనతో బయటి శబ్దాలనుంచి బయటి నిశ్శబ్దతకు, క్షాళనతో బయటి నిశ్శబ్దం నుంచి లోపలి నిశ్శబ్దానికి చేరెదము. దైవముతో

స్పర్శ పొందుటవలన, ప్రార్థనలో మన లక్ష్యమునకు దగ్గరగా చేరెదము. ఒక క్రమమైన మార్గములో చేస్తే మనం దీనితో అమృతాన్ని పొందగలం. సక్రమంగా చేయకపోతే హానికరమైనదే. సక్రమమైన మార్గము, పద్ధతులు మన 'సహజమార్గము'లో స్పష్టంగా తెలుపబడి ఉన్నవి.

దేశ విదేశాలనుండి నా సహచరులు యిచ్చే ఫిర్యాదుల వల్ల, ముగించే ముందు, మీ అందరికి ధ్యానంలో వచ్చే ఆలోచనల గురించి చెప్పాలనుకుంటున్నాను. ధ్యానము చేసేటప్పుడు వచ్చే ఆలోచనలను వీధిలో ఆడే పిల్లల వంటివి. మీ దృష్టి ఆలోచనలపై లేనప్పుడు, అవి మీ పై ఏ మాత్రం వాటి ప్రభావాన్ని చూపవు. అసలు అవి మనసును కలవరపరచవు. మనమే ఆ అనుభూతి పొందుతాం. ఆ ఆలోచనల పైకి దృష్టి కేంద్రీకరించకుంటే సరిపోతుంది. పిలవని పేరంటానికి వచ్చిన అతిథులని వదిలేస్తే సరి. అవి పడటానికి లేచే కెరటాలవంటివి. అవి తమ స్థానంలోంచి వైదొలగి, ఆ స్థానాన్ని, దైవత్వం కోసం వదలి వెళ్ళిపోతాయి. ఎప్పుడైతే ధ్యానంలో పటుత్వం, తెరలను ఛేదిస్తుందో అప్పుడు, అక్కడ కొద్దిపాటి శూన్యత ఈ ఆలోచనలను ఆకర్షిస్తుంది. ఆలోచన ఎగసినపుడు, ఏకాగ్రత లోపిస్తుంది. ఆలోచనలు మిమ్మల్ని ఆటంకపరచలేవు. మీరే వాటిని ఆటంకపరచగలరు. కొందరు భయాన్ని, కొందరు ప్రేమను వ్యక్తపరుస్తున్నారు. ప్రేమా, భయాలు రెండూ ఒకే కేంద్రాన్ని కలిగి ఉన్నాయి. మనం లోకానికి దగ్గరగా వెళ్ళినప్పుడు భయాన్ని కలిగించేవి వాటి రూపాలను ప్రదర్శిస్తాయి. మనం దివ్యత్వం వైపు వెళ్ళినప్పుడు, దివ్యత్వం దివ్యత్వాన్ని ప్రసరిస్తుంది. ఈ రెండూ అత్యంత అతిశయమైనవి ఎందుకంటే ఈ రెండూ ఒకే కేంద్రానికి చెందినవి. కానని మనం తెలివిగా మంచిదానిని తీసుకొని చెడును వదలివేయాలి. ఇది అంతా మన మంచి కొరకే.

నిజమైన ప్రేమ, ప్రకృతి సిద్ధమైన దివ్యత్వముతో కూడిన సచ్ఛమైన మనస్సులో పెరుగుతుంది. మనని మనం పూర్తిగా మరువగలిగిన స్థితిలోనే, అవ్యక్తమైన దానిని తెలుసుకోగలుగుతాము. కొన్ని సమయాల్లో ఇవన్నీ వచ్చివెళ్ళిపోతూ ఉంటాయి. వాటిని గ్రహించి మనయందు స్థిరపరచుకోవాలి. ఇక్కడి నుంచి మీరు పై స్థానానికి పయనిస్తారు. ఇక్కడ ఉన్నవారే కాక సర్వమానవులు నిజమైన జీవిత పరమార్థాన్ని పొందాలన్నదే నా జీవితాశయము. ఇదే నేను ఎప్పుడూ చెబుతున్న 'జీవితంలో జీవనము'. మీలో చాలామంది ఈ పూతోటలోని అందాలను వీక్షించలేదు, వాటి సువాసనలను గ్రోలలేదు. వాటిని పూర్తిగా మీరందరూ అనుభవించాలని ప్రార్థిస్తున్నాను. దీన్ని పొందటానికే ఆనాటి చక్రవర్తులు, రాజ్యాలువీడి, తపోనిమిత్తమై అడవులకు వెళ్లారు. కాని 'సహజమార్గము' ఈ సంసారిక జీవనం సాగిస్తూ, ప్రతిపని కూడా తపోమార్గంలోని భాగంగా మారుతూ మన దారిని సుగమ్యం చేస్తూ సాగుతుంది. ఉన్నత లక్ష్యమైన పరతత్వం పొందడానికి ప్రయత్నిస్తాము. పరతత్వం సాధించడానికి కావలసిన

అన్ని సహాయాలు నా శక్తిమేర చేస్తాను. కాని మీవంతు ప్రయత్నమే దీనికి ముఖ్యమైనది. మీరు దృఢ నిశ్చయంతో, త్రికరణశుద్ధిగా ప్రయత్నలోపం లేకుండా సాధించాలి. ఇదే మీయందరికీ నా ప్రార్థన.

# 26. పరిపూర్ణ స్థితికి దారిచూపు రాజయోగము

(ది.25-11-1977న టిన్సుకియా సత్సంగభవనం ప్రారంభ సమయాన ఇచ్చిన సందేశము)

టిన్సుకియా కేంద్రంలో ధ్యానమందిరాన్ని ప్రారంభిస్తున్న ఈ పవిత్ర దినాన మన సంస్థ అభ్యాసీలందరకూ, భారతదేశమునా, విదేశాలలోనున్న అందరికీ శుభప్రదమైన సంస్థగా ఋజువు చేయవలెనని నా ప్రార్థన.

అభ్యాసీలకు నేర్పిన సాధనా విధానములన్నియు వారిని పరిణామదశలో అంతిమ స్థాయికి చేర్చునన్న సాధారణ భావము కలిగి ఉందురు. వారి ఆలోచన ఇంతకంటే ముందుకు సాగదు. రాజయోగము మన పద్ధతికి పునాది అని సూచిస్తాము. అదే నిజముకూడ. వారి తలంపు నిగూఢముగా పోక సూత్రములు అనుసరించుటతో నిలిపివేయబడును. కాని సహజమార్గము నందు ప్రాణాహుతి యొక్క సువాసన అంతర్వాహినగా ఉన్నదన్నది యదార్థము. అయినను ప్రేమ, భక్తి అన్నవి వెనుకకు వదిలివేయబడినవి. ధ్యాన ప్రక్రియతో బాటు ఇవికూడ యిక్కడ చోటు చేసుకోవాలన్నది అవశ్యము. అన్ని భాగములను కలబోయవలెనని వక్కాణించుట నాకు అత్యవసరము. దీని వలన సాధకుడు లక్ష్యమును త్వరగా చేరగలడు. మీలో మీరు ఈ విషయాన్ని ప్రేరేపించుకోవలసిన బాధ్యత మీది. దీనికి సాధనమేమనగా భగవత్ స్మృతి ఎల్లప్పుడూ పోకుండా కాపాడుకొనుటయే. ఈ విధానమువలన మనసు పూర్తిగా అలసిపోతుందని, మహా అయితే ఒక అర్ధదినము మాత్రమే దీనిని నిలుపగలదు అని కొందరందురు. నువ్వు ఏ పని చేసినా "ఇది దైవాజ్ఞ అందువల్ల ఇది నిర్వర్తించుట నా విధి" అనే భావనతో చేస్తే భగవత్ స్మృతి నీకు నిరాటంకముగా కొనసాగుతుంది. దీనివల్ల కలిగే ముఖ్య ప్రయోజనము సంస్కారములు ఏర్పడవు. ఎల్లవేళల భగవత్ స్మృతిని నిలుపుకొనుట, దైవము వైపు అనురాగమును కలుగజేసి, ఆయన మీద ప్రేమ పెంపొంది, ఉప్పొంగిపోవు దిశవైపు జేర్చును. తద్వారా భక్తి పరిపూర్ణతను పొందును. అందువల్ల ఈ విధానం అవలంబించుట అత్యవసరము.

ఇక రెండవ అవసరము, మంచి నడవడిక. ఒకరు మనవైపు వేలెత్తి చూపునటువంటి సత్ ప్రవర్తన. మన దైనందిక జీవన విధానము అందరిపట్ల సత్ భావముతో నిష్కపటమై ఉండాలి. అలా చేయటం వల్ల, ఆనందాన్ని, సంతోషాన్ని పొందుతాం. వీటి ద్వారా మనలోపల శాంతి, ఆత్మానందస్థితి వెల్లివిరుస్తుంది. దైవ చింతనవల్ల భక్తి, ప్రేమ పెంపొందుతాయి. ఈ అభివృద్ధి పట్ల అనురాగాన్ని స్థిరంగా నిలుపుకోవటమే మీరు చేయవలసిన అతి ముఖ్యమైన పని. ఇది చేయలేకపోతే, సేవాధర్మంతో మెలిగే అభ్యాసి నెరవేర్చవలసిన ధర్మాన్ని, ఒక ఫకీరు

లక్షణాలనీ, మనిషిలో కలిగి ఉండవలసిన వాటిని పొందలేరు, వాటిని నిర్వర్తించనూ లేరు. దీని ద్వారానే మీ కర్తవ్య విమోచనము పూర్తగును. మన దృష్టిని మనం అంతర్ముఖంగా త్రిప్పుకుంటూ ఉంటామన్నది మహత్తర సత్యం. దీనిని ఇలా నిర్వర్తించడం వల్ల మనం అదేస్థానంలో, అంటే ఏ చోటినుంచయితే మనకు సారము వచ్చిందో ఆ చోట స్థిరంగా ఉంటాము. అంటే నిజమైన "భాండాగారము" మీద మన ముద్ర వేస్తాము. ఇప్పుడు ఈ విస్తరణ విధానాన్ని పెంపొందించుకొనడం మన చేతుల్లో ఉన్నది. మనం దేవుని ధ్యానించటం సాధన చేస్తున్నప్పుడే ఈ విస్తరణ విధానం జన్మిస్తుంది. ఈ ప్రయత్నం మన దృష్టిని ఇంకా ఇంకా అంతర్ముఖం గావిస్తుంది. దైవంతో బంధాన్ని పెంచుకోవాలన్న నిజమైన తపన మీలో పెరిగితే విజయం సాధించటానికి అట్టే సమయం పట్టదు. మీరు పరమానందం కొరకు సాగుతుంటే, నేను, మీ తపన గురించీ, నిర్విరామత గురించి చెబుతున్నాను. కానీ, సోదరులారా! ఈ తపన, నిర్విరామతల్లో లభించే ఆనందం, శాంతిలో పొందలేము. ఈ నిర్విరామత పెరిగి ఓ స్థాయిని చేరుకొనేటప్పటికి, అది శక్తిస్థాయిని అధిగమిస్తుంది. అప్పుడే నిజమైన శాంతి ఆవిర్భవించటం మొదలవుతుంది.

ప్రజలందరికీ ఆధ్యాత్మిక పరిణామపు అంతిమ దశకు సంబంధించిన సూచన ఇవ్వాలన్నదే నా ప్రగాఢ వాంఛ. సహజమార్గానికి సంబంధించిన బోధనలన్ని అత్యున్నతమైనవి. ఎందుకంటే, ఇది ఒక వ్యక్తి తాలుకు అంతిమ లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకొని దానిని ఎలా నిర్వహిస్తుందో బోధిస్తుంది. అత్యున్నత క్రమానికి చెందిన వాటిలో, ఉన్నతమైనవి సాధించటం కోసం సహకరించటమే, ఏ బోధనైన తమ లక్ష్యంగావించుకోవటం అవసరం. దైవ సాధనే లక్ష్యం గావించుకొని, మీరంతా నిర్విరామంగా కృషి చేయడం కొనసాగిస్తేనే నాకు నిజమైన శాంతి లభిస్తుంది. నా నిర్విరామత దీనికోసమే! ఈ విధంగా మీరెంత నిర్విరామ కృషి జరిపితే, నాకంత ప్రశాంతత లభిస్తుంది. మీరొక విషయాన్ని విశ్వసించండి! జ్ఞప్తి పెట్టుకోండి! - నేను, ప్రజలకు చేసే సేవకు తగిన ప్రతిఫలం నాకు ప్రశాంతత రూపంలో లభించాలంటే, మీరంతా విశ్రాంతి అనేది లేకుండా, కృషిచేయడం అనే ఒకే ఒక విధానాన్ని అవలంభించాలి. "దానికి" సంబంధించిన ఏ ఆలోచన ఆవిర్భవించకుండా, "దీనికి" సంబంధించిన భావనలో లోతుగా మనం నిమగ్నమై పోదాం!

# 27. సూక్ష్మమైన ఆధ్యాత్మిక మార్గము

(ది.30-04-1978న బెంగుళూరులో తమ 79వ జయంతుత్సవముల సందర్భంగా ఇచ్చిన సందేశము)

నా సమర్థ గురువర్యుల కృప మనలను వారి శాశ్వత వాత్సల్యం అనే తేజస్సు యొక్క చక్కని వెచ్చదనాన్ని పొందేటట్లు చేసింది. ఆయన ఆశీస్సు అనే దేదీప్యమానంగా వెలుగొందే జ్యోతిగా ఉన్న నేను కేవలము భారతదేశానికే కాక సర్వ ప్రపంచానికి చెందినవాడను. పరతత్వము యెడల గల ప్రేమలో దాగియున్న రమణీయతను మీరందరూ చవి చూడవలెనని నా అభిలాష. ప్రజలు ఎచ్చట చూచిననూ మంచి వాతావరణము, మంచి పరిస్థితుల కొరకు అన్వేషిస్తారు. భారతీయులమయిన మనము అదే విధమయిన వాతావరణాన్ని రూపొందించుకొనగోరతాము. దాని ప్రసారము వలన ఇతరులు లాభము పొందుగాక అని ఆశిస్తాము.

ప్రజలకు ఆధ్యాత్మికత యొక్క విలువ తెలియదు. ఏలన అటువంటి వాటిని సమాజంగాని, తల్లిదండ్రులు గాని, వారికి పరిచయము చేయలేదు. అయిననూ నేటి పరిస్థితులు ఆధ్యాత్మిక మార్గంలోనికి వచ్చేటట్లు మలచగలవు. వారికి మనము వాస్తవమైన శాంతిని చేకూర్చుటకు ప్రయత్నించవలెను. అది మన కర్తవ్యము, మన కార్యక్రమము. ప్రకృతి యొక్క ఒత్తిడి వలననే వారు సరియైన మార్గంలోనికి వచ్చే సమయము ఆసన్నమవుతుంది. అది వారి మేలు కొరకే.

ప్రతి పుష్పము తగిన ప్రమాణంలో పెరిగేటట్లు దైవము ప్రపంచాన్ని సృష్టించినాడు. కాని కాలవైపరీత్యాలు దైవ ప్రయోజనాన్ని మరచిపోయేటట్లు చేసినవి. అందువల్ల జీవిత లక్ష్యము కొందరు భోగాలను అనుభవించవలెను అని, మరికొందరు జీవితము విసుగు కలిగించేది అని భావిస్తారు. ఇక్కడ జీవితము అంటే ఏమిటి? అనే ప్రశ్న కలుగుతుంది. అది ఒక అస్తిత్వస్థితి. అది ఉన్నంతవరకు శాశ్వతంగా అస్తిత్వంతో సన్నిహిత సంబంధం కలిగి ఉంటుంది. అస్తిత్వము యొక్క పరిమళాన్ని అన్ని దశలలోనూ ఆఘ్రాణిస్తూ ఉంటుంది.

నీవు సూక్ష్మంగా అయినప్పుడే అస్తిత్వం యొక్క సూక్ష్మ స్థితిని అనుభవంలో గ్రహించగలవు. కాని దానిని మాటలతో చెప్పనలవి కాదు. ఆధ్యాత్మికత అనే నదీజలాన్ని అంతటినీ ఔపోసన పట్టవలెను అనే వాంఛ వ్యక్తికి ఉండవలెను. అప్పుడు అంతరంలోనూ, బయటగల వాస్తవశక్తి ఉదయించు సమయము ఆసన్నమవుతుంది. మనము వాంఛించిన దానిని అనుభూతి

చెందుతాము. అట్టడుగన ఉన్న బీజము దగ్ధమయినప్పుడు అవగాహన కలుగుతుంది.

వస్తువులు ఆవిర్భవిస్తూ, నశిస్తూ ఉంటాయి. వాటి రెండింటికీ మధ్యనున్నదే వాస్తవమైన స్థితి. మనయొక్క ఈ మార్పులేని స్థితి ఆధ్యాత్మిక చర్యకంతకును పరాకాష్ఠ. ఈ స్థితిని తెలుపడానికి ఏమీలేని స్థితి (శూన్యస్థితి) అనవచ్చు. తుదకు వ్యక్తిస్థితి అంతటినీ శూన్యపరచడం జరుగుతుంది. వ్యక్తి నిజమైన మానవుడు అవుతాడు. "మానవు"ని నిర్వచించడం కష్టము. కాని మనము "నిజమైన" అనే పదాన్ని చేర్చినప్పుడు మానవుడు ఏ సౌందర్యానికి చెందినవాడో నిర్వచించడము అవుతుంది. మార్పులేని స్థితి ఎల్లప్పుడునూ ఉన్నది. కాని మనము మార్పుచెందే దానితో సంబంధం కలిగి ఉన్నాము. దాని యెడల మనము ప్రీతికలిగి వుండడము గాని, లేకుండడము గాని జరుగుతుంది. కాని ఇవి రెండూ బంధంలోని గొలుసులే, మనము జీవితాన్ని గడపవలెనంటే వీటన్నిటినీ అతిక్రమించవలెను. మనము శ్రద్ధగా సాధనచేసినచో మన పద్ధతి ఈ ఫలితాలను సాధిస్తుంది.

ప్రతి జీవి సంతోషము, ప్రశాంతము అయిన జీవితాన్ని గడపవలెను అన్నది ప్రకృతిలో దాగియున్న నియమము. దానికి భిన్నంగా చేసినయెడల ఆయన సృష్టిని మాలిన్యపరచిన వారమవుతాము. మనమందరము గృహస్థులము. మన వ్యవహారములన్నిటిలోనూ మనము మితంగా వుండవలెను. నీటిలోని బాతులు, జలపక్షుల వలె జీవితం గడపవలెను. అవి నీటినుండి బయటకు వచ్చినప్పుడు వాటికి తడి ఉండదు. అదేవిధంగా మనము అన్నింటినీ ప్రేమించవలెను. కాని వ్యామోహము అనే మురికి మనలను అంటరాదు. నిజం చెప్పాలంటే మనము వ్యామోహరహిత వ్యామోహానిన నేరుచకొంటాము.

కుటుంబ జీవితము అర్థమైన జీవితము. ఏలన అందులోనే మనము ఇతరులను ప్రేమించడం నేర్చుకుంటాము. అది వాస్తవ జీవితానికి శిక్షణారంగము. వేర్పాటు తత్వాన్ని తొలగించుకొనవలెను. ప్రేమ అందరికీ సమానంగా ప్రవహించడం గమనిస్తావు. అప్పుడది విశ్వప్రేమ అవుతుంది. కుటుంబ జీవితము కలతలు, ఉద్రిక్తతలు మొదలైన వాటిని కలుగజేస్తుంది. కలత చెందడము అన్నది మానవులకు ఉంటుంది. కాని జంతువులకు కాదు. అది నిజానికి దైవము నుండి మానవులకు కలిగే ఒక గొప్ప అనుగ్రహము అవుతుంది. అది ఎందువలన? అది వ్యక్తిని ఉన్నత దశలకు తీసుకువెళ్ళే విజ్ఞానంలో ఒక భాగము. నేతపనివాడు తన వివేకంతో బట్టలు నేస్తాడు. అతడు తన చేతులతో కృషిచేస్తాడు. అతడు తన వివేకంతో చేతులు కదుపుతాడు. వివేకానికి తన కేంద్రము ఉన్నది. అది అవసరమైనప్పుడు శారీరక కృషికి కూడ సహాయకారిగా ఉంటుంది.

మనోబలము లేకుండుటను నీకు నీవే తొలగించుకొనవలెను. సైనికుడు యుద్ధరంగంలో ఎన్నడునూ భీతిచెందడు. ఏలన అతనికి ఒక లక్ష్యము ఉంటుంది. ఆత్మ విశ్వాసము ఉన్నప్పుడు ధైర్యం కలుగుతుంది. ధ్యేయాన్ని చేరాలి అనే దృఢసంకల్పము ఉన్నప్పుడు ఆత్మవిశ్వాసం కలుగుతుంది. మనము గమ్యాన్ని గూర్చి ఆలోచిస్తూ కలాన్ని వృథాచేయడం కంటె భవిష్యత్తును నిర్మించుకొనడానికి ప్రయత్నించవలెను. మనము ముందుకు వేగంగా పురోగమిస్తూ ఉన్నప్పుడు వెనుకకు తిరిగిచూడము. సుఖరహితమయిన జీవితంలో కూడ మనము సుఖంగా ఉండడానికి ప్రయత్నించవలెను. అన్ని పరిస్థితులలోనూ సంతోషముగా ఉండేవాడే అత్యంత సుఖజీవనుడు. అది యోగి లక్షణము.

మనము దివ్యశక్తి నుండి ఆవిర్భవించినాము. అది మనకు ఆధారము. కాని అది మనకు కనుమరుగైనది. మనలను మనం నిలబెట్టుకొనవలెనంటే దానిని మనం తిరిగి పొందవలెను. సత్ పదార్థమువైపు అంతర్గతంగా జాగృతము కావడానికి మార్గము ప్రేమయే. ఈ మౌలిక సూత్రాన్ని దృష్టియందుంచుకొని సహజమార్గము ముందంజ వేసింది.

ఆశించిన గమ్యము చేరడానికి, మానవాళి ఆశలు ఫలింపచేయడానికి, ఆయన కృప మనలను నడుపుగాక - తథాస్తు.

# 28. ముక్తికి మార్గము చూపు రాజయోగము

(ది.30-04-1979న అహ్మదాబాదులో తమ 80వ జయంతుత్సవముల సందర్భంగా ఇచ్చిన సందేశము)

అన్నియుగాలకు, ప్రాంతాలకు చెందిన ఆయన బిడ్డల యొక్క సంక్షేమం కొరకు, సర్వశక్తి సంపన్నుడైన గురువర్యుల యొక్క మార్గంలో పయనించు వారి కార్యక్రమాన్ని సమీక్షించటానికి మనము మళ్ళీ సమావేశమైనాము. లయావస్థలోని "రుచిలేని రుచిని" ప్రపంచంలోని నా సోదర సోదరీమణులంతా చవి చూడవలెనని నేను కుతూహలంతో ఎదురు చూస్తున్నాను. అపుడే మీరంతా మన పద్ధతి యొక్క ప్రభావాన్ని గ్రహించగలరు. మనము జీవించే జీవితము జీవితముకాదు. దానికావల ఇంకా ఏదో ఉన్నది. ఆయన యెడలనే భక్తిగలిగి ఉంటే మనమందరము ఇంకా మెరుగైన రోజులను చూడగలమని విశ్వసిస్తున్నాను.

భగవంతుడు లేడు అనే భావంతో మనము ఉండరాదు. మనము ఉండవలసిన స్థానము అదియే (దైవమే). అదియే జీవితానికి ప్రధాన లక్ష్యము, కొందరు తెలిసి, కొందరు తెలియకుండాను మనమంతా ఆ దివ్యత్వము వైపు పయనిస్తున్నాము, ఎరుకతో పయనించే వారు నిశ్చలజలాలలో ఈదుతూ ఉన్నట్లున్నారు. ఎరుకలేకుండా పయనించేవారు ఎడారి ఇసుకలో కాళ్ళు, చేతులు జాడిస్తున్నారు. నిజానికి గురువర్యులు ఇద్దరికీ (అభ్యాసి, దైవము) మధ్యవర్తి. అభ్యాసికి, దైవానికి మధ్య సంబంధము నెలకొల్పటానికి ప్రయత్నిస్తారు. అలా జరిగితే ఆయన కర్తవ్యము కొంతభాగము నెరవేరినట్లే.

జీవితానికి అర్థము ఏమి అని ప్రజలు ప్రశ్నిస్తారు. కొందరి దృష్టిలో జీవితము నిరర్థకము. కాని అట్టి భావము ఆత్మహత్యా సాదృశ్యము. జీవితము అర్థవంతము ఏలన దానితోపాటు, ఒక శక్తి కలుగుతుంది. ఎవరైతే దానిని తమలోనే ఉంచుకోవాలని భావిస్తారో వారికది అమూల్యమైనది అనే విషయాన్ని అది గుర్తు చేస్తుంది. ఆధ్యాత్మిక జీవితమువైపు తిరగడమే, జీవితానికి ఆరంభము కాగలదు. జీవితంలోనే గుప్తంగా ఉంచబడే "జీవితంలోని జీవితము" దాని యొక్క అత్యున్నతస్థితి. మనము ప్రవేశించవలసిన అట్టి జీవితం కొరకు బయలుదేర వలెను. మన అభ్యాసము అంతా ఆ జీవితానికి దారి చూపుతుంది.

నిద్రాణమైన స్థితిలో ఉన్న మానవునికి ప్రాణాహుతి నూతన జీవితాన్ని ప్రసాదిస్తుంది. మానవులకు ప్రత్యేకించబడిన అత్యున్నత స్థితిని చేరడంకోసం మనలను తయారు చేస్తుంది.

అంతేకాదు, పురోగతికి ప్రతిబంధకంగా ఉన్న వాటినన్నిటినీ ధ్వంసం చేస్తూ వ్యక్తి అంతటిలోనూ పరివర్తన తీసుకొని వస్తుంది. సాక్షాత్కారము అనేదానికి నిజమైన అర్థము "మరణానికి మరణము", "అంతానికి అంతము". వ్యక్తి ఈ స్థితిలో లీనమైనచో మార్గము సుగమమైనట్లే. భారతదేశంలో చాలామందికి ప్రాణాహుతి అంటే ఏమిటో తెలియనంతగా కాలం మారిపోయింది. చాలావరకూ అంతరించిపోయిన మూలానికి నా గురువర్యులే వెలుగును ప్రసాదించినారు. మానవాళికి ఆయన ఇచ్చిన సందేశం ఏమంటే "ఓ బంధితులారా, ఇప్పుడు విముక్తులు కావడానికి ఇక ప్రయత్నించడం మొదలు పెట్టండి".

ముక్తి అంటే అందరికి ఇష్టము. కాని "ముక్తి నుండి విముక్తులగుటకు" కొద్దిమంది మాత్రమే ప్రయత్నిస్తారు. సమర్థ గురువునకు సంపూర్ణ విధేయతవల్ల ఉన్నత స్థితి లభిస్తుంది. సత్ పదార్థంతోనే పరిపూర్ణ బంధము వ్యక్తిని అన్ని ఇతర బంధాల నుండి విముక్తుని చేస్తుంది.

ముక్తి ప్రాపంచిక బంధాల నుండి వ్యక్తిని విడుదల చేయగలదు. వ్యక్తి తన పరిణామాన్ని కోరినప్పుడు ప్రకృతి అతనికి సహాయపడుతుంది. వైద్యుడు తానురోగిని ఎంతగానో ప్రేమిస్తూ ఉన్నప్పటికినీ అతనికి చేదు మాత్రము ఇస్తాడు. తన సృష్టి అర్హము, పవిత్రము, పరిశుద్ధము అయినదిగా ఉండాలని భగవంతుడు తలుస్తాడు. పరిణామానికి అవసరమైనది ప్రతీది ఉండేటట్లు దైవము చూడడము ఒక ప్రకృతి నియమము. "పని చేతకాని వాడు పనిముట్లను నిందిస్తాడు", అనే ఒక సామెత ఉన్నది. మనము ఏదైతే చెడ్డది, ఇబ్బందితో కూడినది అని భావిస్తామో అదే ముక్తికి మార్గం అవుతుంది. నా గురువుగారు కాలేయంలో వ్రణంతో బాధపడుతూ ఒక శిష్యుని కంటతడిని చూచి "నా ఆరోగ్యాన్ని క్షణంలో నయం చేసుకోగలను, కాని నేను దైవేచ్ఛను మార్చదలచలేదు" అని అన్నారు.

నిజానికి మనవల్ల భ్రష్టము చేయబడినదై కారాగారము అనదగిన ప్రపంచంలో మనం జీవిస్తున్నాము. మనము దుష్ట ఆలోచనలను గ్రహిస్తాము. దాని ప్రభావము ఈ ప్రపంచంలో ఉన్నది. మనం నిజానికి చెరసాలలో ఉన్నప్పటికినీ చెరసాలలో ఉన్నాము అనే భావముతో ఉండరాదు. నేరస్తులు ఖైదులో ఉంటారు, ప్రభుత్వాధికారులు కూడ ఖైదులో ఉంటారు. నేరస్తులు తాము ఖైదులో ఉన్నాము అని భావిస్తారు, ప్రభుత్వాధికారులు ఖైదులో ఉన్నాము అని భావింపరు. కష్టాలు ఉన్నచోటే అమృతము కూడా ఉంటుంది.

మనస్సును క్రమశిక్షణలో పెట్టుకొనబడమువల్ల క్రమశిక్షణలో లేని మనస్సు వల్ల కలిగే బాధలు, కష్టాలు తొలగిపోగలవు. సహజమార్గ సిద్ధాంతాలను పాటిస్తే అది సాధ్యము అవుతుంది. ఏదో ఒక విధంగా కుటుంబ సభ్యులను ఆధ్యాత్మికత వైపు మరల్చినచో గృహ వాతావరణము

మార్పు చెందుతుంది. ప్రపంచ సంపదలకన్న అంతర్గత శాంతి చాలా ముఖ్యము. మనము అంతర్గతంగా పెరిగినప్పుడు బహిరంతరాలు రెండునూ ఒకటిగా అవుతాయి. ఈ విధంగా పవిత్రత సర్వత్రా వ్యాపిస్తుంది. ఆ విధంగా మనము ప్రకృతికి కూడా సహాయపడతాము.

ప్రతిచోట ప్రజలలో ఆధ్యాత్మికత కొరవడింది. ఈ లోటును భర్తీ చేయటానికి మన మందరము కృషి చేయాలి. మన కృషి ఉన్నప్పటికినీ పుష్పము ఇంకనూ వికసించలేదు (మనము సఫలీకృతులం కాలేదు). మన కృషిలో లోపం ఉన్నది అని కాదు. కాని ప్రజలు తగినంత సహకారము అందించుటలేదు. మనకు శక్తి ఉన్నది. కాని దానిని ఆహ్వానించే వైఖరిలేదు. కాలక్రమేణ అదికూడా పెరుగుతుంది. మన సంస్థయొక్క వాణి ప్రతిధ్వనించినప్పుడు అది దాదాపు ప్రతిచోట అలుముకొని ముందు వెనుకలలో తన ఫలితాలను కలిగిస్తుంది. కాబట్టి మన కృషి ఎన్నడునూ వృథాకాదు. ఎడతెరిపి లేకుండా నీటి బిందువులు పడుతూవుంటే నది ఏర్పడుతుంది.

మానవులందరియెడల మనము సుహృద్భావంతో ఉండవలెను. అప్పుడు శక్తి అప్రయత్నముగా వారివైపు ప్రసరిస్తుంది. ఆధ్యాత్మిక పునర్వికాసానికి ఇది మొదటి మెట్టు అని నా భావము. ఈ పునాదిపైన ఆధ్యాత్మిక మందిరాన్ని నిర్మించాలి. మానవాళి సంక్షేమం కోసం కృషిచేయాలి అనే ఉద్దేశ్యం ఉన్నచో నీకు అది సహజంగానే లభిస్తుంది. మంచి మార్గం గైకొనడానికి, ప్రజలకు తగు రీతిలో బోధించుట మన కర్తవ్యము. మానవాళికి నీవు కొంత మంచి చేసినట్లయితే అది నీ కర్తవ్యమే కాని కోరిక కాదు. నా గురువుగారు నాకు ప్రసాదించిన హృదయము ఎంత విశాలమైనది అంటే, దానితో మానవాళినంతటినీ కప్పివేయవలెనని ఉన్నది. నా గురువర్యుల సహాయం నాకు అండగా ఉన్నది.

గురువర్యుల ఆశీస్సులు భువికి అవతరించుగాక! నిరాశా బంధముల నుండి అందరినీ సహజ మార్గము వాస్తవిక శాంతి, ముక్తి వైపు నడుపుగాక! తథాస్తు!

# 29. ఆధ్యాత్మిక సాఫల్యతకు మార్గము

(ది.30-04-1980న ఢిల్లీలో తమ 81వ జయంతుత్సవముల సందర్భంగా ఇచ్చిన సందేశము)

నా ప్రియమైన సోదరీ సోదరులారా !

యోగము భారతదేశమందు అనాది కాలము నుండియు సుపరిచతమైనది. కాని కొంతకాలము, ఈ యోగాభ్యాస ప్రచారము ఆగియుండినది. ఏలయన స్థూలమునుండి - సూక్ష్మతత్వసారమును గ్రహింపగల విధానము, దేశమందు విస్మరింపబడినది. భారతదేశమిపుడు తనయందే తాను అణిగిపడి యున్నది. ఆ ప్రవృత్తియే దాని నుండి యిపుడు బయటకు ప్రసరించుచున్నది కూడ. కావుననే భారతీయ ప్రజానీకము యొక్క యదార్థమైన చైతన్యము ప్రశస్తమైన రీతిని, భావప్రకటనము గావించుటకు సిద్ధమైనది. అట్లు చేయుట వారికి విధాయకమైనది. ఏలయన మున్ముందు మంచి సమయము రానున్నది.

పరివర్తన శీలమై (మారుచుండు స్వభావము గలది) అనే తత్వముతో నిండియున్న వానియందు అంతర్గతమై యున్న వస్తువును, ఒకటియే అయిన దానిని మనము చూడజాల కుండుటయే మన దురదృష్టము. కావున మనము చైతన్య స్వరూపమును, మన బాహ్యదృష్టితోనే గ్రహింపజూతుము. ప్రాచీన భారతీయ ఋషులు మానవజాతి శ్రేయస్సు కొరకై ఎంతయో కృషిగాంచిరి. కాని వారియందు అధికాంశము సత్‌తత్వ రహస్యమును యోగ్యులైన కొందరకు మాత్రమే అందుబాటులో నుంచిరి. అయితే నేను సమర్థులైన నా సద్గురువర్యుల యాజ్ఞాను సారము ఆ సత్‌తత్వ రహస్యమును వెల్లడిగావించి, జన సామాన్యమునకు సమర్పింప గోరుచున్నాను.

లోకము మనయందున్నది. మనము లోకమందున్నాము. ఇందెట్టి సందియమును లేదు. అయితే ఈ లోకమున కాధారభూతమై అందు దాగియున్న సత్‌తత్వమునే మనము వెదకవలయును. ధ్యానము మున్నగు నితర సాధనములన్నియు ఈ ప్రయోజనమును సాధించుట కొరకే, భగవంతుడు మనకు గోచరింపకుండ, తన్ను మరుగుపరచుకొనియున్నాడని భావింతుము. అట్లనుకొనుట సరికాదు. మనమప్పుడప్పుడు నక్షత్రములను జూతుము. ఇంకను ప్రయత్నించిన సూర్యుని తేజస్సును జూడగలము. సూర్యునే దర్శింపగల సమయమును వచ్చును. అనగా అట్టి సామర్థ్యము మనకు కల్గును. అయితే మనము సూర్యతేజస్సు మీదనే

దృష్టి యుంచినంతకాలము - అనగా దానినే భావించుచుండునంత కాలము యథార్థమైన సూర్యుడు మనకు కనబడకయే యుండును. సకల సృష్టికిని మూలమైన సత్‌తత్వమునే మీరందరును చేరవలయునని నేను సత్యముగా హృదయపూర్వకముగ ప్రార్థింతును.

ఒకవేళ 'లేకుండుట' (Not to be) యే జరిగెనేని లోకము యొక్క అస్తిత్వమే లేకపోవలయును. దీనిని ఆధ్యాత్మిక దృష్టితో పరిశీలించినచో 'ఉండుట' అనునది 'ఆత్మ' యొక్క ఉనికియే అయితే ఆత్మ లేకుండుట (Non self)యను అనాత్మ భావమునకు జేరి యాలోచింతుమేని, ఉండుట (To be) అస్తిత్వమునకు స్వస్తిజెప్పి (Annihilate) లేకుండుట యను దాని యదార్థస్థితి వరకు లోతునకు వెళ్లవలసియున్నది. దీని యర్థము 'జీవితము కాని జీవితము' (Life without life) అగును. 'మనము ఉన్నాము'. 'మనము లేము' ఇట్లు ఉండుట - లేకుండుటకు మూలమైన ఒక భావము - (One in Himself) మనలను ఒకానొక స్థితికి గొనివచ్చును. అదియే - జ్ఞానము. ఆ జ్ఞానము తనంతట తానే బహిరంగపరచినపుడు అది 'అజ్ఞానము' మాత్రమే. ఆ స్థితియందు వ్యక్తి యొక్క కోర్కెల సముదాయమనెడి నివాసమంతయు ధ్వంసమై పాడుబడిపోవును. విషయలిప్తమైన వ్యక్తిత్వమనెడు (Besmeared individuality) గిన్నె బ్రద్దలైపోయి తనయందేమియు ఉంచుకొనుటకు యోగ్యతలేనిదగును. రూపురేఖలు చెడి పాడుబడిన 'బస్తీ' వంటిదగునని భావము.

'ఆధ్యాత్మికత' దివ్యత్వ సిద్ధియందు సమాప్తమగును. కాగా దివ్యత్వము దానికి మూలమగు సత్‌తత్వమందు పర్యవసించును. సాధకుడు ముక్తి పొందిన పిమ్మట, భగవంతుని సామీప్యస్థితి నందుకొనును. అచట మౌనముకూడా మౌనమగును. జీవన్ముక్తికూడ ఆధ్యాత్మికతయందు ఒక అధ్యాయము. భౌతిక తత్త్వము అదృశ్యమైన పిమ్మట భౌతిక విజ్ఞానము దానికి వివరింపజాలదు. ఆధ్యాత్మికత, పరమశ్రేష్ఠమైన పరాత్పర తత్త్వచేతన యొక్క అనుభూతియే. ఇది విశుద్ధమును, సంపూర్ణమగు దివ్యత్వముతో కూడిన అంతటా సమత్వమైన శ్రేష్ఠతమ క్షేత్రమందు ప్రవేశించు సింహద్వారము. సత్‌తత్వముతో పోల్చుకొనినచో మనము (వ్యక్తి) సర్వ శక్తిమంతుడునగు మహా సాగరమందు ఒక బిందువుతో సమానమగును. మనమంతా ఏదియో ఒక విధముగ, బిందువు (నీటిబొట్టు) స్థితి నుండి నదీ స్వరూపమును పొంద ప్రయత్నింపవలసి యున్నది.

నేను అన్యులకు సేవజేయు అభిలాషను నాయందు పెంపొందించుకొంటిని. కావున, లోకమున మానసికమగు అస్థిరత, మూఢత మున్నగు లక్షణములను సృష్టించెడు ఆలోచనలు కార్యములతో సతమతమగుచుండు మానవులను సేవించుటకు దగిన శ్రేష్ఠతమ సాధనములను నిరంతరమును అన్వేషించు చుండును. విషమున్న చోట అమృతముకూడ ఉండును.

మనము సూర్యునికి అభిముఖముగ నిల్చున్నచో మనకు వెలుతురు లభించును. కాని సూర్యునికి వెన్ను జూపి నిల్చున్నచో మనకు చీకటి లభించును. అనగా మన ప్రయత్నము చేత మనకు వెలుగు చీకటులు రెండును లభించుచున్నది. మన కార్యమునకు మనము కర్తృత్వమును అంటగట్టుకొనినచో, అప్పుడు కష్టమునెదురగును. యదార్థమునకు ముండ్ల పొదలయందును పరమ సుందర పుష్పములు వికసించును. అవి నేత్రపర్వముగను మనోహరముగను నుండును. అట్లే భగవంతుడును, తన వృక్షమునకు (సృష్టికి) ఒక పుష్పమగుచో మనము భగవంతుని నుండి 'అనుగ్రహ' లాభమును పొందుదుము, కాని ఆ చెట్టు (సృష్టి) వలన మాత్రముగాదు. ఇంటి యావరణమున, మురుగు కాలువలు మున్నగునవి యుండును. అవి ఉపయోగకరములుగ నుండునట్లు వాటిని వాడుకొనవలయును గాని వాటిని పగులగొట్టబోము. వాటిని ఇంకను శ్రేష్టములుగ నుండునట్లు మార్చుకొందుము గాని నాశనము చేయము.

అట్లే సంఘమందు మంచివారున్నారు. అయితే వారికి ఆధ్యాత్మికత పట్ల శ్రద్ధాసక్తులు లేవు. అట్టి వారికి, ఆధ్యాత్మికతా సౌరభము, పరిమళము లభించెనేని వారు తమ వ్యక్తిత్వమును పునరుజ్జీవింపజేసికొని, దానిని రూపాంతరము (Transformation) నొందించుకొను మార్గమున ముందడుగు వేయుదురు. కాని మనము అట్టి పుణ్యాత్ముల పట్ల శ్రద్ధబూనవలెను. వారి స్థితిని చక్కబరుప బ్రయత్నింపవలెను. వారియందు సత్‌తత్వ ప్రాప్తికొరకు తృష్ణ ఉదయించి, వారు సద్గురువర్యుల శరణమునకు వచ్చునట్లు తగిన ప్రయత్నము జేయవలెను.

నా యభిప్రాయము ప్రకారము ప్రాచ్య పాశ్చాత్యుల నాగరికత యందలి భేదము స్వల్పము. మనము అంతర్దృష్టి నలవరచుకొనుటకు సాధనముగా పరమ శ్రేష్ఠమగు చైతన్యమును మాత్రమే వినియోగించు చుండగా పాశ్చాత్యులు అట్టి ప్రయోజనమును సాధించుటకు తమ భౌతిక శక్తులను మాత్రమే ప్రయోగించి అట్టి దృష్టిని అలవరచుకొందురు. ఆధ్యాత్మికత కేవలము భారతీయుల సొంత ఆస్తికాదు. కాని అది అందరియొక్క జన్మహక్కు. ప్రపంచమందలి యన్ని ప్రాంతముల మన సోదరీసోదరులందరును, ఆధ్యాత్మికలాభము కొరకు మనవైపు మాత్రమే ఆశగొని యుండరాదని నా యభిప్రాయము. ఆ కారణము చేతనే నేను శిష్యులనుగాక గురువులనే తయారుచేయుదును.

లోకమందలి ప్రతిదేశమును, ఆధ్యాత్మికతయందు తన భాగమును తాను తప్పక పొంది తీరవలెననియే నా యభిప్రాయము. ఇప్పుడు ప్రపంచమందంతటను ప్రజానీకము ఆధ్యాత్మికముగ జాగరూకమైయున్నది. సామ్యవాదులు (కమ్యూనిస్టులు) సైతము సమయము వచ్చినప్పుడు ఈ విధానమును స్వీకరింతురు. ఆధ్యాత్మికతకు ఆధారభూతమైన దివ్యశాంతికి

సన్నిహితముగ దాదాపు మనమెల్లరమును చేరుకొనియున్నాము. ఈ స్థితి యింకను విశ్వవ్యాప్తమైనపుడు అది వారిని, శాంతికి పిమ్మటయేమి కలదో అంత వరకును కొనిపోగలదు. ఇప్పటికి మనకు శాంతికి పూర్వమేమి కలదో అది మాత్రమే తెలియును. అయితే శాంతికి పిమ్మట యేమి కలదో ఆ సంగతి కొలది మందికి మాత్రమే తెలియును.

నా కార్యము నానాటికి సులభమగుచున్నదని, నా అనుభవము దెలుపుచున్నది. ఏలయన యిది యిపుడు దివ్యాజ్ఞ. ఇపుడు దాదాపు ప్రతి యొకడును శాంతినే కోరుచున్నాడు. ఈ శాంతి యొక్క శిఖరస్థితి (పరాకాష్ట) సత్ తత్వమునందే ప్రవేశించును.

మన ప్రశిక్షకులు అభ్యాసి జనసముదాయము యొక్క సమగ్ర సంస్కార పరివృద్ధిని దృష్టియందుంచుకొని సేవ కొనసాగింతురేని ఆధ్యాత్మికత మనకు నిత్యసన్నిహితమై మన వెన్వెంటనే యేతెంచునట్టి ఆ సుదినము తప్పక రాగలదని నేనాశింతును. నేనత్యంత వార్ధక్య దుర్భలకాయుడను. అయినను యదార్థమగు శాంతిని, మానవత్వమునకు సన్నిహితము గావించుటకు మిక్కిలిగ ప్రయత్నించుచున్నాను. నా యెదుటనున్న కార్యసాధన యందు నేను యోగ్యులైన స్త్రీ పురుషుల సహకారమును గోరుచున్నాను. ఈ లోకము స్వర్గమగు ననుటలో సంశయము లేదు అయితే అందులకు దృఢమైన పరిశ్రమ అవశ్యకము. దివ్యత్వము ఎల్లవేళల యందును మన యధీనమందున్నంతగ మనలో గట్టిపట్టు మాత్రముండవలెను. నేనెప్పుడును నిరాశుడనుకాలేదు. నేను ఒంటరిగానే నా కర్తవ్యమునందు నిమగ్నుడనై యుంటిని. అట్టి దీక్షా ఫలితమే నేడు మన కళ్ళెదుట నున్నది. నా సమర్థ గురువర్యుల దివ్యహస్తము నా వెనుక వెలుగొందుచుండ నేనెల్లప్పుడును ఆత్మ విశ్వాసపూరితుడనైయున్నాను. నా సాఫల్యమునకు యీ ఆత్మ విశ్వాసమే నాకు శ్రీరామరక్ష. మీ యందఱి నుండియు నేను ఇట్టి ప్రయోజనమునే ఆశించుచున్నాను.

ప్రేమ ప్రతి కార్యమును సులభతరము గావించును. మానవుని అంతిమ లక్ష్యమునకు జేర్చు మార్గమును సుగమము గావించు నిమిత్తము, ఈ ప్రేమయే గురువర్యుల కృపావృష్టిని గురిపించి ప్రశస్తము గావించగలదు. సోక్రటీసు ప్రకారము ప్రేమ దివ్యసుందర ప్రాప్తికొరకు, మానవాత్మకు ఆకలియగును. కాని నా యభిప్రాయము ప్రకారము సత్‌తత్వము జేరుకొనుటకు ప్రేమ ఆంతర్యమైన మేలుకొలుపు. ఎల్లరను ప్రేమించువాడిని ప్రేమించుము. ఆ విధముగా ప్రేమించువాని ద్వారా ప్రతివారు స్వతహాగా ప్రేమించబడుదురు. తథాస్తు !

# 30. సత్‌తత్వసారమును గ్రహింపచేసే గురువర్యులు

(ది.25-05-1980న జర్మనీ దేశములోని మ్యూనిచ్‌లో ఇచ్చిన సందేశము)

ఆ సర్వశక్తిమంతునికడకు కొనిపోవుదారి ఒక్కటి మాత్రమే. ఆయన్ని చేరు పద్ధతి ఎప్పుడూ ఒకటే. మరి అది నిట్టనిలువుగానున్నది. దీనిని నీవు జాగ్రత్తగా గౌరవించిన యెడల, అక్కడ ఒకే ఒక లంబకోణము ఉండగలదు. దివ్యత్వము ఒక క్రీడ, మరి దైవము దాని మార్గము ! నురగలు క్రక్కుతూ, కలతనొందిస్తున్న ఆ మహాసముద్రపు కెరటములోనికి ప్రజలను ప్రవేశంచేలా ఆకర్షించునది అదియే. సత్‌తత్వసారమును లోనికి గ్రహించేలా చేయుట గురువర్యుల విధి అవుతుంది. దీనికొరకు గురువు పూర్తిగా అవసరము. ఇది నీవు ఆలోచించ వలసిన విషయము. ఆ గురువర్యుల నుండి సత్‌తత్వాన్ని, సారాన్ని గ్రహింపనిదే ఆ సమస్య పరిష్కరింపబడజాలదు. నా సర్వస్వము అయిన నా గురువర్యుల లాంటి వ్యక్తి మరొకరు నాకు తటస్థపడలేదు. నేను అన్ని విషయాలను సరియైన మార్గములో చర్చిస్తాను కనుక, నేను పొరబడలేదనకుంటాను.

# 31. అగోచరము వైపు ప్రయాణము

(ది.08-03-1981న దక్షిణ ఆఫ్రికా ప్రయాణపు చివరన ఇచ్చిన సందేశము)

నేన నా సహచరులను అభినందిస్తున్నాను. ఆ అగోచరము వైపు వెళ్ళండి. అందరినీ ప్రేమించే ఆయనను (దైవము) ప్రేమించండి. గమ్యము ఎంతోదూరము లేదు. స్మరణమే దానికి గల పరికరము. అందరికీ దీవెనలు.

# 32. పరతత్వమునకు రాజయోగ మార్గము

(తమ 82వ జయంతుత్సవాల సందర్భంగా మలేషియాలో ఇచ్చిన సందేశము)

ప్రియ సోదరులారా !

మానవుడు తనకు తెలియకనే తనకై తాను సృష్టించుకొన్న పరిసరాలచే సాధారణముగా ఎంతగా ఆకర్షింపబడినాడంటే, దానికి అతీతముగా వెళ్ళటానికి ఎప్పుడోగాని ఆలోచించడు. అయితే ఇది ఎలా సాధ్యపడగలదు? దానిని గురించి ఆలోచించినప్పుడు, మనకు తెలియునదేమిటనగా మనము మనలో ఒక ఆలోచనల సముదాయాన్ని ఏర్పరచుకొన్నాము. దానికి మన బుద్ధి బలముతో పెంపొందింపబడిన ఉద్వేగాలను చేకూర్చుచున్నాము. అన్ని మూలలనుండి వచ్చే అభిప్రాయాలు అదే శృతిని చెవులలో ప్రతిధ్వనింపజేస్తూ ప్రత్యేక బలాన్నిస్తూ, వాతావరణ ప్రభావాన్ని ఇంకా దృఢపరుస్తున్నాయి. ఈ నరుని నిస్సహాయత ఒక సాకుగా పరిగణింపవచ్చును. అయితే నేను చెప్పునదేమిటంటే, ఇవి వినాశకరముగా మనము గుర్తించినప్పుడు, అక్కడ కొంత దారిమార్పు ఏర్పడవచ్చు. ఇది వైరాగ్య పథములో మొదటి మెట్టుగా గ్రహించవచ్చు, మరి అప్పుడే మన ఆలోచన ఉన్నతమైనదీ, మేలైనదైన వేరొక దానిపై స్థిరపడుతుంది. దానిని దృఢముగా గ్రహించి ఎట్టి పరిస్థితులలోనూ విడిచి పెట్టక అంటిపెట్టుకొని వుండటమే మన కర్తవ్యము. వైరాగ్యము మనలో తనకు తానై వృద్ధి చెందుతుంది.

జీవిత లక్ష్యము అతి సులభముగా సాధింపబడగలదు. కావలసినదల్లా లక్ష్యము పట్ల అంకిత భావము వహించుట మరియు మొదటి నుండి చివరివరకు గురువర్యుల ఎడల భక్తి భావన నిలుపుకొనుట. ఆయనను నిరంతరము స్మరించటానికి విభిన్న పద్ధతులున్నాయి. అత్యున్నతమైన దాని పట్ల భక్తి ఏర్పడిన వెంటనే, మనము ఆయనకు మనకు మధ్యన ఒక మార్గాన్ని ఏర్పరుస్తామన్నమాట. అది ఆయన దగ్గరికి ఒక బాట అవుతుంది. మార్గము పొడవునా వున్నటువంటి మురికి, చెత్తా చెదారములను తొలగించగానే అది శుభ్రమైపోతుంది, మరి దానిగుండా నడవటానికి ఎటువంటి ఇబ్బంది వుండదు. మన భక్తికి తగినట్లు ఆ బాట పరిశుభ్రమవుతుంది. ఆయనపై ధ్యానించేటప్పుడు, హృదయమునుండి నీకొక తోపుడు కలుగుతుంది, అది దారిలో ముందుకు నెట్టుతుంది. ఘర్షణతో కూడిన భావాలే ఆ చెత్తాచెదారములు. ధ్యానకాలమందు, నీవు ఒక తాత్కాలిక ప్రశాంతతను పొందిన ఎడల, మార్గములో నీవొక అడుగు ముందుకు పోయినట్లే లెక్క. నీవు ఆ మార్గములో ప్రవేశించగానే ఘర్షణపడే భావాలన్నీ మాయమగునట్లు గ్రహించగలవు. నీ ధ్యానములో నీవు ఒక శాశ్వత స్థితని పొందగానే, అదియు

ఆ ఆంతరిక స్థాయిని తాకగానే ఆ పరతత్వము లేదా భగవంతుని భావన నీకు అతి చేరువ అవుతుంది.

ఈ పరతత్వమును చేరు మార్గమును గురించి ప్రస్తావిస్తూ ఋషులు ఇలా చెప్పారు "ఆవల మరీ ఆవల". ఇలా మనము చెబుతుండగా, అంతా బాగానే వున్నట్లనిపిస్తుంది. అయితే మనము ఆచరించ ప్రయత్నించినప్పుడు, విషయాలు కొంత క్లిష్టతరమవుతాయి. ఎందుకంటే తగినంతగా తయారుగాలేము. మన అభ్యాసాన్ని శ్రద్ధగా చేసినప్పుడు 'నేను' అనెడి చైతన్యము దూరముగాను దగ్గరిగానూ వుంటూ చివరికది సైతము మాయమగును. ఎల్లప్పుడూ మనకు కనిపించు సాధారణ తప్పిదము ఏమిటంటే, అందరూ 'నేను'ను శత్రువుగా భావిస్తారు. అది ఒక నిరాకరించదగిన అనురాగమన్న మాట, అది మన ప్రయత్నాన్ని మరీ కఠిన పరుస్తుంది. గమ్యాన్ని చేరుటకు వీలు లేకుండా చేస్తుంది. మనము 'నేను'ని గురించి ఆలోచించునప్పుడు, అది మన ఆలోచనా శక్తివలన మరీ దృఢపడుతుంది. యీ ఆలోచనాశక్తి ఏకాగ్రత వలన ఏర్పడినది. 'నేను'ని మరచిపోవటానికి ప్రయత్నించండి, అది ఎంతో సహాయకారి కాగలదు. ఒకసారి దివ్యత్వము ప్రకాశించినచో, జీవితము పట్ల నిరాసక్తత ఎంతో దూరము వెళ్ళిపోతుంది. గతమును నిర్మూలించడమనేది సహజమార్గములో ఒక అధ్యాయము.

మనము లక్ష్యమును గురించి ఆలోచించునప్పుడు, దానిపట్ల గల అనురాగము ఆ దూరాన్ని మన కనుచూపుమేరలోనికి తీసుకు వస్తుంది, ఎందుకంటే మనము అలాంటి ఆలోచనకు అలవాటు పడియున్నాము కనుక. మొదట మనము పదార్థమునకు వెనుక ఏదైతే వున్నదో, దానిలోనికి ప్రవేశిస్తాము, మరి మనము అడుగును మాత్రమే తాకుతున్నాము, ఆ సత్‌తత్వమును కాదు. ఒక శబ్దం యొక్క ప్రతిధ్వని ఎక్కువ దూరము ప్రయాణము చేసినప్పుడు అది క్షీణింప నారంభిస్తుంది. ఆ తర్వాత చుట్టుప్రక్కల అంతా నిశ్శబ్దమే. మనము ఇంకా వున్నత స్థితిలోనికి వెళ్ళగలము అనటానికి ఇది ఒక జాడ అని నేను నమ్ముతున్నాను. మనము లోతుల్లోనికి వెళ్ళి ముత్యములు తెచ్చుకొనే విధంగా నిశ్శబ్దము ఎక్కడి నుంచి మొదలవుతుందో ఆ జీవితములోనికి ప్రవేశించినప్పుడు దీన్ని సాధించవచ్చు. మనిషి వివేకమంతా ప్రతికూల విషయాలను అనుకూలముగా మార్చుకొనుటలోనే వుంది. మరోలా చెప్పాలంటే, మొత్తము భౌతిక శక్తిని ఆధ్యాత్మిక శక్తిగా మార్చటానికి విజయవంతులయ్యేలా మనము ప్రయత్నించాలి; మనకు సమర్థవంతులైన గురవర్యులు లభించినప్పుడు అది సహజమార్గ విధానములో సంభవిస్తుంది. మన దేహములోని అన్ని కణములు ఆధ్యాత్మికముగావింపబడి ఆ సత్‌తత్వము తన ప్రకాశమును వెలుపలికి వెదజల్లనారంభిస్తుంది. నా సేవల వల్ల పూర్తి లాభమును పొందే లాంటి ఆత్మలను నేను తయారు చేస్తున్నాను.

జీవించటములో ప్రత్యేక అర్థము కలదు. కేవలము జీవించటమే కాదు ఆ అత్యున్నతమైన దానిని సాధించుటలోనూ అర్థమున్నది. ఒకడు జీవించి వుండగానే మరియు అస్థిత్వము కలిగియున్నప్పుడే ఆ ఆత్మయొక్క తపన చాలా బాగా తృప్తి పరచబడగలదు. చెలియలికట్ట ఎక్కడున్నదో ఎవరికీ తెలియదు. నా గురువర్యుల శిక్షణలోని సౌందర్యమేమిటంటే ఆ ఆధ్యాత్మిక జీవనము పెరుగుతున్న సామర్థ్యముతో కూడిన ప్రాపంచిక జీవనమునకు సమాంతరముగా నడుస్తుంది. మనస్సును క్రమబద్ధము చేయుటయు గురువర్యుల బాధ్యతగాగల ఒక పద్ధతిలో నీవు సంబంధమేర్పరచుకొనటానికి నీవు నిశ్చయించి యుండిన యెడల, దయచేసి నిజాయితీతో సాధనచేయటానికి ప్రయత్నించుము, మరి కొంతకాలము అయినంతనే నీదగు అనుభవమును పొందగలవు. ఆధ్యాత్మికములో అంతరాయమంటూ లేదు, అక్కడ శ్రద్ధ మరియు ఆ పరతత్వ ప్రాప్తి నొందుటకు కావలసిన తపన వుంటేచాలు. ఈతి బాధలు మరియు మానసిక రుగ్మతలు ఆధ్యాత్మికముపై ప్రబావము వహింపజాలవు. నా గురువర్యులు నిస్సందేహంగా ప్రకటించిన దేమిటంటే : "సాధన నీ బాధ్యత అయితే ఆధ్యాత్మికము నా బాధ్యత".

మతమనేది దైవ సాక్షాత్కారమనే బాటలో దారిచూపే స్తంభములాంటిది. అయితే సరైన దారిని నీకు నీవే ఏర్పరచుకోవలసి వుంటుంది. మానవాళికి ఎన్నో సమస్యలున్నాయి; మరి అలాంటప్పుడు ఒకడు ఒక సమస్యతోనే పెనుగులాడుతుంటే అతనికి అది అడ్డుగోడై నిలుస్తుంది. నిరాశలు మనల్ని పిరికి వాళ్ళుగా చేస్తాయి. మనము ఎలాగైనాసరే నిరాశలో 'ని' అన్న పదాన్ని తొలగించగలిగితే అక్కడ మిగిలేది 'ఆశే'కదా. అంటే మనము దేన్నో ఒకదానిని పొందటానికి ఆశపడాలి; మరి ఒక పనిని సాధించుటకు ఆశ కలుగగానే, ఆ పనిని మనము సాధింపజాలమని ఎన్నడూ అనుకోము. అంటే ఒక విదమైన అల నెమ్మదిగా పనిచేస్తున్నది, మరి నీవు దానిని అనుసరిస్తున్నావు. అలాంటప్పుడు, గతాన్ని గురించిగాని భవిష్యత్తుని గురించి గాని ఎలాంటి భావన లేదక్కడ. భగవత్ సామ్రాజ్యములో పులిలా వుండుము, మరి నీ ప్రగతి తథ్యము అనుకొనుము.

మన సంస్థ ముఖ్యోద్దేశమేమిటంటే ఇప్పుడున్నటువంటి అనాధ్యాత్మికము స్థానములో ఆధ్యాత్మికమును ప్రతిష్ఠింపచేయాలన్నదే, అదియు సహజమార్గముద్వారా, గురువర్యుల సందేశాన్ని ఉద్ఘోషిస్తూ "ఓ నిద్రిస్తున్న ప్రజానీకమా, మేలుకోండి, ఇది ఉషోదయ వేళ!". మార్పు అనునది, బహుశః, ఉన్న విధాన వెంటనే కలుగక పోవచ్చును. మన సంస్థలోని సభ్యులందరూ ప్రేమ, ఓర్పు మరియు పరస్పర సహకారముతో వ్యవహరించిన యెడల, సంస్థ లక్ష్యము తప్పక సాధింపబడగలదు. సూర్యునిలా ప్రకాశింప గలిగే వ్యక్తులు మన సంస్థలో వుండటము నాకెంతో అవసరము. మన పద్ధతి సరియయినదని తెలిసినచో ప్రజలు

తమంతట తామే ఆకర్షింపబడెదరు. వందలాది గొఱ్ఱెల కంటే ఒక సింహము వుండటము ఎంతో మేలు; అయితే మానవులుగా ఇతరులకు ఆధ్యాత్మికముగా మేలు చేయుటకు మనము తప్పక ప్రయత్నము చేయాలి. గురువర్యుల మార్గంలో నిజాయితీతో కూడిన ప్రయత్నము ఎన్నడూ వృధాపోదు. శుభమగుగాక.

# 33. ఆధ్యాత్మిక లక్ష్యము

(ది.30-01-1982న షాజహాన్‌పూర్‌లో బసంత్ పంచమినాడు ఇచ్చిన సందేశము)

“మనమంతా మానసికంగా, నైతిక, ఆధ్యాత్మిక పరంగా సహోదరులం. ఇదే మానవ జీవితపు ప్రధాన లక్ష్యము. ఇప్పుడు అవీ, ఇవీ, అన్నీ పోయినవి. నిలిచినదల్లా ఆయన పనిలోనూ, పరిసరల్లోనూ పవిత్రత మాత్రమే. ఇది పరతత్వముతో కూడిన మనుష్యుల ఆధ్యాత్మిక లక్ష్యాన్ని అల్లుతుంది.”

# 34. సత్‌తత్వ ప్రాప్తికి తపన

(ది.30-04-1982న సూరత్‌లో తమ 83వ జయంతుత్సవముల సందర్భంగా ఇచ్చిన సందేశము)

ప్రియమైన సోదరీ సోదరులారా !

జీవులకు అన్నివేళలా కష్టాలు, దుఃఖాలు ఉంటాయి. అయినప్పటికి మనకు శరీరముమీద అధిక వ్యామోహము ఉంటుంది. అది చివరి వరకూ మనలను విడువదు. మనము పునర్జన్మను కూడ కోరుకుంటాము. మన కోరిక ప్రకారము సంపన్న గృహంలో జన్మించాలనుకున్నా రాజకుటుంబంలో జన్మించాలనుకున్నా, అది ఒకటే. ఏలన వ్యక్తి శరీరం దాల్చి జీవుడు అయినాడంటే చాలు అది ఎంత సూక్ష్మరీతిలో ఉన్నా దుఃఖము మొదలవుతుంది.

కాని మన సత్సంగసమూహము కొంత భిన్నమైనది. మనలను గూర్చి కూడ మనకు తెలియరాని స్థితిలో మనమున్నాము. మనకు సహజంగానే స్థిరత్వము ఉన్నది. దానిని సమతాస్థితితో కూడిన సమతాస్థితి అని వర్ణించవచ్చును. దాని తరువాతనే ప్రతీదీ ఆరంభమైనది. మరోలా చెప్పాలంటే సృష్టి (బ్రహ్మ), స్థితి (విష్ణు), లయ (మహేశ్వరుడు) కారకులు అవతరించక పూర్వమే మనమున్నాము. అయితే ఇప్పుడు అక్కడ ఏమి ఉన్నది? మహత్ ఉన్నదా? ఉన్నది అనలేము. మనము చేరవలసిన గమ్యం ఏది? మనము దానిని అత్యంత అల్పత్వము అనవచ్చును. దానిని మనము ఆవిధంగా పిలువదలిస్తే దానిని గూర్చి ఏ మాత్రము తెలియనంతటి అల్పత్వము ఒక విధమయిన ఔన్నత్యమే అంటే సాదృశ్యాత్మకము, అందు సాదృశ్యాత్మక జ్ఞానంకూడ ఉండదు. సోదరులారా! ఇది యాదార్థమైన సారము.

మనలను మనము గొప్పవారము అనుకుంటే మనం చేరవలసిన గొప్ప గమ్యానికి, మనకు అడ్డుగోడ నిర్మించుకుంటాము. మనము బంధాన్ని సృష్టించుకున్నామన్నమాట. అది మన మార్గంలో ప్రతిబంధకంగా నిలుస్తుంది. మనలను మనం అధికులం అనుకున్నప్పుడు కలిగే హాని ఏమిటి? ఇతరులను తక్కువగా చూడడం ప్రారంభిస్తాము. మనము కష్టపడి పయనించవలసిన మార్గంకూడ మూసుకుపోతుంది. నిజానికి మనం ధ్యేయాన్ని కోల్పోయి దారి తప్పినవారమవుతాము. ఒక వ్యక్తి వేరొకనిని ఒక ప్రత్యే విషయంలో అతిక్రమించినాను అని భావిస్తాడు. అది వివిధ రీతులలో ఆరంభమవుతుంది. ఏమీ లేనిదే అహంభావాన్ని పెంచుకుంటాము. దానివల్ల మనకు లభించేది ఏమీ లేదు. మన మనస్సులో ఆత్మస్తుతి

జరుపుకుంటూ ఉంటాము. ఇలా ఉండి మనం ఎంతో పోగొట్టుకుంటాము.

అహంభావము వ్యక్తిలో ఒక లోపము. అది తొలగిపోనంతవరకూ వ్యక్తికి తన ఆధారం ఏమిటో తెలియదు. వ్యక్తిలో అహంకారము పూర్తిగా తొలగింపబడినప్పుడు ఉండేటటువంటి స్థితిని, 'ఆధారము' అనే పదంతో వ్యక్తీకరించడం జరిగింది, అని నేను భావిస్తాను. ఆ స్థితిలో జీవించడం మానవ సంస్కృతి. ఆ స్థితి కొంచెం స్థూలముగా అయిన యెడల అప్పుడు అది అణుకువ, నమ్రత అనే లక్షణము పరిధిలో ప్రవేశిస్తుంది. ఆ స్థితిని పొందినప్పుడు ఆ వ్యక్తి (of the Lord) వాస్తవమైన వ్యక్తిగా రూపొందుతాడు. ఆ స్థితిని పొందవలెనంటే కొన్ని వందలమార్లు ప్రాణాహుతి ప్రసారము, ప్రార్థనలు నిర్దేశించబడినాయి. మానవుడు తన స్థాయినుండి దూరము కాకూడదు. ఈ స్థాయిని "అభూదియత్" (అణిగిఉండుస్థితి) అన్నారు. ఇది వ్యక్తి (of the Lord) యొక్క ముఖ్యలక్షణము. నేను తరుచు ఉదహరించినట్లు ఇక్కడ (ఈ స్థితిలో) అహంభావం యొక్క భారము బాగా తగ్గి వుంటుంది. ఫలప్రాప్తి అటుపై కలుగుతుంది. సరియైన మార్గం ఏమంటే, నీవు ఎవరివైననుసరే దీని అంతటిలోను అంతిమ లక్ష్యం వైపు సాగవలెను. ఆవైపు అతని దృష్టి మరలకుండా ఏమాత్రం కూడ మిగిలి ఉండరాదు. దీని భావమేమంటే, ఉన్నవన్నీ - అంటే భౌతికము, ఆధ్యాత్మికము, సమస్తము కూడ ఆయనకు అర్పణచేయవలెను. నీ దగ్గర స్మృతి (స్మరణము) తప్ప మరి ఇక ఏమియు మిగిలి యుండరాదు.

ఆ స్థితికి చేరుట ఎట్లు? అనే ప్రశ్న ఉదయిస్తుంది. ఆ ఒక్క "స్మృతి"యే తనతోపాటు అన్నిటినీ గొనివస్తుంది. స్మృతి ఉన్నట్లయితే స్మరింపబడేది నీకు సన్నిహితంగా ఉంటుంది. క్రమంగా పెరిగే స్మృతి యొక్క తీవ్రతాపం ద్వారా ఆ సన్నిహితత్వాన్ని పెరగనిమ్ము. తరువాత ఎంత ఆనందము, పరవశము కలుగుతాయో గమనింపుము. దాని (సన్నిహితత్వము) సహాయంతో నీవు అక్కడకు ఎంత త్వరగా చేరుకోగలవో గుర్తించుము. ఆరంభము అనదగిన హద్దును అది (సన్నిహితత్వము) చేరిన యెడల, అంటే ఒకవేళ ఆ ఆవరణ, మండలము, లేక వృత్తము స్పృశించింది అంటే ప్రియురాలి ద్వారం వద్ద గల గంట మ్రోగించినట్లే. ఎవరో ఒక వ్యక్తి, ఒక వాస్తవ అన్వేషకుడు, ప్రియుడు ఆయన వద్దకు వచ్చినట్లు గ్రహించగానే, ఆయన నీకు అతి సన్నిహితంగా రావడానికి కచ్చితమైన స్థితి ఏర్పడుతుంది. నీవు ఆ గృహంలోనికి ప్రవేశించకుండా ఉంటే ఆటంకం తొలగించబడుతుంది. ఒక క్షణము ప్రయత్నింపుము, అప్పుడు అది ఏమిటో నీకు తెలుస్తుంది.

ఒకమారు దీనిని సాధించగలిగినపుడు నీవు దివ్యలక్షనాలు పొందినవాడవుతావు. ఈ లక్షణాలను పొందిన తదుపరి నీవు సూర్యకాంతిలోనికి వచ్చినట్లు చెప్పుకోవచ్చు. ఈ కాంతి సూర్యుని నుండే వస్తుందనడం స్పష్టము. అంతకు పూర్వము మనం మన లక్షణాలను మాత్రమే

ఎరుగుదుము. ఇప్పుడు దైవానికి ఆవల అనగా దాని వెనుకనే నీ ఈత ఆరంభము అయినది. ఇక్కడ వరకూ వచ్చిన పిదప ఇంకనూ ముందుకు వెళ్ళే సూచనలు గోచరిస్తాయి. స్మృతి అభివృద్ధి చెందుతూ, స్మృతి యొక్క ఎరుకకూడా లేకుండా పోయినప్పుడు స్మృతి యొక్క స్వరూపము మారిపోతుంది. మనము ముందుకు వెళ్ళిన కొలదీ ఇది తెలుస్తుంది. "తనకు ఎరుక ఎంతవరకూ ఉన్నదో దానిని గూర్చిన ఎరుకయే ఉండదు". దానిని బహిర్గతం చేయడానికి ఇంకనూ తగిన సమయము రాలేదు. ఒకడు ఆ స్థితిని తనంత తానే చేరడానికి ప్రయత్నించి చేరుకున్నప్పుడు దానిని గూర్చిన సూచనలు కలుగుతాయి. సూక్ష్మంగా విషయం ఏమంటే మన సర్వస్వమూ ఆయనకు అర్పించాలి. "నీ శిరస్సును సమర్పించి దైవాన్ని పొందవచ్చునంటే అదీ మంచి చౌకబేరమే అని నీవు తెలుసుకోవాలి".

ప్రభువు యొక్క సంకల్పాన్ని ఆనందంతో అంగీకరించబడడాన్ని ప్రాచీన ఋషులు శరణాగతి అని భావించినారు. ఇప్పుడు నేను ఒక ఆదేశమును ఇచ్చుచున్నాను. ఆయననే చేరుకోవాలి అనే పవిత్రము, సరళము అయిన "తపన" ఉండవలెను. ఆరంభంలో వాస్తవ తపన లేకపోయిననూ అనుకరింపుము. ఎవరైననూ ఎల్లవేళలా ఒక పిచ్చివానిని అనుకరిస్తే అతడు పిచ్చివాడు కావలసినదే. అదే విధంగా ఒక వ్యక్తి ప్రభువును (పరతత్వము) చేరజూచినప్పుడు తుదకు ఆ సత్‌తత్వము తప్పక కలుగుతుంది. తథాస్తు !

# 35. పారిస్ ప్రకటన

(1982 ఆగష్టులో పారిస్‌లో ఇచ్చిన సందేశము)

మనమందరము ఒకటి. సహజమార్గము సమీకృతపరచడానికి వెలిసింది. సంస్థ పూర్వాపరాలను పరిశీలించినప్పుడు క్రమశిక్షణ యొక్క వాస్తవికమయిన తత్వాన్ని మనం గుర్తించే అవకాశము ఉంది. రెండు వైపులు కనిపిస్తున్నాయి. కాని అందు కొంతలోపము ఉంది. మన సంస్థను మన హృదయములో ఉంచుకొన్నట్లయితే ఆ లోపాన్ని సులువుగా తొలగించగలము. సంస్థ మనస్సులో మాత్రమే ఉండరాదు. కాని చాలామందిలో అది మనస్సులోనే ఉంటూ ఉన్నది. ఇక మిగిలనదేమనగా ఆ భావము (సంస్థ హృదయంలోనే ఉండడము) సామాన్య దృష్టికి తీసుకొనిరావలసి ఉన్నది. నీటిలోని బుడగలవలె అనేక వక్రాలు ఆటంకాలవలె ఉన్నాయి. వాటిని మనము చాలా సులభంగా తొలగించవచ్చు. ఎందుకంటే మీ వెనుక శక్తి పనిచేయుచున్నది. ఆ శక్తిని గూర్చిన జ్ఞానము మనలో కించిత్తు అయిననూ లేదు.

రానున్న సంఘటనలకు కూడ సహకారము ప్రాణము. కాని ప్రజలు ఊగిసలాడుతూ ఉంటే శక్తిని వృధా చేసినవారవుతారు. మనము మన సామూహిక ప్రయోజనం కోసం ఏకమైనాము. మానవుల క్షేమము, మానవాళి శ్రేయస్సు, సరియైన క్రమము ఏర్పాటు చేయుటయే ఆ సామూహిక ప్రయోజనము.

సేవను పొందడంకంటే, సేవచేయడం మేలు అనే ధ్యేయముతో శ్రీ రామచంద్ర మిషన్, షాజహాన్‌పూర్‌లో నిలచింది. అందరినీ ఒకే సరళిలోను, క్రమశిక్షణతోనూ మలచి మానవాళికి సేవచేయటం జరుగుతుంది.